అమ్మ
రూ॥ 350/-
పేజీలు: 400


ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

సంపుటి 27, సంచిక: 304 | శుక్రవారం | 25-04-2025 | హైదరాబాద్

Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar

పేజీలు: 12 | వెల రూ. 5.00

## నేడు హైదరాబాద్‌లో క్యూబా సంఘీభావ సభ

సిపిఐ, సిపిఐ(ఎం) రాష్ట్ర పార్టీల ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం 5 గంటలకు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో క్యూబా సంఘీభావ సభ జరుగుతుంది. ఈ సభలో క్యూబా కమ్యూనిస్టు పార్టీ అంతర్జాతీయ వ్యవహారాల విభాగాధిపతి ఎమిలియో లోజాడా ముఖ్య అతిథిగా ప్రసంగిస్తారు. సిపిఐ రాష్ట్ర నాయకులు వివిఎస్ బోస్, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు టి జ్యోతి పాల్గొంటారు.

# ఉగ్ర శిబిరాలు ధ్వంసం చేయండి

**పార్టీలకు అతీతంగా నాయకుల డిమాండ్**
**ఉగ్రవాదుల అణచివేతపై ప్రభుత్వం వెంటే ఉంటాం**
**అఖిలపక్ష సమావేశంలో ప్రతిపక్షాల భరోసా**
**ఉగ్రవాదంపై కఠిన చర్య తీసుకుంటామని ప్రభుత్వం హామీ**



**న్యూఢిల్లీ:** ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేసేందుకు నిర్ణయాత్మక చర్యలు తీసుకోవాలని అఖిలపక్ష సమావేశంలో పార్టీలకు అతీతంగా నాయకులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఐతే అదేసమయంలో అంతర్గత భద్రతా వైఫల్య సమస్యను కూడా ప్రతిపక్ష నాయకులు ప్రధానంగా ప్రస్తావించారు. దక్షిణ కశ్మీర్ అనంతనాగ్‌జిల్లా పహల్గామ్ సమీపంలో పర్యాటకులను కాల్చి చంపిన ఉగ్రవాదుల మారణకాండపై ఢిల్లీలో గురువారం నాడు అఖిలపక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పార్టీలకు అతీతంగా రాజకీయ నాయకులు దేశ భద్రతకు అనుగుణంగా ఏకాభిప్రాయం వ్యక్తం చేశారు. ఉగ్రవాదులను అణచివేసేందుకు ప్రభుత్వం తీసుకునే చర్యలకు సంబంధించిన సమస్యపై ప్రభుత్వానికి అండగా నిలబడతామని పార్టీల నాయకులందరూ భరోసా ఇచ్చారు. సంక్షోభ సమయంలో జాతీయ ఐక్యతాముఖచిత్రాన్ని ప్రతిబింబింపజేయడంలో ఈ సమావేశం ఎంతగానో దోహదం చేసింది. ప్రభుత్వం తన అధికారిక వైఖరిని ప్రతిపక్షాలకు వివరించడమేకాకుండా, ప్రతిపక్షాలు స్వేచ్ఛగా తమ అభిప్రాయాలను ఈ సమావేశంలో ప్రకటించారు. జరిగిన ఘటనపట్ల నాయకులు తీవ్ర ఆందోళన, ఆవేదన వ్యక్తం చేశారు. ఉగ్రవాదంపై కఠిన చర్యలు తీసుకుంటామని అఖిలపక్షసమావేశానికి అధ్యక్షత వహించిన రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ పాల్గొన్న నాయకులకు హామీ ఇచ్చారు. సంఘటన అనంతర పరిణామాలు, ప్రభుత్వ ఆలోచనావిధానం, తీసుకున్న నిర్ణయాలను రాజ్‌నాథ్‌సింగ్ పార్టీల నాయకులకు తెలియజేశారు. ఉగ్రవాద దాడి జరడానికి ప్రభుత్వం వైపు నుండి జరిగిన లోపాలను, లోపాలు తిరిగి తలెత్తకుండా గట్టి చర్యలు తీసుకుంటామని కేంద్ర హోంశాఖాధికారులు, ఇంటిలిజెన్స్ అధికారులు కూడా నాయకులకు వివరణ ఇచ్చారు. సమావేశం అనంతరం పార్లమెంటరీ వ్యవహారాలమంత్రి కిరెన్ రిజిజు సమావేశంలో వివరాలను మీడియాకు తెలియజేశారు. జమ్మూ కశ్మీరులో పరిస్థితులు ఇప్పుడిప్పుడే మారుతూ తరువాయి 2లో

జమ్ముకశ్మీర్‌లో పహల్గామ్‌లోని బైసారన్‌లో ఉగ్రదాడి నేపథ్యంలో భారత్, పాకిస్థాన్ మధ్య పరస్పరం చర్య, ప్రతిచర్యలు కొనసాగుతున్నాయి. బుధవారం కేంద్ర ప్రభుత్వ సిసిఎస్ సమావేశమై పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా ఐదు కీలక నిర్ణయాలు తీసుకుని వాటిని తక్షణ ప్రాతిపదికపై అమలులోకి తీసుకువచ్చింది. 1960లో పాకిస్థాన్‌తో చేసుకున్న సింధు జలాల ఒప్పందం రద్దు చేసింది. వాఘా సరిహద్దు మూసివేసింది. ప్రత్యేక వీసాల రద్దు, పాకిస్థాన్ దౌత్యకార్యాలయంలో సిబ్బంది సంఖ్యను 55 నుండి 30కి కుదించింది. పాకిస్థాన్ దౌత్యకార్యాలయాల్లో పనిచేసే సైనిక సిబ్బంది, దౌత్యాధికారులను అవాంఛిత వ్యక్తులుగా ప్రకటించి దేశం విడిచి వెళ్ళాలని చెప్పడంతోపాటు తాజాగా వైద్యపరమైన వీసాలతోపాటు పాకిస్థాన్ జాతీయులకు ఇచ్చిన అన్ని రకాల వీసాలను రద్దుచేస్తున్నట్లు భారత ప్రభుత్వం ప్రకటించింది. భారత పౌరులను పాకిస్థాన్‌లో పర్యటించవద్దని కూడా గట్టి ఆదేశాలు జారీ చేసింది. అయితే పాకిస్థాన్ ప్రతి చర్యలకు దిగింది. గురువారం పాకిస్థాన్ జాతీయ భద్రతాకమిటీ (ఎన్ఎస్‌సి) సమావేశం జరిగింది. అనంతరం ప్రభుత్వం ఒక ప్రకటన విడుదల చేసింది. భారత్ తరహాలోనే ఈ సమావేశంలో షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వం పలు నిర్ణయాలు తీసుకుంది. సింధుజలాల ఒప్పందాన్ని రద్దుచేసిన చర్యను తిప్పికొడతామని ప్రకటించింది. భారతదేశం దుస్సాహసం చేయకుండా దేశ సార్వభౌమాధికారాన్ని, సమగ్రతను రక్షించుకునేందుకు త్రివిధ దళాలూ పూర్తి శక్తిసామర్థ్యాలతో సన్నద్ధంగా ఉండాలని ఎన్ఎస్‌సి సమావేశం తీర్మానించింది. భారతదేశంలో చేసుకున్న వాణిజ్య ఒప్పందాలు, ద్వైపాక్షిక ఒప్పందాలను రద్దుచేస్తున్నట్లు ప్రకటించింది. అదేవిధంగా 1972 జులై 2వ తేదీన ఇందిరాగాంధీ, జుల్ఫికర్ అలీ భుట్టో మధ్య కుదిరిన సిమ్లా ఒప్పందాన్ని కూడా రద్దుచేస్తున్నట్లు ప్రకటించింది. పాకిస్థాన్ గగనతలంలోకి భారతదేశ విమానాలకు ప్రవేశాన్ని నిషేధించింది. వాఘా సరిహద్దును మూసివేసింది.

## సింధుజలాల ఒప్పందం రద్దు యుద్ధచర్య

- ఎంతమూల్యమైనా చెల్లించి నీటి హక్కు సాధిస్తాం
- పాక్ ప్రకటన




ఇస్లామాబాద్ : సింధుజలాల ఒప్పందం రద్దును యుద్ధ చర్యగా పరిగణిస్తామని పాకిస్థాన్ ప్రటించింది. షెహబాజ్ షరీఫ్ (ప్రధానమంత్రి)అధ్యక్షతన గురువారం జరిగిన పాకిస్థాన్ జాతీయ భద్రతాకమిటీ (ఎన్ఎస్‌సి) సమావేశం అనంతరం ప్రభుత్వం ఒక ప్రకటన విడుదల చేసింది. త్రివిధ దళాధిపతులతోపాటు కీలకమంత్రులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. భారత్ తరహాలోనే ఈ సమావేశంలో షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వం పలు నిర్ణయాలు తీసుకుంది. సింధుజలాల ఒప్పందాన్ని రద్దుచేసిన చర్యను తిప్పికొడతామని ప్రకటించింది. భారతదేశం దుస్సాహసం చేయకుండా దేశ సార్వభౌమాధికారాన్ని, సమగ్రతను రక్షించుకునేందుకు త్రివిధ దళాలూ పూర్తి శక్తిసామర్థ్యాలతో సన్నద్ధంగా ఉండాలని ఎన్ఎస్‌సి సమావేశం తీర్మానించింది. పాకిస్థాన్ శాంతికి కట్టుబడి ఉంది, కానీ దేశ సార్వభౌమాధికారాన్ని, గౌరవ మర్యాదలను, చెక్కుచెదరని హక్కులను, భద్రతను ఉల్లంఘించడానికి ఎవ్వరినీ అనుమతించదని స్పష్టం చేసింది. భారతదేశంలో చేసుకున్న వాణిజ్య ఒప్పందాలు, ద్వైపాక్షిక ఒప్పందాలను రద్దుచేస్తున్నట్లు ప్రకటించింది. అదేవిధంగా 1972 జులై 2వ తేదీన ఇందికాగాంధీ, జుల్ఫికర్ అలీ భుట్టో మధ్య కుదిరిన సిమ్లా ఒప్పందాన్ని కూడా రద్దుచేస్తున్నట్లు ప్రకటించింది. పాకిస్థాన్ గగనతలంలోకి భారతదేశ తరువాయి 2లో


05

### ఉగ్రవాదులకు ఊహించని శిక్ష విధిస్తాం

- భూమిపై ఏమూలకు ఉన్నా వెంబడిస్తాం
- ప్రధాని మోదీ ప్రకటన


05

### మన గణతంత్ర విలువలపై నేరుగా జరిగిన దాడి

- పాకిస్థానే సూత్రధారి, ఇది పిరికిపంద చర్య
- దాడిని ఖండిస్తూ సిడబ్ల్యుసి సమావేశం తీర్మానం

### సీతమ్మ సాగర్ ప్రాజెక్టుకు అధికారికంగా 67 టిఎంసిల కేటాయింపు

- బ్యారేజీ నిర్మాణానికి సాంకేతిక అనుమతులు
- డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క వెల్లడి

03

# ప్రపంచానికి దారిచూపేలా భారత్ సమ్మిట్

**నేడు హైదరాబాద్‌లో ప్రారంభం**

- రెండు రోజుల పాటు నిర్వహణ
- 100కు పైగా దేశాల నుంచి 450 మంది ప్రతినిధులు హాజరు
- సమ్మిట్‌లో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే కీలక ఉపన్యాసం
- నేడు హైదరాబాద్ డిక్లరేషన్ ఆవిష్కరణ
- వివరాలు వెల్లడించిన ఉప ముఖ్యమంత్రి భట్టి




ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 'భారత్ సమ్మిట్2025'ను ఈ నెల 25, 26 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించనుంది. ఈ సమ్మిట్‌లో ప్రపంచవ్యాప్తంగా 100కు పైగా దేశాల నుంచి 450 మందికి పైగా ప్రతినిధులు పాల్గొననున్నారు. అంతేకాకుండా 100కు పైగా ప్రగతిశీల రాజకీయ పార్టీలు, 40 నుంచి 50 మంది వరకు మంత్రులు, మరో 50 మంది వరకు ఎంపిలు, సెనేటర్లు ఈ సమావేశానికి హాజరు కానున్నారు. భారత్ సమ్మిట్‌లో అంతర్జాతీయ న్యాయం, సమానత్వం, ప్రగతిశీల సహకారం, ఆర్థిక న్యాయం, యువత–భవిష్యత్ రాజకీయాలు వంటి అంశాలపై ఉన్నతస్థాయి ద్వైపాక్షిక, సైద్ధాంతిక చర్చలు, ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4.15 గంటల వరకు ప్యానెల్ డిస్కషన్స్ జరుగుతాయి. ఈ నెల 25వ తేదీన సదస్సు మొదటి రోజు 'హైదరబాద్ డిక్లరేషన్'ను ఆవిష్కరించనున్నారు. సదస్సులో లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే, కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు ప్రియాంక గాంధీ, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ ప్రసంగిస్తారు. అర్జెంటినా విదేశాంగ మాజీ మంత్రి జోర్జ్ టయానా, కొలంబియా కార్మిక శాఖ మాజీ మంత్రి, సెనేటర్ క్లారా లోపెజ్ ఓబ్రెగాన్, స్వీడన్ విదేశాంగ మాజీ మంత్రి అన్ లిండె, క్యూబా కమ్యూనిస్టు పార్టీ తరువాయి 2లో




# దేశ భద్రతపై స్వార్థ రాజకీయాలొద్దు

- ఆర్టికల్ 370 రద్దు తరువాత కశ్మీర్‌లో ప్రశాంతత నెలకొందని ఊదరగొట్టింది
- ప్రజాప్రభుత్వం ఏర్పడినా రాష్ట్రస్థాయి అధికారాలు లేవు
- వక్ఫ్ చట్టంతో మతపరమైన విభజనకు కేంద్రం యత్నం
- సిపిఐ జాతీయ సమితి సమావేశంలో డి.రాజా

**తిరువనంతపురం :** జమ్ము కశ్మీర్‌లో టెర్రరిస్టుల హత్యాకాండ దేశ ప్రజలను దిగ్భ్రాంతికి గురిచేసిందని, దేశ భద్రతకు చేపట్టే చర్యల్లో స్వార్థ రాజకీయ ప్రయోజనాలకు పాల్పడకుండా చూడాలని సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా అన్నారు. ఆర్టికల్ 370 రద్దు తరువాత కశ్మీర్‌లో ప్రజా ప్రభుత్వం ఏర్పడినా, దానికి రాష్ట్ర స్థాయి అధికారాలు లేవని, యూనియన్ టెరిటరీగా ఉన్నదన్న వాస్తవాన్ని గుర్తించాలన్నారు. కశ్మీర్ సరిహద్దుల, దేశ భద్రత కేంద్ర ప్రభుత్వం, రక్షణ, హోం మంత్రిత్వ శాఖలే నిర్వహిస్తున్నాయని రాజా అన్నారు. ఆర్టికల్ 370 తరువాత కశ్మీర్‌లో ప్రశాంతత నెలకొన్నదని చెప్పిన బిజెపి ప్రభుత్వం పహల్గామ్ సంఘటన పట్ల ఏమి చెబుతుందని ఆయన ప్రశ్నించారు. సిపిఐ కేరళ రాజధాని తిరువనంతపురంలో రెండు రోజుల పాటు జరుగుతున్న సిపిఐ జాతీయ కౌన్సిల్ సమావేశం ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన బహిరంగ సభలో డి.రాజా ప్రసంగించారు. బహిరంగ సభకు కేరళ రాష్ట్ర సిపిఐ కార్యదర్శి బినోయ్ విశ్వం అధ్యక్షత తరువాయి 12లో




### ఉగ్రవాదాన్ని అంతమొందించేందుకు ప్రపంచ దేశాల చర్యలు

- పహల్గామ్ దాడి ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి
- ఎఐఎస్ఎఫ్ డిమాండ్
- ముష్కరుల దిష్టిబొమ్మ దగ్ధం, భారీ ర్యాలీ

ప్రజాపక్షం/ హైదరాబాద్


పహల్గామ్‌లోని పర్యాటకులను అతి కిరాతకంగా చంపిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్ఎఫ్) నాయకులు డిమాండ్ చేశారు. ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో పెకిలించేందుకు ప్రపంచ దేశాలు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్‌లో హిమాయత్‌నగర్ వద్ద ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హిమాయత్ నగర్ చౌరస్తా వద్ద ఉగ్రవాదుల దిష్టి బొమ్మను దగ్ధం చేయడంతో పాటు పహల్గామ్ ఘటనలో మరణించిన వారికి నివాళులు అర్పించారు. అనంతరం ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ జమ్మూ కాశ్మీర్ పహల్గామ్‌లో ఉగ్రదాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ ఈ ఘటన అత్యంత విషాదకరమనీ, ఉగ్రవాదం అంతం కావాలంటే తరువాయి 2లో

### కర్రెగుట్టల్లో ... ఎదురుకాల్పులు

- ముగ్గురు మహిళా మావోయిస్టులు హతం
- గుట్టను చుట్టుముట్టిన భద్రతా బలగాలు
- మావోయిస్టు అగ్రనేత హిడ్మా కోసం గాలింపు

ప్రజాపక్షం/భద్రాచలం/నూగురు వెంకటాపురం

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా మీదుగా తెలంగాణలోని ములుగు జిల్లా వరకు ఆవరించి ఉన్న కర్రెగ్గుటల వద్ద జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు మహిళా మావోయిస్టులు మృతి చెందారు. ఈ విషయాన్ని ఆ రాష్ట్ర పోలీస్ ఉన్నతాధికారులు గురువారం ప్రకటించారు. సోమవారం నుండి కర్రెగుట్టలను ఛత్తీస్‌గఢ్ పోలీసులు, సిఆర్‌పిఎఫ్, డిఆర్‌జి, ఎస్‌టిఎఫ్, తెలంగాణ పోలీసులు బలగాలు సుమారు 10,000 తరువాయి 2లో



### రాష్ట్రంలో 'హై అలర్ట్'

- పహల్గామ్‌లో ఉగ్రదాడితో అప్రమత్తం చేసిన కేంద్రం
- హైదరాబాద్‌లో తనిఖీలు
- అదుపులోకి అనుమానాస్పద వ్యక్తులు
- విమానాశ్రయాలు, బస్‌స్టేషన్లు, రైల్వే స్టేషన్ల వద్ద గట్టి నిఘా

ప్రజాపక్షం/హైదరాబాద్



పహల్గామ్ ఉగ్రదాడుల నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రానికి హై అలర్ట్ ప్రకటించారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం హెచ్చరికలు జారీ చేసింది. కేంద్ర నిఘా వర్గాలు చేసిన హెచ్చరికలతో తెలంగాణ పోలీసు శాఖ అప్రమత్తం అయింది. పహల్గామ్ దాడిలో 26 మంది మరణించిన విషయం తెలిసిందే. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో ఎక్కడికక్కడ తనిఖీలు చేపట్టాలని, పోలీసులు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులను అదుపులోకి తీసుకోవాలని ఇంటెలిజెన్స్ వర్గాలు పేర్కొన్నాయి. తెలంగాణ సహా ఉగ్రవాద ప్రభావిత రాష్ట్రాలన్నిటికీ గురువారం కేంద్ర నిఘా వర్గాలు ఈ హెచ్చరికలు జారీ చేశాయి. ముఖ్యంగా శంషాబాద్ విమానాశ్రయంతో పాటు రైల్వే స్టేషన్‌లు, బస్‌స్టేషన్‌లు, రద్దీ ప్రాంతాలు, షాపింగ్ మాల్స్, సినిమా థియేటర్ల వద్ద మరింత నిఘా పెంచారు. ఈ మేరకు పెట్రోలింగ్ పోలీసులను పెంచారు. రాత్రి వేళలో రహదారులపై ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS


## విజయవంతంగా బయలుదేరిన ముగ్గురు చైనా వ్యోమగాములు

**బీజింగ్ :** చైనా సొంత అంతరిక్షకేంద్రం ''తియాంగాంగ్''కు గురువారం నాడు ముగ్గురు వ్యోమగాములు విజయవంతంగా బయలుదేరి వెళ్ళారు. చైనా మానవ సహిత అంతరిక్ష ప్రయోగాలలో భాగంగా షెంజౌ–20 నౌక 35వసారి అంతరిక్షానికి వెళ్ళింది. 'చైనా స్పేస్ డే' సందర్భంగా ఈ ప్రయోగం జరిగింది. 1970 ఏప్రిల్ 24న తొలి ఉపగ్రహం డాంగ్‌ఫాంగ్ ఫెంగ్–1ను చైనా ప్రయోగించింది. ఏప్రిల్ 24ను స్పేస్ డే గా 2016 నుండి చైనా పాటించడం ప్రారంభించింది. భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం మూడు గంటలకు వాయువ్య చైనాలోని జియుక్వాన్ అంతరిక్ష ప్రయోగ కేంద్రం నుండి షెంజౌ–20 అంతరిక్ష నౌకలో ఈ ముగ్గురు వ్యోమగాములూ బయలుదేరారు. కమాండర్ చెన్ డాంగ్ సారథ్యంలో చెన్ జోంగ్రుయ్, వాంగ్‌జీలు 'తియాంగాంగ్' అంతరిక్ష కేంద్రానికి వెళ్ళి బాధ్యతలు తీసుకున్న తర్వాత ఆరునెలలుగా అక్కడ పరిశోధనలు చేస్తున్న ముగ్గురు వ్యోమగాములు ఈనెల 29న భూమికి తిరిగి వస్తారు.

## ఇక ఆపండి : పుతిన్‌పై ట్రంప్ అసహనం

### కీవ్‌పై రష్యా దాడిలో 8 మంది మృతి


**కీవ్ :** ఉక్రేన్ రాజధాని కీవ్‌పై రష్యా చేసిన డ్రోన్ల దాడిలో ఎనిమిదిమంది ప్రజలు మరణించారు. మరో 77 మంది గాయపడ్డారు. శాంతి చర్చలకు అంగీకరించాలని అమెరికా తన త్తిడిని తీవ్రతరం చేస్తున్న తరుణంలో రష్యా ఈ డ్రోన్ల దాడి చేసింది. గడచిన జులై నుండి కీవ్‌లో జరిగిన అతిపెద్ద దాడి ఇదే. ఐతే ఈ దాడి తనకు నచ్చలేదనీ, తాను ఎంతమాత్రం సంతోషంగా లేననీ అమెరికా అధ్యక్షుడు డోనాల్ ట్రంప్ అన్నారు. తక్షణం దాడులు ఆపేయాలని రష్యాను కోరారు. అదేవిధంగా దక్షిణాఫ్రికా పర్యటనలో ఉన్న ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ మాట్లాడుతూ, పుతిన్‌పై మరింత ఒత్తిడి పెంచాలని కోరారు. ఉక్రేన్ సమస్య పరిష్కారాన్ని కోరుతూ దక్షిణాఫ్రికా అధ్యక్షుడు రామఫోసా గురువారంనాడు అమెరికా అధ్యక్షుడు ట్రంప్, రష్యా అధ్యక్షుడు పుతిన్‌లతో ఫోన్‌లో సంభాషించారు. ఒకవైపు ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ దక్షిణాఫ్రికా పర్యటనలో ఉండగానే రామఫోసా ట్రంప్‌తో ఈ రాయబారం చేశారు. గతవారంతో ఆయన పుతిన్‌తో మాట్లాడారు. యుద్ధ విరమణకు కలిసి పనిచేద్దామని ట్రంప్–పుతిన్ ఇద్దరూ రామఫోసాకు చెప్పారు. దక్షిణ ఆఫ్రికా పర్యటనలో ఉన్న ఉక్రేన్ అధ్యక్షుడు వి.జెలెన్‌స్కీ ఈ ఘటనతో పర్యటనను కుదించుకుని హుటాహుటిన ఉక్రేన్‌కు చేరుకున్నారు. ఆఫ్రికాఖండంలో రష్యాకు వ్యతిరేకంగా జెలెన్‌స్కీ ఉక్రేన్ అనుకూల అభిప్రాయాన్ని కూడగట్టడంలో ఈ పర్యటన ఎంతో కీలకమైనదిగా ఆయన భావించారు. తన పర్యటన కుదించుకుని తిరుగు ప్రయాణం కావడానికి ముందుగా ఆయన దక్షిణ ఆఫ్రికా అధ్యక్షుడు రామఫోసాతో చర్చలు జరిపారు. అనంతరం వారిద్దరు గురువారం మధ్యాహ్నం ప్రిటోరియాలో ఉమ్మడిగా పత్రికాగోష్ఠిలో మాట్లాడారు. ఉక్రేన్ సమస్యపై ట్రంప్‌తో తాను మాట్లాడారనీ, రష్యా–ఉక్రేన్ మధ్య యుద్ధం అనివార్యంగా ముగిసిపోవాల్సిన అవసరం ఉందని రామఫోసా అన్నారు. రెండు దేశాలమధ్య ద్వైపాక్షిక సంబంధాలకు ఈ పర్యటన దోహదం చేస్తుందని రామఫోసా అన్నారు. దక్షిణ ఆఫ్రికాతో దెబ్బతిన్న సంబంధాల పునరుద్ధరణకు జెలెన్‌స్కీ ఉపక్రమించారు. 2019లో అధ్యక్ష బాధ్యతలు తీసుకున్న తర్వాత దక్షిణాఫ్రికాలో జెలెన్‌స్కీ పర్యటించడం ఇదే మొదటిసారి. కానీ ఆయన తన పర్యటనను ఉక్రేన్‌లో రష్యా దాడులవల్ల అర్థాంతరంగా మధ్యలోనే ముగించుకున్నారు.



**చర్చలకు అడ్డుపడుతున్న జెలెన్‌స్కీ : ట్రంప్**

ఉక్రేన్‌లో యుద్ధ నివారణకు జరిగే శాంతి చర్చలకు జెలెన్‌స్కీ అడ్డు పడుతున్నారని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ విమర్శలు చేసిన కొద్ది గంటల తర్వాత రష్యా డ్రోన్లు కీవ్ పట్టణంపై దాడులు చేశాయని యూరప్ వార్తా కేంద్రాలు పేర్కొన్నాయి. జెలెన్‌స్కీ శాంతి చర్చకు మోకాలడ్డుతున్నారని ట్రంప్ విమర్శించారు. క్రిమియాను రష్యా భూభాగంగా గుర్తించే విషయాన్ని కూడా శాంతి చర్చల్లో పొందుపరచాలన్న ట్రంప్ ప్రతిపాదనను జెలెన్‌స్కీ నిర్ద్వంద్వంగా తోసిపుచ్చారు. దీంతో శాంతి చర్చల తోవను వదిలిపెట్టి జెలెన్‌స్కీ తప్పుడు మార్గంలో ప్రయాణం చేస్తున్నారని ట్రంప్ విమర్శించారు. ''నీ కన్నా ఎక్కువ శక్తిమంతమైన దేశంతో నువ్వెందుకు యుద్ధానికి దిగావ్?'' అని ఒక దశలో ట్రంప్ జెలెన్‌స్కీపై విరుచుకుపడ్డారు. జెలెన్‌స్కీ నష్టాన్ని భరించాల్సిందేననీ, రాజీ పడాల్సిందేననీ ట్రంప్ గట్టి నిర్ణయంతో ఉన్నారు.

## మూడో ప్రపంచయుద్ధమే : రష్యా హెచ్చరిక



**మాస్కో :** ఉక్రేన్‌కు శాంతి దళాలను పంపిస్తే మూడో ప్రపంచయుద్ధమే వస్తుందని రష్యా జాతీయ భద్రతామండలి కార్యదర్శి సెర్గీ సోయుగు హెచ్చరించారు. ఉక్రేన్‌లో కాల్పుల విరమణకు, శాంతి చర్చలకు రష్యాసిద్ధంగా ఉందనీ, కానీ ఆచరణాత్మక వాస్తవాలను, రష్యా ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకుని యుద్ధ సమస్య మూల కారణాలను పరిష్కరించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. టాస్ వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో గురువారం ఆయన మాట్లాడుతూ, యూరప్‌లో ఉక్రేన్‌కు సంపూర్ణ మద్దతు ఇచ్చి ఆయుధాలు సమకూరుస్తున్న ''ఇష్టపడేవారి కూటమి'' ఇటీవల తరచు సమావేశాలు నిర్వహించి శాంతి చర్చల అనంతరం ఉక్రేన్‌కు శాంతి దళాలను పంపిస్తామని తీర్మానించాయి. దీనిని రష్యా తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. రష్యా పశ్చిమ సరిహద్దు ప్రాంతంలో నాటో కూటమి గడచిన సంవత్సరకాలంగా తన సైనిక మౌలిక సదుపాయాలను రెండున్నర రెట్లు ఎక్కువగా పటిష్టం చేసుకుందని షోయిగు చెప్పారు. కేవలం పది రోజుల వ్యవధిలో 1,00,000 మంది సైనికులను వేగంగా తరలించేందుకు నాటో ప్రణాళిక చేసిందనీ, 30 రోజుల్లో 3,00,000 మంది సైనికులను, 180 రోజుల్లో 8,00,000 మంది సైనికులను ఈ ప్రాంతంలో మోహరించేందుకు కొత్త యుద్ధ పరివర్తన వ్యూహవ్యవస్థను సిద్ధం చేసిందన్నారు. గడచిన రెండు సంవత్సరాలలో బాహాటంగా జరిగిన విన్యాసాలలో నాటో ఈ శక్తిసామర్థ్యాల పరీక్షలు చేసి చూసిందన్నారు. నార్వే, బెల్జియం, నెదర్లాండ్స్ దేశాలు తమ గగనతల వ్యవస్థలను ఆధునిక సాంకేతిక యుద్ధ వ్యవస్థలతో పునర్వ్యవస్థీకరిస్తున్నాయన్నారు. లాత్వియా, ఎస్తోనియా,లిథుయేనియా వంటి బాల్టిక్ దేశాలు పశ్చిమ దేశాల నిధులతో తమ ప్రాంతాలలో సైనిక స్థావరాలు అభివృద్ధి చేస్తున్నాయని, ఇదంతా ఎవరికోసమని ఆయన ప్రశ్నించారు. ఉక్రేన్‌కు నాటో కూటమి సభ్యత్వం ఇవ్వకూడదనీ, శాంతి ఒప్పందం అనంతరం చరిత్రాత్మకంగా రష్యాతో బలమైన బంధం పెనవేసుకున్న ఉక్రేన్ సాంస్కృతిక,చారిత్రక ప్రదేశాలకు శాంతి దళాల పేరుతో కూటమి సైన్యాలను పంపించే ఆలోచనలను రష్యా తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఈ మూడు విషయాల్లో ట్రంప్ మాటతప్పుతారన్న సందేహాలు రష్యాలో మిగిలి ఉన్నాయి. దీంతో ట్రంప్ ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ ఉక్రేన్‌తో శాంతి చర్చలకు రష్యా సుముఖత వ్యక్తం చేసేందుకు తీవ్ర జాప్యం చేస్తున్నది. ఈ పూర్వరంగంలో సెర్గీ షోయిగు మాట్లాడుతూ, శాంతి దళాల ముసుగులో యూరప్ ఉమ్మడి సైన్యాన్ని గనుక రష్యా సరిహద్దుల సమీపంలోకి పంపితే యూరప్–రష్యా మధ్య ప్రత్యక్ష యుద్ధానికి దారితీస్తుందని, ఈ యుద్ధం ఇక మూడో ప్రపంచయుద్ధమే అవుతుందని హెచ్చరించారు. వివేకవంతులైన యూరప్ రాజకీయ నాయకులు ఈ విషయాన్ని అర్థం చేసుకోవాలని ఆయన కోరారు. శాంతి దళాల పేరుతో ఉక్రేన్‌లో తిష్ఠవేసే యూరప్ ఉమ్మడి సైన్యాలు ఇక ఉక్రేన్‌లో ఉన్న అత్యంత విలువైన ఖనిజ వనరుల నిక్షేప ప్రాంతాలను తమ అధీనంలోకి తెచ్చుకుని గుత్తాధిపత్యం చెలాయిస్తామని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. నిజంగా ఇదంతా జరిగితే యూరప్ సైన్యాలు ఉక్రేన్‌లో ప్రస్తుతం ఉన్న జెలెన్‌స్కీ నాజీ పరిపాలనకు పూర్తి మద్దతు ఇస్తాయని, ఉక్రేన్‌లోని రష్యా చారిత్రక ప్రదేశాల్లో, సరిహద్దు రాష్ట్రాలలో రష్యా భాష మాట్లాడే వారిపైన, వారి సంస్కృతిపైనా అణచివేత చర్యలు ప్రారంభిస్తారని, రష్యాతో కయ్యానికి కాలు దువ్వుతారని ఆందోళన వ్యక్తం చేశారు.

## ఖతార్ కృషితో కాంగోలో మైలురాయి ఘట్టం



ప్రభుత్వం – ఎం23 కాల్పుల విమరణ ఒప్పందం

**కిన్షాషా :** అంతర్యుద్ధంతో అతలాకుతలమవుతున్న సెంట్రల్ ఆఫ్రికా దేశం డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగోలో మైలురాయివంటి కీలకపరిణామం సంభవించింది. డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో ప్రభుత్వం–ఎం–23 దళాలమధ్య కాల్పుల విరమణ అంగీకారం కుదిరింది. శత్రుత్వాన్ని విడిచిపెట్టాలని రెండు వర్గాలు నిర్ణయించాయి. రాబోయేరోజుల్లో ఎం–23 తిరుగుబాటు దళాలతో డి.ఆర్.కాంగో ప్రభుత్వం చర్చలు ప్రారంభించనున్నది. ఈ చర్చలు తుదిదశకు వచ్చేవరకూ, చర్చల్లో ఒక శాశ్వత ఒప్పందం కుదిరేవరకూ కాల్పుల విరమణను అమలు చేయాలని ప్రభుత్వంతోపాటు ఎం–23 కూడా అంగీకరించింది. ఈ మేరకు ఈ రెండు వర్గాలకు చెందిన ప్రతినిధులు ఒక ఉమ్మడి ప్రకటన విడుదల చేయడం కాంగో చరిత్రలో మైలురాయి ఘట్టంగా మారింది. ఒక సమస్య పరిష్కారానికి ఒక శాశ్వత ఒప్పందం దిశగా కలిసి కృషి చేయాలని ప్రభుత్వం–ఎం 23 నిర్ణయించాయి. ఖతార్ మధ్యవర్తిత్వం ద్వారా ఆకస్మికంగా ఈ రెండు వర్గాలమధ్యా ఈ అంగీకారం కుదిరింది. కలిసి ఒక ఉమ్మడి ప్రకటన కూడా విడుదల చేశాయి. ఐతే 2021 నుండి ఇప్పటివరకూ జరిగిన చరిత్రను పరిశీలిస్తే ఈ ఒప్పందం ఎంతవరకూ ఫలితాలనిస్తుందన్న సందేహాలు కూడా తలెత్తుతున్నాయి. గడచిన ఐదు సంవత్సరాలలో డి.ఆర్.కాంగోకు, ఎం–23కి మధ్య ఐదుసార్లు కాల్పుల విరమణ ఒప్పందాలు జరిగాయి. వాటి ఉల్లంఘనలవల్ల వైఫల్యాలు జరిగాయి. ఇప్పుడు ఆరోసారి ఈ ఒప్పందం జరిగింది.

## అమెరికాతో చర్చలకు చైనా తిరస్కృతి

**బీజింగ్ :** ఎడాపెడా పెంచి బెదిరింపులు చేస్తున్న అమెరికా వైఖరితో చైనా విసిగివేసారిపోయింది. సుంకాలపై అమెరికాతో చర్చలను తిరస్కరించింది. ఈ విషయంలో ద్వైపాక్షిక చర్చల్లో పురోగతి సాధిస్తామనడానికి ఎలాంటి ఆచరణాత్మక ఆధారాలు కనిపించడంలేదని చైనా విమర్శించింది. చైనా–అమెరికా మధ్య ఇప్పటివరకూ సుంకాలపై ఎలాంటి చర్చలు జరగలేదని చైనా విదేశీ మంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి గుయో జియాకున్ గురువారంనాడు మీడియాకు చెప్పారు. అమెరికా వైఖరి చాలా స్థిరంగా, మొండిగా ఉందని, చాలా స్పష్టంగా ఉందని, అందువల్ల చర్చలకు తావులేదన్నారు. ఐతే తమ తలుపులు ఎప్పుడూ తెరచే ఉంటాయన్నారు. చర్చలవల్ల వచ్చే ఫలితాల్లో సమాన గౌరవం, పరస్ప ప్రయోజనాలు నెరవేరాలన్నారు. ఒకవేళ చర్చలు జరిగితే అలాంటి ప్రాతిపదికపైనే చర్చలు జరగాలన్నారు. అమెరికా ప్రభుత్వమే ప్రపంచంపై టారిఫ్ యుద్ధం ప్రారంభించిందన్నారు. అమెరికాకు లొంగిపోయి, తమ ప్రయోజనాలు పణంగా పెట్టి నష్టపోవద్దని దేశాలను ఆయన హెచ్చరించారు. కాగా, చైనాపై సుంకాలు చాలా ఎక్కువగా ఉన్నాయనీ, రాబోయేరోజుల్లో ఈ సుంకాలు గణనీయంగా తగ్గుతాయని చైనా తాజాగా మాట మార్చడంపై ప్రశ్నించగా చైనా వాణిజ్యమంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి యాండాంగ్ స్పందిస్తూ, ముడి వేసినవారే ఈ చిక్కును విడదీయాలన్నారు. ఇదిలా ఉండగా, ఐక్యరాజ్యసమితి భద్రతామండలి సమావేశంలో బుధవారం నాడు అమెరికా–చైనా ప్రతినిధులమధ్య సుంకాలపై వాగ్వాదం జరిగింది. అమెరికా తన ఇష్టానుసారంగా సుంకాలు విధించి అన్ని దేశాలను ఇబ్బందులపాలు చేస్తోందని, సుంకాల ఆట ఆడుతోందని చైనా ప్రతినిధి విమర్శించారు. ప్రపంచ వాణిజ్యసంస్థ నిబంధనలు ఉల్లంఘించిందన్నారు. దీనిపై అమెరికా ప్రతినిధి స్పందిస్తూ, అనేక సంవత్సరాలుగా చైనా అన్యాయంగా సుంకాలపేరుతో తమ దేశాన్ని దోచుకుంటున్నదని విమర్శించారు.





## ప్రపంచ దేశాలు చర్యలు
(మొదటి పేజీ తరువాయి)

ఉగ్ర మూకలను కఠినంగా శిక్షించాలన్నారు. దేశ సమగ్రతను సమైక్యతను పరిరక్షించడానికి కేంద్ర ప్రభుత్వం, జమ్మూ కాశ్మీర్ ప్రభుత్వం సమన్వయంతో ఉగ్రవాదులను ఏరివేత చేపట్టాలని, భవిష్యత్తులో దేశంలో ఎక్కడ ఉగ్ర దాడులు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని అన్నారు. ఉగ్ర మూకలు కాశ్మీర్ ప్రాంతంలో ఎక్కడ దాగి ఉన్న వెంటాడి శిక్షించాలని వారు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడకుండా ఉగ్రవాదులకు, ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న పాకిస్తాన్ కు గట్టి బుద్ధి చెప్పాలన్నారు. మరణించిన కుటుంబాలను కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు గ్యార క్రాంతి, రాష్ట్ర సహాయ కార్యదర్శి గ్యార నరేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సామిడి వంశోవర్ధన్ రెడ్డి, ఎండి అన్వర్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు చైతన్య యాదవ్, రాష్ట్ర నాయకులు అరుణ్, హరీష్, జ్ఞానేశ్వర్, అశ్విన్, వెంకటేష్, ఉదయ్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

## భారత్ సమ్మిట్ (మొదటి పేజీ తరువాయి)

అంతర్జాతీయ వ్యవహారాల హెడ్ ఎమిలియో లొజాడా, మలేషియా న్యాయ శాఖ మంత్రి ఎం.కుల సేగరన్లతో పాటు దేశంలోని ప్రముఖ రాజకీయ పార్టీ నాయకులు దిగ్విజయ్ సింగ్, పవన్ ఖేరా, సుప్రియా శ్రీనాటె, సల్మాన్ ఖుర్షీద్, జ్యోతిమణి తదితరులు సదస్సుకు హాజరు కానున్నారు. ప్రపంచానికి దారి చూపే విధంగా 'భారత్ సమ్మిట్ –2025' నిర్వహించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. భారత్ సమ్మిట్ –2025 అనేది చరిత్రలో నిలిచిపోతుందని, భారత్ సమ్మిట్ –2025కు తగిన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఎఐసిసి కార్యదర్శి గురుపాల్‌సింగ్ సఫల్, రాష్ట్ర మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి గురువారం మీడియాతో వివరించారు. భారత్ సమ్మిట్ ద్వారా తెలంగాణకు పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందని, సమ్మిట్ నిర్ణయాలను తెలంగాణలో అమలు చేస్తామని, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచ ప్రతినిధులకు పరిచయం చేస్తామని మల్లు భట్టివిక్రమార్క చెప్పారు. ప్రపంచంలో భౌగోళిక, రాజకీయ, ఆర్థిక, ప్రజాస్వామికంగా పెను మార్పులు సంభవిస్తున్న ప్రస్తుత తరుణంలో ప్రభుత్వం తొలిసారిగా ఈ సదస్సును నిర్వహిస్తుందన్నారు. కాంగ్రెస్ అగ్ర నాయకులు రాహుల్‌గాంధీ స్వప్నమైన 'న్యాయ్'ను ప్రతిబింబించేలా ఆర్థిక, రాజకీయ, సామాజిక అంశాలపై చర్చలు ఉంటాయన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి నిర్దేశించిన 'తెలంగాణ రైజింగ్'పై కూడా చర్చిస్తామని తెలిపారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టడంపై అంతర్జాతీయ ఇన్వెస్టర్లు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు వివరిస్తామన్నారు.




### భారత్ సమ్మిట్ ఏర్పాట్లను పరిశీలించిన డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్‌లోని హెచ్ఐసిసి నోవాటెల్ హోటల్‌లో రెండు రోజుల పాటు జరుగనున్న 'భారత్ సమ్మిట్' ఏర్పాట్లను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జ్ నటరాజన్ మీనాక్షి, టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ గురువారం పరిశీలించారు.ప్రతినిధుల సమావేశం హాల్, కాన్ఫరెన్స్ హాల్, జస్టిస్ హాల్, లిబర్టీ హాల్, ఫోటో ఎగ్జిబిషన్, రిసెప్షన్ ఎదురుగా చరకాలపై నూలు వడుకుతున్న మహాత్మా గాంధీ విగ్రహాన్ని పరిశీలించారు.

## పోలీస్ కుటుంబాల నుండి సివిల్స్‌కు ఎంపికైన ముగ్గురు

### అభినందించిన డిజిపి డాక్టర్ జితేందర్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** పోలీస్ సిబ్బంది కుటుంబాల నుండి సివిల్ సర్వీసెస్ కు ఎంపికైన ముగ్గురిని రాష్ట్ర డిజిపి డాక్టర్ జితేందర్ ఐపిఎస్ అభినందించారు. రాష్ట్ర డిజిపి కార్యాలయంలో గురువారం నాడు జరిగిన కార్యక్రమంలో వీరికి మెంటార్ గా వ్యవహరించిన శాంతి భద్రతల అడిషనల్ డిజిపి మహేష్ ఎం భగవత్‌తో పాటు సిఐడి డి.జి శిఖా గోయల్ ఐపిఎస్, అడిషనల్ డిజిపి అనిల్ కుమార్ ఐపిఎస్, ఐజీపీలు ఎం రమేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. సివిల్ సర్వీసెస్ లో 68వ ర్యాంకు సాధించిన జె. సాయి చైతన్య తండ్రి జె.గోవింద డిచ్ పల్లీ లో హెడ్ కానిస్టేబుల్ గా పనిచేస్తుండగా, 225 ర్యాంకు పొందిన ఏ .కౌశిక్ నరసింహ తండ్రి ఏ.వేణుగోపాల్ డిజిపి కార్యాలయంలో డిఎస్‌పిగా పనిచేస్తున్నారు. 779 ర్యాంకు పొందిన టి .సూర్య తేజ తండ్రి టి .కరుణాకర్ అసెంబ్లీలో చీఫ్ మార్షల్ గా పనిచేస్తున్నారు. పోలీస్ శాఖలో పనిచేస్తున్న సిబ్బంది కుమారులు సివిల్ సర్వీసెస్ కు ఉత్తమ ర్యాంక్ లతో ఎంపిక కావడం సంతోషం అని, భవిష్యత్తులో సమాజానికి ఉపయోగపడే సేవ చేయాలని డిజిపి సూచించారు.వీరికి మెంటార్ గా వ్యవహరించిన అడిషనల్ డిజిపి మహేష్ ఎం భగవత్ మాట్లాడుతూ... 68 ర్యాంకు పొందిన జె .సాయి చైతన్య తండ్రి జె. గోవింద తాను అదిలాబాద్ జిల్లా ఎస్పీగా ఉన్నప్పుడు తన దగ్గర పని చేశారని, వారి అబ్బాయికి మంచి ర్యాంకు రావడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఇతనితో పాటు టి సూర్య తేజకు కూడా తాను గత సంవత్సరం మెంటార్ గా ఉన్నానని అప్పుడు వారు ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ కి ఎంపిక అయ్యారని వివరించారు.

## ఎంఎల్‌సి ఎన్నికల కౌంటింగ్ ఏర్పాట్లు పూర్తి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ జిల్లా స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నికల ఓట్ల లెక్కింపుకు అన్ని ఏర్పాటు పూర్తి చేసినట్లు రిటర్నింగ్ అధికారి అనురాగ్ జయంతి తెలిపారు. జిహెచ్‌ఎంసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రంలో శుక్రవారం ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుందని ఆయన వెల్లడించారు. ఇందుకు సంబంధించి సిబ్బందితో పాటు అవసరమైన భద్రతా ఏర్పాట్లను పూర్తి చేసినట్లు తెలిపారు. అంతకు ముందు ఎన్నికల పరిశీలకులు సురేంద్రమోహన్ ఎన్నికల కౌంటింగ్ కేంద్రాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. బ్యాలెట్ బాక్స్‌ల భద్రత, వీడియో రికార్డింగ్, సెక్యూరిటీ వంటి అంశాలపై పలు సూచనలు చేశారు. ఓట్ల లెక్కింపుకు ప్రత్యేక కౌంటింగ్ టేంటింగ్, సిసికెమెరాలు, పోలీసుబందోబస్తు ఏర్పాటును పరిశీలించారు. ఓట్ల లెక్కింపు పారదర్శకంగా ఎన్నికల నిబంధనల మేరకు నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్లు రిటర్నింగ్ అధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అడిషనల్ కమిషనర్ అలివేలు మంగతాయారు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ధ్వంసం చేయండి (మొదటి పేజీ తరువాయి)

ఆర్థిక వ్యవస్థ కూడా పుంజుకుంటున్న తరుణంలో ఉగ్రవాదులు దాడిచేసి దెబ్బతీశారు. ఆమ్‌ఆద్మీపార్టీకి చెందిన రాజ్యసభ సభ్యుడు సంజయ్‌సింగ్ మాట్లాడుతూ, ఉగ్రవాద శిబిరాలన్నింటినీ ధ్వంసం చేయాలని అఖిలపక్ష సమావేశంలో నాయకులు అందరూ పార్టీలకు అతీతంగా ప్రభుత్వాన్ని కోరినట్లు చెప్పారు. తృణమూల్ కాంగ్రెస్ ఎంపి సుదీప్ బందోపాధ్యాయ మాట్లాడుతూ, భద్రతా వైఫల్య సమస్యను కూడా చర్చించాల్సిన అవసరం ఉందని కానీ, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా జరిగే పోరాటంలో ప్రభుత్వానికి అండగా నిలబడతామని ప్రతిపక్షాలు భరోసా ఇచ్చాయని చెప్పారు. ఉగ్రవాదాన్ని నిర్మూలించడంలో యావత్ భారతజాతీ సమైక్యంగా నిలబడాల్సిన అవసరం ఉందని బందోపాధ్యా అన్నారు. తొలుత ఈ సమావేశంలో ప్రభుత్వం పహల్గామ్‌లో ఉగ్రవాదులు చేసిన కాల్పుల మారణకాండకు సంబంధించిన అన్ని వివరాలను పార్టీల నాయకులకు వివరించింది. ఉగ్రవాదులు చేసిన కాల్పుల్లో ఇద్దరు విదేశీయులు సహా 26 మంది పర్యాటకులు మరణించారని తెలియజేసింది. సమావేశ ప్రారంభానికి ముందుగా పాల్గొన్న నాయకులు అందరూ ఒక్క నిమిషం మౌనం పాటించి మృతులకు శ్రద్ధాంజలి ఘటించారు. వారి కుటుంబాలకు తీవ్ర సంతాపం ప్రకటించి సానుభూతి తెలియజేశారు. రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్, కేంద్రహోం మంత్రి అమిత్ షా, విదేశీ వ్యవహారాలమంత్రి ఎస్.జైశంకర్, ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్, కిరెన్ రిజిజు ప్రభుత్వం తరపున అఖిలపక్ష సమావేశంలో పాల్గొన్నారు. రాజ్యసభా నాయకుడు జె.పి.నడ్డా, రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జునఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ సమావేశంలో పాల్గొన్నారు. రాజ్‌నాథ్ సింగ్ ఈ సమావేశానికి అధ్యక్షత వహించారు. సుప్రియాసూలే (ఎన్‌సిపి–ఎస్‌పి), ప్రఫుల్ పటేల్ (ఎన్‌సిపి), అసదుద్దీన్ ఒవైసీ (ఎఐఎంఐఎం), సస్మిత్‌పాత్రా (బిజెడి), లావు శ్రీకృష్ణదేవరాయలు (తెలుగుదేశంపార్టీ),శ్రీకాంత్ షిండే (శివసేన), సంజయ్‌సింగ్ (ఆమ్‌ఆద్మీపార్టీ), సుదీప్ బందోపాధ్యాయ (టిఎంసి), ప్రేమ్ చంద్ గుప్తా (ఆర్‌జెడి), టి.శివ (డిఎంకె), రామ్‌గోపాల్ యాదవ్ (సమాజ్ వాదీపార్టీ)లు సమావేశంలో పాల్గొన్నవారిలో ఉన్నారు. పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా సిసిఎస్ (దేశ భద్రతపై మంత్రివర్గ కమిటీ) సమావేశం ఐదు కీలక నిర్ణయాలు తీసుకున్న మరునాడు కేంద్రప్రభుత్వం అఖిలపక్ష సమావేశం నిర్వహించి పహల్గామ్‌లో జరిగిన సంఘటన పూర్వపరాలను తెలియజేసింది. అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని బుధవారంనాడు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 2019లో పుల్వామాలో సిఆర్‌పిఎఫ్ జవానులపై ఆత్మాహుతిదాడి ఘటన తర్వాత జాతీయభద్రతకు ముప్పువాటిల్లే తీవ్రపరిణామాలు సంభవించిన పూర్వరంగంలో ఈ అఖిలపక్ష సమావేశం జరిగింది. భారత ప్రభుత్వం పాకిస్థాన్‌ను అదుపులో ఉంచడంకోసం ఐదు కఠినమైన నిర్ణయాలు తీసుకుంది. పాకిస్థాన్‌కు జీవగర్రలాంటి సింధుజలాల ఒప్పందాన్ని రద్దుచేసింది. అత్తారీ భూ రవాణా ప్రవేశద్వారాన్ని తక్షణం మూసివేసింది. దేశం నుండి పాకిస్థానీ దౌత్యకార్యాలయంలో ఉండే సైనిక ప్రతినిధులను అవాంఛనీయ వ్యక్తులుగా ప్రకటించి వారిని బహిష్కరించింది. సార్క్ వీసా పథకం కింద పాకిస్థానీయులకు జారీ చేసిన అన్ని వీసాలను రద్దుచేసింది. దీంతో ఆరోగ్య చికిత్సలకు సంబంధించిన వీసాలు కూడా ఉన్నాయి.

**నేడు రాహుల్‌గాంధీ కశ్మీరు పర్యటన**

లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ శుక్రవారంనాడు జమ్మూ కశ్మీరులో పర్యటిస్తారు. పహల్గామ్ సమీపంలో ఉగ్రవాదులు చేసిన దాడిలో గాయపడినవారిని పరామర్శిస్తారు. సంఘటన వివరాలను కూడా అడిగి తెలుసుకుంటారు. కాంగ్రెస్‌పార్టీ వర్గాలు గురువారంనాడు ఈ విషయం వెల్లడించాయి. అనంతనాగ్‌లోని ప్రభుత్వ వైద్యకళాశాలను రాహుల్‌గాంధీ సందర్శిస్తారు. కాల్పుల్లో గాయపడి అక్కడ ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న వారితో మాట్లాడతారు.

## ఒప్పందం రద్దు యుద్ధచర్య
(మొదటి పేజీ తరువాయి)

విమానాలకు ప్రవేశాన్ని నిషేధించింది. ''నీరు అనేది పాకిస్థాన్ జాతీయ ప్రయోజనాలకు అత్యంత కీలకమైనది, 24 కోట్లమంది పాకిస్థాన్ ప్రజలకు అదే జీవనాధారం, ఈ నీటి వనరులను అందుబాటులోకి తెచ్చుకునేందుకు ఎలాంటి మూల్యాన్నైనా చెల్లిస్తాం, సింధుజలాల ఒప్పందం ప్రకారం పాకిస్థాన్‌కు చెందిన నీటి వనరులను ఆపడం లేదా నీటి ప్రవాహాన్ని దారిమళ్ళించడం, దిగువన నదీనీటి ప్రవాహ హక్కులను ఆక్రమించడం యుద్ధచర్యగా పరిగణిస్తాం, అంతర్జాతీయ ఒప్పందాలు, ఐక్యరాజ్యసమితి తీర్మానాలు, అంతర్జాతీయ బాధ్యతలన్నింటినీ ఉల్లంఘించే నిర్లక్ష్యపూరిత, బాధ్యరాహిత్యమైన భారతదేశ చర్యకు ప్రతిగా అన్ని ఒప్పందాలను రద్దుచేసే హక్కు తమ దేశానికి ఉంది, పాకిస్థాన్‌లో అంతర్గతంగా ఉగ్రవాదాన్ని ఉసిగొల్పే చర్యలు అపేవరకూ, ఐక్యరాజ్యసమితి సహా అంతర్జాతీయ తీర్మానాలను ఉల్లంఘించి వాటికి విరుద్ధంగా కశ్మీరులో సాగిస్తున్న హింసాకాండను నిలిపేసేంతవరకూ ఈ ఒప్పందాలను రద్దుచేసే హక్కు మాకుంది, వాఘా సరిహద్దు పోస్టును మూసేస్తున్నాం, సార్క్ వీసా మినహాయింపు పథకం కింద భారత జాతీయులకు ఇచ్చిన అన్ని రకాల వీసాలను రద్దుచేస్తున్నాం, సిక్కు యాత్రికులకు మాత్రం ఇందులోంచి మినహాయింపు ఉంటుంది, ఈ ప్రత్యేక వీసాలపై పాకిస్థాన్‌లో పర్యటిస్తున్నవారంతా 48 గంటల్లో దేశంలోంచి వెళ్ళిపోవాలి, వాఘా సరిహద్దుల నుండి అర్హహత పత్రాలతో ప్రవేశించినవారంతా ఈ నెల 30వ తేదీ లోపు దేశం వదిలి వెళ్ళిపోవాలి, ఇస్లామాబాద్‌లో ఉన్న భారత త్రివిధ దళాలకు చెందిన అధికారులను అనర్హులుగా ప్రకటిస్తూ వారంతా తక్షణం దేశం వదిలి వెళ్లిపోవాలి, కానీ ఈనెల 30 నాటికి ఎవ్వరూ ఉండకూడదు, ఇస్లామాబాద్‌లో ఉన్న భారత దౌత్యవేత్తల సంఖ్యను 30కి కుదిస్తున్నాం, ఈనెల 30 నుండి ఇది అమలులోకి వస్తుంది, భారతదేశంలో అన్ని రకాల వాణిజ్యాలను వెంటనే రద్దుచేస్తున్నాం, 2019 ఫిబ్రవరిలో భారతదేశం చాలా నిర్లక్ష్యంగా దేశంలోకి చొరబడింది. అలాంటి పరిస్థితి రాకుండా పాకిస్థాన్ త్రివిధ దళాలూ దేశ సార్వభౌమాధికారాన్ని, ప్రాదేశిక సమగ్రతను కాపాడేందుకు పూర్తిశక్తిసామర్థ్యాలతో సంసిద్ధంగా ఉండాలి. 1940లో పాకిస్థాన్ తీర్మానంలో మహ్మద్ అలీ జిన్నా ప్రతిపాదించిన రెండు దేశాల సిద్ధాంతం, దానిని వమ్ము చేసేందుకు భారత్ యుద్ధోన్మాద చర్యలపై వ్యక్తం చేసిన భయాలకు సంబంధించిన భావాలు ఈనాటికీ ప్రతిధ్వనిస్తూనే ఉన్నాయి, ఆ భయాలన్నీ నిజమని నిరూపితమవయ్యాయని ప్రకటన పేర్కొంది.

## ఎదురుకాల్పులు (మొదటి పేజీ తరువాయి)

మందికిపైగా భద్రతా బలగాలు చుట్టుముట్టాయి. ఈ ఆపరేషన్ సోమవారం నుండి ఇంకా కొనసాగుతూనే ఉంది. గురువారం మధ్యాహ్నం వరకు భద్రతా బలగాలు దళాల నడుమ ఎదురు కాల్పులు జరిగాయి. గురువారం ఉదయం ముగ్గురు మహిళా మావోయిస్టు మృతదేహాలతో పాటు మూడు తుపాకాలు స్వాదీనం చేసుకున్నట్లు సిఆర్‌పిఎఫ్ సీనియర్ అధికారి తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్ 21 నుండి రాయపూర్, జగ్దల్‌పూర్ నుండి మావోయిస్టుల ఏరివేత ఆపరేషన్‌ను సిఆర్‌పిఎఫ్ డైరెక్టర్ జనరల్(డిజి) జిపి సింగ్ స్వయంగా పర్యవేక్షిస్తున్నారు.

**హిడ్మా కోసం వేట ముందడుగు**

మోస్టువాంటెడ్ పిఎల్‌జిఎ టాప్ మావోయిస్టు కమాడండర్ హిడ్మాను తుదముట్టించేందుకు బలగాలు ముందుడగు వేశాయి. ఆయన ఆచూకిని తెలుసుకునేందుకు నాలుగు హెలీకాప్టర్లు, రెండు డ్రోన్‌లతో ఆకాశం నుండి వేట వీక్షణ మొదలు పెట్టారు. డ్రోన్‌లు అందించిన అందించిన చిత్రాలు, ఉపగ్రహ చిత్రాలు, మ్యాప్‌ల ఆధారంగా కరెగుట్టలను పోలీసులు మోహరించారు. కరెగుట్టల్లో మోహరించిన బంకర్‌లో హిడ్మా సాయిధ దళంతో కలిసి కనిపించాడనే సమాచారం ఆధారంగా ఆపరేషన్ ప్రారంభించారు. ఈ ఏడాది ఛత్తీస్‌గడ్‌తో పాటు ఇతర ప్రాంతాల్లో ప్రభుత్వం ప్రారంభించిన అతి పెద్ద ఆపరేషన్ ఇదే కావడం విశేషం. కరెగుట్టల కొండప్రాంతం అధునాతన పేలుడు పరికరాలతో నిండి ఉందని, దళాలు ఇప్పటికే తమపని తాను చేస్తున్నాయని ఓ పోలీస్ అధికారి తెలిపారు. మార్చి 2026 నాటికి దేసంలో నుండి వామపక్షతీవ్రవాదాన్ని అంతచేయాలని ఏకైక లక్ష్యంతో కేంద్రప్రభుత్వం ముందుకు సాగుతోంది. హిడ్మా దాగి ఉన్న ప్రాంతం మాత్రం ఇప్పుడు మావోయిస్టులకు షెల్టర్ జోన్‌గా ఉందని, ఇతర ప్రాంతాల్లో మావోయిస్టులు తలదాచుకునే పరిస్థితి లేకుండా చేశామని ఆ పోలీస్ అధికారి తెలిపారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## కేంద్ర ప్రభుత్వానికి చెంపపెట్టు

వి.ఎస్.బోస్

ప్రజాపక్షం/హైదరాబాద్ : కేంద్ర ప్రభుత్వ మోసపూరిత విధానాలపై ముంబయి హైకోర్టు తీర్పు ప్రధాని నరేంద్ర మోదీకిచెంపపెట్టు అని ఎఐటియుసి రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి వి.ఎస్. బోస్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం తన ఆధీనంలో ఉన్న డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ (డిఒపిటి) ద్వారా కేంద్ర పరిధిలో ఉన్న యూనియన్లను నియంత్రించటానికి యూనియన్లలో పనిచేస్తున్న ఆఫీసు బేరర్లకు 2 పర్యాయాల కన్నా ఎక్కువ ఏ వ్యక్తికి సంబంధిత యూనియన్లలలో ఆఫీసు బేరర్‌గా ఉండకూడదని చట్ట వ్యతిరేకమైన నిబంధనలను ప్రకటించిందన్నారు. ఈ నిబంధనల ద్వారా నష్టపోతున్న డిఎఈలోని యూనియన్లు న్యాయం కోసం ముంబయి హైకోర్టును ఆశ్రయించారన్నారు. దీంతో ఇరు వర్గాల వాదనలు విన్న న్యాయస్థానం రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 (1)(సి) ప్రకారం యూనియన్లు ఏర్పరుచుకునే హక్కు ప్రతి కార్మికునికి ఉన్నదని, 1926 ట్రేడ్ యూనియన్ చట్టం ప్రకారం యూనియన్ రిజిస్టర్ చేసుకుంటే అలాంటి యూనియన్లో జోక్యం చేసుకొనే హక్కు కేంద్ర ప్రభుత్వానికి గానీ, లేక యాజమాన్యాలకు గానీ లేదని కరాఖండిగా చెప్పిందని ఆయన పేర్కొన్నారు.



## డిజిపిని అభినందించిన సిఎం

ప్రజాపక్షం/హైదరాబాద్: పౌరులకు ఉత్తమ సేవలు అందించడంలో దేశంలోనే తెలంగాణ రాష్ట్ర పోలీసులు మొదటి స్థానంలో నిలవడంతో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి గురువారం డిజిపి డాక్టర్ జితేందర్‌ను అభినందించారు. ఇటీవల ఇండియా జస్టిస్ రిపోర్ట్ 2025లో తెలంగాణ పోలీస్ శాఖ దేశంలో ప్రథమ స్థానంలో నిలిచిందని తేల్చింది. ఆ సమయంలో సిఎం రేవంత్‌రెడ్డి జపాన్ పర్యటనలో ఉండడంతో ట్విట్టర్ ద్వారా రాష్ట్ర పోలీసులకు అభినందనలు తెలిపారు. జపాన్ పర్యటనను ముగించుకుని హైదరాబాద్‌కు చేరుకున్న సిఎంను డిజిపి జితేందర్, ఇంటెలిజెన్స్ చీఫ్ శివధర్‌రెడ్డిలు కలిశారు. ఈ సందర్భంగా సిఎం పోలీసులను మరోసారి అభినందించారు. ఇదే స్ఫూర్తితో మునుముందు కూడా పని చేయాలని సిఎం వారికి సూచించారు.

## అచ్యుతమీనన్‌కు తెలంగాణ నేతల నివాళి



తిరువనంతపురం : కేరళ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, మాజీ ముఖ్యమంత్రి, స్వాతంత్ర సమర యోధుడు సి.అచ్యుత మీనన్ జీవితాంతం ఆదర్శంగా ఉంటూ, ముఖ్యమంత్రిగా భూ సంస్కరణలు అమలు చేసిన గొప్ప నేత అని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ కొనియాడారు. తిరువనంతపురంలో జరుగుతున్న సిపిఐ జాతీయ సమితి సమావేశాలకు హాజరైన తెలంగాణ, ఎపి జాతీయ సమితి సభ్యులు అచ్యుతమీనన్ శతజయంతి ఉత్సవాల సందర్భంగా ఆయన విగ్రహం వద్ద నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, అక్కినేని వనజ, జాతీయ సమితి సభ్యులు, పల్లా వెంకటరెడ్డి, కె.శ్రీనివాస్‌రెడ్డి, తక్కెళ్ళపల్లి శ్రీనువాస్, బాలనర్సింహా, బాగం హేమంత్ రావు, కలవేన శంకర్, ఎం.డి.యూసుఫ్, ఎపి జాతీయ సమితి సభ్యులు తాటిపాక మధు, కె. శివ రెడ్డి పాల్గొన్నారు.

## భూ భారతి చట్టంతో భూ సమస్యలు పరిష్కారం

రైతుల మేలు కోసమే భూ భారతి చట్టం


తెలంగాణలో భూమికి, రైతుకు అవినాభావ సంబంధం

భూ భారతి చట్టం అవగాహనలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



ప్రజాపక్షం/చండూరు/మునుగోడు : రైతుల మేలు కోసం రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టం 2025 తీసుకురావడం సంతోషకరమైన విషయం అని, తెలంగాణ రాష్ట్రంలో భూమికి రైతుకు అవినాభావ సంబంధం ఉందని భూమి కోసం ప్రజా ఉద్యమాలు జరిగిన సందర్భాలు రాష్ట్రంలో ఉన్నాయని అలాంటి గడ్డపై రైతులకు భూమిపై హక్కులు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన చట్టమే భూ భారతి చట్టం అని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. భూ భారతి చట్టం 2025 పై రైతులకు అవగాహణ కల్పించేందుకు ఉద్దేశించి నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా గురువారం నల్లగొండ జిల్లా మునుగోడు , చండూరు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడుతూ గతంలో ఉన్న ధరణి పోర్టల్‌లో సాగుకాలం లేదని, పిఓబిలో భూములను నిషేదంలో ఉంచితే ఆ సమస్య పరిష్కారం కోసం హైదరాబాద్‌లోని సిసిఎల్ఏకి వెళ్లాల్సి వచ్చేదని ఇది రైతులకు ఎంతో వ్యయ ప్రయాసలతో కూడుకున్న విషయం అన్నారు. ఒక సర్వే నెంబర్‌లో ఏదైన వివాదం వస్తే సర్వే నెంబర్ మొత్తాన్ని పిఓబిలో పెట్టే వారని తెలిపారు. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకొని రైతుల ఇబ్బందులను పరిష్కరించేందుకు నూతనంగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అందరితో చర్చించి భూ భారతి చట్టం 2025ను తీసుకొచ్చిందన్నారు. ఈ భూ భారతి చట్టం వల్ల 90 శాతం సమస్యలు తహసీల్దార్ వద్ద పరిష్కారం అవుతాయని అన్నారు. రైతులు, ప్రజలు భూ భారతి చట్టాన్ని సద్వినియోగం చేసకుకోవాని కోరారు. మునుగోడు వంటి వెనుకబడిన ప్రాంతంలో శివన్నగూడెం రిజర్వాయర్ ఉన్నప్పటికి గత బిఆర్ఎస్ ప్రభుత్వం డిపిఆర్ చేపట్టలేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత 1800కోట్ల రూపాయలతో ఏదుల నుండి నీళ్లు తెచ్చే కార్యక్రమాన్ని చేపట్టిందని అన్నారు. మునుగోడుకు సాగు నీరు వస్తే రైతులకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందని అన్నారు. చిన్న నీటి వనరులులైన శేశిలేటి వాగు ఫీడర్ ఛానల్, వెల్మకన్నే ఫీడర్ ఛానల్, బెండలమ్మ చెరువు లాంటి వాటిని పూర్తి చేసి మునుగోడు చండూరు ప్రాంత రైతుల సాగునీటి సమస్య పరిష్కరానికి కృషి చేస్తామని అన్నారు. ఇటీవల కాలం లో గట్టుప్పల, మునుగోడు చండూరు ప్రాంతాలకు ఫార్మా కంపెనీలు వస్తున్నాయని, ఫార్మా కంపెనీల ఏర్పాటు వల్ల కాలుష్యం ఏర్పడి రైతులు ఈ ప్రాంతాన్ని వదిలేసి ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సి వస్తుందని అందువల్ల ఇక్కడ ఫార్మా కంపెనీలు ఏర్పాటు చేయకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠికి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఆర్డీఓ శ్రీదేవి, డిసిసిబి చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, చండూరు మార్కెట్ కమిటి చైర్మన్ దోటి నారాయణ, చండూరు తహసీల్దార్ దశరథ, మునుగోడు తహసీల్దార్ నరేష్, చండూరు మున్సిపల్ కమీషనర్ లతా , చండూరు, మునుగోడు డిప్యూటీ తహసీల్దార్‌లు నిర్మల, నరేందర్ ఎంపిడిఓలు యాదగిరి, శాంతకుమారి, రైతులు, రైతు సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో చేరిన బిఆర్ఎస్ నాయకులు



ప్రజాపక్షం/హైదరాబాద్: వరంగల్ జిల్లా పాలకుర్తి నియోజకవర్గానికి చెందిన పలువురు బిఆర్ఎస్ పార్టీ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. గాంధీభవన్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్‌రెడ్డిల ఆధ్వర్యంలో తొర్రూరు మండల అభివృద్ధి కమిటీ చైర్మన్, నియోజకవర్గ స్థాయి నాయకుడు డాక్టర్ పోనుగోటి సోమేశ్వర్‌రావు, సుమారు 500 మంది కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులలో తొర్రూరు మాజీ సర్పంచ్ రాజేష్ నాయక్, రాయపర్తి మాజీ ఎంపిపి కంజర్ల ఎల్లయ్య, మాజీ ఎంపిటిసి సొమ్లు నాయక్, రాజేందర్, భోజ్యా, బానోత్ శ్రీను, జాతోత్ నరేష్, పద్మా యకేందర్, రవి నాయక్, కృష్ణ మూర్తి, నరసింహ నాయక్, మైనారిటీ విభాగం నాయకులు ఎండి.అన్వర్, యువజన విభాగం నాయకులు వీరమనేని రాజు, సురేష్ నాయక్, గుగులోతు అశోక్, నెహ్రూ నాయక్, మహిళా విభాగం నాయకురాలు కేతావత్ అనుజా, దారవత్ అనిత, విమల తదితరులు వున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి పనులను చూసి ఆకర్షితులై వివిధ రాజకీయ పార్టీల నాయకులు కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. అందరం కలిసికట్టుగా పనిచేసి వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాలు క్లీన్ స్వీప్ చేస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి చెందిన అత్త కోడళ్ళను తక్కువ అంచనా వేస్తూ మాజీ మంత్రి ఎర్రబెల్లి ఇంకా ఏదో ఆశతో ఉన్నారని, వారు ఆశలు వదులుకుంటే వారికే మంచిదన్నారు. బిఆర్ఎస్ నాయకుల చేరికలు ఇంకా కొనసాగుతాయని, ఇంకా చాలా మంది నాయకులు కాంగ్రెస్‌లోకి రావడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి నుండి తరలి వచ్చిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## శ్రీనగర్‌లో చిక్కుకున్న 80 మంది తెలంగాణ పర్యాటకులు

రప్పించేందుకు హెల్ప్‌లైన్ ఏర్పాటు చేసిన రాష్ట్ర ప్రభుత్వం

ప్రజాపక్షం/హైదరాబాద్: కాశ్మీర్‌లో ఇటీవల జరిగిన ఉగ్రవాద దాడి కారణంగా సూమారు 80 మంది తెలంగాణ పర్యాటకులు శ్రీనగర్‌లో చిక్కుకున్నారు. శ్రీనగర్‌లో చిక్కుకున్న వారిలో హైదరాబాద్‌కు చెందిన 20 మంది, వరంగల్‌కు చెందిన 10 మంది, మహబూబ్‌నగర్‌కు చెందిన 15 మంది, సంగారెడ్డికి చెందిన 10 మంది, మెదక్‌కు చెందిన రెండు కుటుంబాలు ఉన్నట్లు తెలిసింది. వీరు మంగళవారం ఉదయం జమ్మూ నుండి బయలుదేరి మధ్యాహ్నం 3 గంటలకు సమయంలో శ్రీనగర్‌కు చేరుకున్నారు. అయితే అదే సమయంలో పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిలో 26 మంది మరణించడంతో ఆ ప్రాంతంలో కర్ఫ్యూ వాతావరణం నెలకొంది. దీంతో తెలంగాణ పర్యాటకులు తిరిగి వెనక్కి వెళ్లలేక అక్కడే చిక్కుకున్నారు. ప్రస్తుతం పర్యాటకులు సురక్షితంగా ఉన్నారు. భద్రతా పరిస్థితుల వల్ల అక్కడే ఉండాల్సి వస్తోంది.

**స్వస్థలాలకు రప్పించేందుకు చర్యలు: మంత్రి జూపల్లి**

కాశ్మీర్‌లో చిక్కుకున్న తెలంగాణ రాష్ట్రానికి చెందిన వారిని సురక్షితంగా స్వస్థలాలకు రప్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున పర్యాటకులకు తగిన సహాయం అందిస్తామని అన్నారు. ఈ ఘటనపై తెలంగాణ పర్యాటక శాఖ అధికారులు.. ఢిల్లీలోని తెలంగాణ భవన్ అధికారులతో పాటు కేంద్ర ఏజెన్సీలతో సమన్వయం చేస్తూ పర్యవేక్షణ కొనసాగిస్తున్నారని చెప్పారు. ఇటీవల జమ్ము, కాశ్మీర్‌లో ప్రయాణించిన పర్యాటకుల వివరాలు వెంటనే అందించాలని తెలంగాణలోని అన్ని టూర్ ఆపరేటర్లు, ట్రావెల్ ఏజెంట్లను మంత్రి కోరారు. పర్యాటకుల స్థితిగతులను పర్యవేక్షించేందుకు, అవసరమైన సమయంలో ప్రభుత్వ సహాయాన్ని అందించేందుకు ఉపయోగపడుతుందని అన్నారు. తెలంగాణ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో హెల్ప్ లైన్ ను ఏర్పాటు చేశామని, కాశ్మీర్‌లో చిక్కుకున్న తెలంగాణ పర్యాటకుల సహాయం కోసం నిరంతరం ఫోన్ ద్వారా సేవలు అందించేందుకు ఈ హెల్ప్ లైన్ నెంబర్ అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. పర్యాటకుల బంధువులు లేదా స్నేహితులు కూడా తమ సమాచారం అందించేందుకు, లేదా సహాయం కోసం కింది నంబర్లకు కాల్ చేయాలని కోరారు. ఈ హెల్ప్‌లైన్‌ల ద్వారా పర్యాటకులు తమ పరిస్థితిని తెలియజేసి, అవసరమైన సహాయం పొందవచ్చు.

**హెల్ప్ లైన్ నంబర్లు**

వందన (పిఎస్ తెలంగాణ భవన్, న్యూఢిల్లీ) 9871999044

హైదర్‌అలీ సక్వీ – (పిఎ తెలంగాణ భవన్ న్యూఢిల్లీ) 9440816071

తెలంగాణ 9010659333,040 23450368

## 'స్థానికం'లో బిసి రిజర్వేషన్ల పెంపు బాధ్యత ప్రభుత్వానిదే



రాజ్యాంగంలోని ఆర్టికల్ 243–డి–6తో సాధ్యం : రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య వెల్లడి

ప్రజాపక్షం/హైదరాబాద్ : స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42శాతం రిజర్వేషన్లు పెంచే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాదేనని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎంపి ఆర్.కృష్ణయ్య స్పష్టం చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 243–డి–6 ప్రకారం ఇది సాధ్యమని, అలా కాకుండా బిసి బిల్లు ఆమోదం కేంద్రానిదేనని చేతులు దులుపుకోవాలని చూస్తే మాత్రం రాష్ట్రంలో యుద్ధమే జరుగుతుందని ఆయన హెచ్చరించారు. గురువారం హైదరాబాద్ బషీర్‌బాగ్ దేశోద్ధారకభవన్‌లో సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేశ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడతూ బిసిలకు 42 రిజర్వేషన్లును అమలు చేయాల్సిందేనన్నారు. ఏ మాత్రం వెనకడుగు వేసినా వెయ్యి మంది బిసిలు ఆమరణ దీక్షకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. అయితే ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా సిఎం ఎ.రేవంత్‌రెడ్డి బిసి బిల్లును అసెంబ్లీలో ఆమోదించారన్నారు. స్థానిక ఎన్నికల్లో బిసి రిజర్వేషన్లను 42 శాతానికి పెంచితే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోవడం ఖాయమని ఆర్.కృష్ణయ్య పేర్కొన్నారు. అదేవిధంగాఅన్ని రాజకీయ పార్టీలు బిసి రిజర్వేషన్లపై స్పష్టమైన వైఖరి ప్రకటించాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో బిసి బిల్లుకు చట్టం చేయడంతో ఒక్క జిఒ జారీ చేసి వెంటనే ఎన్నికల్లో జరపవచ్చన్నారు. ఈడబ్ల్యూఎస్ అమలులో సుప్రీంకోర్టు రిజర్వేషన్ల సీలింగ్ ఎత్తివేసిందని, బిసి రిజర్వేషన్లపై ఎవరైనా కోర్టుకెళ్లినా కేసు గెలుస్తుందన్నారు. విద్య, ఉద్యోగాలలో రిజర్వేషన్ల పెంపునకు మాత్రం కచ్చితంగా రాజ్యాంగ సవరణ చేయాలని పేర్కొన్నారు. తమిళనాడు తరహాలో బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించి, రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చాలని కోరారు. మంత్రివర్గంలో, కార్పొరేషన్ల చైర్మన్ల పదవుల్లో అత్యధిక స్థానాలు బిసిలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం నేతలు జిల్లపల్లి అంజి, మణికంఠ, రాజు నేత, ప్రతాప్, సింగం లక్ష్మణ్, సురేందర్, ఫణి కాంత్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ అధ్యక్ష పదవి బిసి,ఎస్‌సి,ఎస్‌టిలకు ఇవ్వాలి



ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ డిమాండ్

ప్రజాపక్షం/హైదరాబాద్: బిఆర్ఎస్ పార్టీ అధ్యక్ష పదవిని బిసి, ఎస్‌సి, ఎస్‌టిలకు ఇవ్వాలని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ డిమాండ్ చేశారు. గాంధీభవన్‌లో గురువారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కనీసం కెసిఆర్ కుటుంబం నుంచి కాకుండా వారి సామాజిక వర్గానికే చెందిన వ్యక్తికి బిఆర్ఎస్ అధ్యక్ష పదవి చేయగలరా? అని ప్రశ్నించారు. కెటిఆర్‌కు ధైర్యముంటే బిఆర్ఎస్ అధ్యక్ష పదవిని చేపట్టి బిఆర్ఎస్‌ను అధికారంలోకి తీసుకురావాలని సవాల్ చేశారు. కెటిఆర్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంటో, నాన్ వర్కింగ్ ప్రెసిడెంటో ఆయనకే తెలియాలని దయాకర్ ఎద్దేవా చేశారు. జనతా గ్యారేజ్ సినిమాలో యజమాని కొడుకు విలన్ అని, బిఆర్ఎస్ జనతా గ్యారేజ్‌లో పార్టీ యజమాని కొడుకు కెటిఆర్ విలనా అని దయాకర్ ప్రశ్నించారు. హెచ్‌సియు భూముల విషయంలో బిఆర్ఎస్ హ్యాండిల్స్ నుంచి ఫొటోలు ఎందుకు డిలీట్ చేశారో చెప్పాలని దయాకర్ డిమాండ్ చేశారు.

## సీతమ్మ సాగర్ ప్రాజెక్టుకు అధికారికంగా 67 టిఎంసిల కేటాయింపు

సీతమ్మ సాగర్ బ్యారేజీ నిర్మాణానికి సాంకేతిక అనుమతులు

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు



ప్రజాపక్షం/హైదరాబాద్ : ఖమ్మం జిల్లాలోని సీతమ్మ సాగర్ ప్రాజెక్టుకు కేంద్రం 67 టిఎంసిల నీటిని కేటాయించడంతో పాటు సీతమ్మ సాగర్ బ్యారేజ్ నిర్మాణానికి సాంకేతిక అనుమతులు మంజూరు చేసిందని ఉపముఖ్యమంత్రి సిఎం భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. గురువారం ఈ మేరకు గురువారం ఉపముఖ్యమంత్రి ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వ చేసిన ప్రయత్నం ఫలించడంతో ఇక ఖమ్మం జిల్లాలోని వేల ఎకరాల బీడు భూములు సస్యశ్యామలం కానున్నాయని హర్షం వ్యక్తం చేశారు. ప్రాజెక్టుకు సంబంధించి భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి కేంద్రానికి స్పష్టమైన సమాచారం ఇప్పించి, వారిని ఒప్పించి అధికారిక అనుమతులు సాధించారని డిప్యూటీ సిఎం అభినందించారు. దశాబ్దాల తరువాత రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నం మూలంగా అధికారిక అనుమతులు సాధించడం అభినందనీయం అన్నారు.

## అసలైన కళాకారులకు ఉద్యోగాలు ఇవ్వాలి



ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ఆట పాట ద్వారా తమ కళా ప్రదర్శన ఇచ్చిన నిరుద్యోగ కళాకారులకు ఉద్యోగ అవకాశం కల్పించాలని పలువురు కళాకారులు ఎంఎల్‌సి ప్రొఫెసర్ ఎం.కోదండరామ్, మాజీ ఎంపి విహెచ్‌లకు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు మంగళవారం బిసి కళామండలి జాతీయ అధ్యక్షులు జనగలం రామలింగం, జాతీయ బిసి సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జా కృష్ణ, ఉదయ్, నిరుద్యోగ కళాకారుల సంఘం నాయకులు దరువు అంజన్నలతో కూడిన ప్రతినిధుల బృందం ప్రొఫెసర్ కోదండరామ్, వి.హనుమంతరావులను కలిసి వినతి పత్రం అందజేశారు. కెసిఆర్ ప్రభుత్వంలో హయాంలో ఉద్యమ కళాకారులను పక్కనపెట్టి కేవలం టిఆర్ఎస్ పార్టీకి ప్రచారం చేసిన కళాకారులకు మాత్రమే ఉద్యోగ అవకాశాలు కల్పించారని, దీంతో ఆనాడు తెలంగాణ కోసం గజ్జ కట్టి ఆడిపాడిన నిజమైన 500 కళాకారులకు తీవ్ర అన్యాయం జరిగిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వమైన కళా సారథులుగా తమకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా కృషి చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

## కాళేశ్వరం కమిషన్ విచారణ మళ్లీ మొదలు

ఈసారి మాజీ సిఎం కెసిఆర్, మాజీ మంత్రులు హరీష్‌రావు, ఈటల రాజేందర్‌ల విచారణకు చాన్స్ ?



ప్రజాపక్షం/హైదరాబాద్ : కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో చోటు చేసుకున్న అవకతవకలను నిగ్గు తేల్చేందుకు ఏర్పాటు చేసిన జస్టిస్ పిసి ఘోష్ కమిషన్ మళ్లీ విచారణను ప్రారంభించింది. ఈ అంశంపై ఇప్పటికే పలు దఫాలుగా విచారణ నిర్వహించిన కమిషన్ ఈ దశలో మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావుతో పాటు మాజీ మంత్రులు టి.హరీష్ రావు, ఈటల రాజేందర్‌ను క్రాస్ ఎగ్జామినేషన్ చేయనున్నట్లు సమాచారం. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని బ్యారేజీల నిర్మాణాల అవకతవకలపై ఇప్పటికే విధి నిర్వహణలో భాగస్వామ్యమైన నీటి పారుదల శాఖ మాజీ ఈఎన్‌సిలు, చీఫ్ ఇంజనీర్లు ఇతర ఇంజినీర్లతో పాటు ఉన్నత అధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులు నిపుణులను ప్రశ్నించిన కమిషన్ వారి ద్వారా కీలక సాక్ష్యాధారాలను సేకరించింది. ఇదే క్రమంలో ఈ సమాచారం ఆధారంగా మాజీ సిఎం కెసిఆర్, మాజీ మంత్రులు హరీష్ రావు, ఈటల రాజేందర్‌ను కమిషన్ ప్రశ్నించనున్నట్లు తెలిసింది. ఇందుకు సంబంధించి ఈ ముగ్గురికి కమిషన్ ముందు హాజరు కావాలని సమన్లు పంపించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

**90 శాతం నివేదిక పూర్తి :**

కాళేశ్వరం అవకతవకలపై పలు దఫాలు విచారణ చేపట్టిన పిసి ఘోష్ కమిషన్ 400 పేజీలతో 90 శాతం నివేదికను సిద్ధం చేసినట్లు సమాచారం. ఎన్‌డిఎస్‌ఎ తుది రిపోర్టు అందిన వెంటనే తుది నివేదిక సిద్ధం కానుంది. అయితే ఈనెల 30వ తేదీతో కమిషన్ గడువు ముగియనుండడంతో తక్షణమే నివేదిక అందించాల్సిందిగా ఎన్‌డిఎస్‌ఎకు కమిషన్ మరోసారి లేఖ రాసింది. అయితే రెండు , మూడు వారాల్లో నివేదిక అందే అవకాశం ఉన్నట్లు సమాచారం. దీంతో కమిషన్ గడువును ప్రభుత్వం మరింత పొడిగించనుంది.

## 14 మంది మావోయిస్టుల లొంగుబాటు

లొంగిపోయిన వారందరికీ పునరావాసం కల్పిస్తాం : మల్టీ జోన్ ఐజీ చంద్ర శేఖర్ రెడ్డి



ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి : సిపిఐ మావోయిస్టు పార్టీకి చెందిన 14 మంది సభ్యులు మల్టీ జోన్ ఐజీ చంద్రశేఖర్ రెడ్డి ఎదుట గురువారం వరంగల్ కమీషనరేట్‌లో లొంగిపోయారు. తెలంగాణ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, వరంగల్ కమిషనరేట్ పోలీసుల సమక్షంలో అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులను తెలంగాణ ప్రభుత్వం ఎదుట లొంగిపోవడం కోసం జిల్లాల వారిగా నిర్వహిస్తున్నటువంటి 'పోరు కన్నా ఊరు మిన్న, మన ఊరికి తిరిగి రండి,' 'ఆపరేషన్ చేయూత' వంటి అనేక ఆదివాసీ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ద్వారా లొంగిపోయినటువంటి నిషేదిత మావోయిస్టు సభ్యులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయల గురించి తెలుసుకుని నక్సలిజం మార్గాన్ని వదిలిపెట్టి కుటుంబంతో కలిసి ప్రశాంతమైన జీవితాన్ని గడపాలని నిర్ణయించుకొని వివిధ హోదాలో పనిచేయుచున్న 14 మంది మావోయిస్టులు లొంగిపోయినట్లు ఐజీ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. వారిలో ఏరియా కమిటీ సభ్యులు ఇద్దరు, పార్టీ సభ్యులు 7గురు, మిలిషియా కమాండర్ ఒకరు, మిలిషియా సభ్యులు 4గురు మొత్తం 14 మంది లొంగిపోవడం జరిగిందని ఐజీ తెలిపారు.ఆంధ్రఒరిస్సా బోర్డర్ ఎస్ జెడ్ సీ డివిజనల్ కమిటీలో పని చేసిన గాలికొండ ఏరియా కమిటీకి చెందిన ఏరియా కమిటీ సభ్యుడు మడవి అంద, కేంద్ర కమిటీ సభ్యుడు గాజర్ల రవికి చెందిన ప్రొటెక్షన్ టీంలో పని చేసిన ఏరియా కమిటీ సభ్యురాలు సోడి కోసి, వివిధ మావోయిస్టు పార్టీ డివిజన్ కమిటీలలో పని చేసినటువంటి పార్టీ సభ్యులు అయిన మరకం హిడుమే, మడకం జోగి, పోడియం భూమిక అలియాస్ వెన్నెల, సోడి బుద్రి, మడవి పూజే, హేమ్లా సోను, సోడి రమేష్, మిలిషియా సభ్యులుగా పని చేసిన అట్టం బుద్ర, కోవాసి ఇడుమ, కోర్సా లాలు, హేమ్లా సుక్కు, కోర్సా సుక్కులు లొంగిపోయిన వారిలో ఉన్నారు. లొంగిపోయినటువంటి మావోయిస్టు పార్టీ సభ్యులు అగ్రనాయకుల ఆదేశాల మేరకు ఛత్తీస్గఢ్, ఒరిస్సా రాష్ట్రలలో అనేక పలు విధ్వంసకర సంఘటనలలో, పోలీసులపై దాడి చేసిన ఘటనలలో, అమాయక ప్రజలను ఇన్‌ఫార్మర్ల నెపంతో హత్య చేసిన పలు సంఘటనలలో పాల్గొనడం జరిగిందని తెలిపారు. జనవరి, 2024 నుండి ఈ రోజు వరకు వివిధ సందర్భాలలో జరిగిన ఎదురు కాల్పులలో 18 మంది సాయుధ మావోయిస్టులు, వారిలో ముగ్గురు (03) రాష్ట్ర కమిటీ సభ్యులు చనిపోవడం జరిగిందని తెలిపారు. జనవరి నుంచి నేటి వరకు వివిధస్థాయిలలో పని చేస్తున్న 12 మంది మావోయిస్టులను అరెస్ట్ చేయడం జరిగిందని, ఒక రాష్ట్ర కమిటీ సభ్యురాలితో పాటు మొత్తం 250 మంది మావోయిస్టులు స్వచ్ఛందంగా పోలీసుల ఎదుట లొంగిపోయి, జనజీవన స్రవంతిలో కలవడం జరిగిందని తెలిపారు. జనజీవన స్రవంతిలో కలవడానికి కావాల్సిన తగు ఏర్పాట్లు చేయడంతో పాటుగా, సరెండర్ పాలసీలో భాగంగా తక్షణమే వారికి పునరావాసాన్ని తెలంగాణ పోలీస్ శాఖ కల్పిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం ఎస్పీలు, ఏటూరునాగారం ఏఎస్పీ పాల్గొన్నారు.


**ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వారి కార్యాలయం**
**పబ్లిక్ హెల్త్ డివిజన్, కరీంనగర్.**

'ఇ' ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీసు - 2వ పిలుపు

NIT No. 2007/T4/NIT/EEPHKNR/Jagtial/TUFIDC/2nd call/2025-26, తేది: 24-04-2025

**పనుల పేరు:** టియుఎఫ్ఐడిసి ఫేజ్-3 క్రింద జగిత్యాల మున్సిపాలిటీలో బిటి రోడ్ ఏర్పాటు. ఎ) వార్డు నెం. 36లో మోచి సంఘ భవనం నుండి టవర్ సర్కిల్ వరకు, బి) వార్డు నెం.38లో చాముండేశ్వరి కిరాణా షాప్ నుండి వందన మెడికల్ షాప్ వరకు. **పనుల సంఖ్య:** (1) పని, **మొత్తం అంచనా విలువ:** రూ.36,06,826-00, **బిడ్ల స్వీకరణకు ప్రారంభ తేది:** 25.04.2025న ఉ.10.30గం.ల నుండి. **బిడ్ల స్వీకరణకు ఆఖరి తేది:** 02.05.2025న సా.4.00గం.ల నుండి, **ప్రైస్‌బిడ్ ప్రారంభ తేది:** 02.05.2025న సా.04.01 గం.ల నుండి. **టెండర్ ఆహ్వానించు అధికారి పేరు & చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, పిహెచ్ డివిజన్, కరీంనగర్. మరిన్ని వివరాలకు www.eprocurement.gov.inలో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, పబ్లిక్ హెల్త్ డివిజన్, కరీంనగర్.

DIPR R.O. No. : 766-PP/CL/ADVT/1/2025-26, Date: 24-04-2025

ప్రజాపక్షం
శుక్రవారం, ఏప్రిల్ 25

## మార్కెటింగ్‌కు అందాల ఆరబోత

ప్రపంచ అందాల పోటీకి భారతదేశం వరుసగా రెండవసారి వేదిక కానుంది. తొలిసారిగా 1996లో అమితాబ్ బచ్చన్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎబిసిఎల్) బెంగళూరు నగరంలో మిస్ వరల్డ్ పోటీకి ఆతిథ్యమిచ్చింది. యువతులను వినిమయ వస్తువులుగా ప్రదర్శించే ఈ పోటీలపై దేశవ్యాప్తంగా తీవ్ర నిరసనలు వెల్లువెత్తడంతో చివరకు బికినీలు ధరించే స్విమ్ సూట్ రౌండ్‌ను ఇతర దేశానికి తరలించి మమా అనిపించారు నిర్వాహకులు. తిరిగి 28 ఏళ్ళ సుదీర్ఘ విరామం తరువాత మిస్ వరల్డ్ పోటీ గతేడాది భారతదేశంలో ప్రవేశించింది. వాస్తవానికి మిస్ వరల్డ్ 2023 పోటీ యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో జరగాల్సి ఉన్నప్పటికీ, చివరి నిమిషంలో కారణాలు వెల్లడించకుండానే వేదికను అకస్మాత్తుగా భారతదేశంలోని ఢిల్లీకి, అటు పిమ్మట ముంబైకి మార్చారు. ఈ సారి మిస్ వరల్డ్ – 2025 పోటీని తెలంగాణలో నిర్వహించనున్నట్లు గతేడాదే అధికారిక ప్రకటన వెలువడింది. 72వ ప్రపంచ అందాల పోటీకి మే 7వ తేదీ నుంచి 31వ తేదీ వరకు హైదరాబాద్ నగరం ఆతిథ్యమివ్వనుంది. 140 దేశాల యువతులు ర్యాంప్ వాక్ చేయనున్న ఈ ఈవెంట్‌లో విజేతకు రూ.10 కోట్ల నగదు, వజ్రకచిత కిరీటం, ఏడాది పాటు వివిధ కంపెనీల కాంట్రాక్టులు, ఉచిత విమానప్రయాణాలు, మేకప్, దుస్తులు దక్కుతాయి.

1951లో ప్రారంభమైన ప్రపంచ సుందరి పోటీ ప్రధాన ఉద్దేశ్యం పెట్టుబడిదారి వ్యవస్థ సరుకుకు మార్కెట్ సృష్టించటం. అందమైన యువతితో తమ సరుకును ప్రచారం చేయడం ద్వారా మరింత లాభాలు పొందడమే లక్ష్యం. ఈ పోటీల ద్వారా వేదిక నగరానికి అంతర్జాతీయ దృగ్గోచరత్వం లభిస్తుందనే వాదన వట్టిమాటలే. ఉదాహరణకు ఇప్పుడు జరుగుతున్న మిస్ వరల్డ్ కాంపిటేషన్ ద్వారా హైదరాబాద్ నగరాన్ని, తెలంగాణ సంస్కృతిని, ఇక్కడి బిర్యానీ తదితర వంటకాలను, పోచంపల్లి చేనేతను, పర్యాటక ప్రదేశాలను ప్రపంచానికి పరిచయం చేయవచ్చనే మాటలు డొల్లలే. ఎందుకంటే నాలుగు శతాబ్దాలకు పైగా ఘన చరిత్ర కలిగిన హైదరాబాద్ నగర సంస్కృతి, సంప్రదాయాలు, ఘనతలు ఎన్నడో జగద్విఖ్యాతి పొందాయి.

బహుళజాతి కార్పొరేట్ కంపెనీల దృష్టంతా ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన భారతదేశంలోని మార్కెట్‌పైనే. ఎప్పుడో 1966లో భారతదేశానికి మొదటిసారిగా రీటా ఫారియా రూపంలో 'మిస్ వరల్డ్' కిరీటం దక్కింది. మరోసారి దక్కేందుకు సుమారు మూడు దశాబ్దాలు పట్టింది. 1991లో ఆర్థిక సంస్కరణల పేరిట దేశ విపణి ద్వారాలు తెరుచుకున్న వెంటనే అంతర్జాతీయ మార్కెట్ శక్తుల కళ్ళు ఇటువైపు మళ్ళాయి. 90వ దశాబ్దంలో ప్రపంచ అందాల పోటీల్లో భారతదేశం నుంచే దాదాపుగా వరుస విజేతలయ్యారు. 1994లో ఐశ్వర్యా రాయ్, 1997లో హైదరాబాద్‌కు చెందిన డయానా హెడెన్, 1999లో యుక్తా ముఖి, 2000లో ప్రియాంక చోప్రాలకు మిస్ వరల్డ్ టైటిల్ దక్కాయి. అదే కాలంలో విశ్వ సుందరీ మణులుగా 1994లో సుస్మితా సేన్, 2000లో లారా దత్తాలు 'మిస్ యూనివర్స్' గా గెలుపొందారు. దీనిని బట్టి అంతర్జాతీ య కాస్మోటిక్స్ కంపెనీలు భారతదేశంలో తమ లిప్‌స్టిక్కులు, పౌడర్‌లు, సన్‌స్క్రీన్ లోషన్‌లు, షాంపూలు, సబ్బులు, స్కిన్ క్రీములు అమ్ముకునేందుకు ఎంత ఉబలాట పడ్డాయో అర్థం చేసుకోవచ్చు.

హైదరాబాద్‌లో జరిగే మిస్ వరల్డ్ పోటీలను మహిళా సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. రాష్ట్ర ఆర్థికస్థితి ఉత్తేజజనకంగా లేనప్పుడు రూ.200 కోట్లకుపైగా వెచ్చించి వీటిని నిర్వహించడం అవసరమా అని ప్రతిపక్షాలు ప్రశ్నించాయి. దీనికి ప్రభుత్వం వివరణ ఇస్తూ, మిస్ వరల్డ్ పోటీలకు చేసే ఖర్చు రూ.54 కోట్లలో సగం మిస్ వరల్డ్ నిర్వాహకులు, మిగతా సగం రూ.27 కోట్లు తెలంగాణ పర్యాటక శాఖ వాటా అని, అవి కూడా స్పాన్సర్‌ల రూపంలో సమీకరిస్తున్నామని చెప్పుకొచ్చింది. ఈ పోటీల ద్వారా తెలంగాణ సామర్థ్యం అంతర్జాతీయంగా ప్రదర్శించవచ్చని వాదన వినిపిస్తున్నది.

అందాల పోటీలంటే కేవలం అంగాంగ ప్రదర్శనే కాదు.. మేధస్సుకు కూడా ప్రాధాన్యత ఉంటుందని నిర్వాహకులు సమర్థించుకుంటారు. నిజమే, ఇందులో పోటీదారుల తెలివిని పరీక్షించే విభాగం ఉండొచ్చు గాక. అది మసిపూసి మారేడుకాయను చేయడం కోసమే. అందాల పోటీల విజేతలైన భారతీయ యువతులంతా మోడలింగ్, సినీ రంగాలలోనే తమ కెరీర్‌ను నిర్మించుకున్నారే తప్ప అత్యున్నత పోటీ పరీక్షలైన సివిల్ సర్వీస్ వైపు, శాస్త్ర సాంకేతిరంగం వైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు. కాబట్టి అందాల పోటీలనేవి నిర్వాహకులు చెబుతున్నట్లుగా అందం, వైవిధ్యం, సాధికారత కోసమో, వేదికగా నిలిచే నగరాల విశిష్టతను ప్రపంచానికి పరిచయం చేయడం కోసమో కాదనేది నగ్నసత్యం. మహిళను అంగడి బొమ్మగా మార్చి, లాభాలు దండుకొని, ప్రపంచాన్ని క్షీణ సంస్కృతి వైపు వేగంగా నెట్టేసే పెట్టుబడిదారి వ్యవస్థ మార్కెట్ విస్తరణ కోసం చేసే మాయాజాలంలో భాగమే ఈ పోటీలు.

# ఒక 'క్షతగాత్రుడి' రజతోత్సవం!



ఎస్‌కె. జకీర్
సీనియర్ జర్నలిస్ట్

"తమంతట తామే తగిలించుకునే గాయాలో,కొని తెచ్చుకునే బాధలో మనుషులు తమకు తామే ఎంచుకున్నట్లయితే కాలక్రమంలో మరొకరు చేసే గాయాల కన్నా తక్కువ బాధకు గురిచేస్తాయి" అని 1469–1527కు చెందిన రాజకీయ తత్వవేత్త నికొలో మాకియవెలి అన్నాడు. ఇది ముమ్మాటికి బిఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్‌కు వర్తిస్తుంది. ఆయనను ఎవరూ గాయపరచలేదు. తనను తానే గాయపరచుకున్నారు. ఆయన ఇప్పుడు ఒక 'గాయపడ్డ' మనిషి. వేయి యుద్ధములలో ఆరితేరిన యోధునిగా గుర్తింపు పొందిన కెసిఆర్ ఓటమి గాయం నుంచి కోలుకోలేకపోతున్నారు. రేవంత్ రెడ్డి రూపంలో ఒక 'ఉపద్రవం' వచ్చి ముంచేయగలదని ఆయన ఊహించలేదు. అంచనాలు తలకిందులు కావడానికి, ప్రజల తిరస్కారానికి గురికావడానికి కెసిఆర్ ఒక్కరే కారణం. ఆయన ఎవరి మాటనూ లెక్క చేయకపోవడం, కొడుకు, కూతురు, మేనల్లుడు, తోడల్లుని కొడుకు వంటి స్వపరివారాన్ని నమ్ముకోవడమే నట్టేట ముంచింది.

'ప్రజలకేమి కావాలో తనకు తెలుసు అని అనుకున్నారు కానీ, ప్రజలు ఏమనుకుంటున్నారో ఎప్పుడూ తనిఖీ చేసుకోలేదు. ప్రజాభిప్రాయం ఎలా ఉందో పసిగట్టలేకపోయారు. ప్రతి ఇంట్లో కుటుంబ సభ్యులందరికీ, రైతుబంధు, పెన్షన్లు, కళ్యాణలక్ష్మి, కెసిఆర్ కిట్స్ రూపంలో డబ్బు పంపిణీ చేసినందున వాళ్లంతా తనను అధికారంలో శాశ్వతంగా ఉంచుతారని భావించారు. అయితే తెలంగాణ ప్రజలు ఎడ్డి వాళ్ళు కాదు. గుడ్డి వాళ్ళు అంతకన్నా కాదు. కెసిఆర్ 'ప్రగతిభవన్' పరిపాలనను ప్రజలు జీర్ణించుకోలేకపోయారని, ఆయన పరివారం అహంకార ధోరణి పట్ల జనంలో ఆగ్రహం 'లావా' వలె గూడు కట్టుకుంటోందని కెసిఆర్ సరిగ్గా విశ్లేషించుకోలేకపోయారు. ఆంధ్రప్రదేశ్‌లో జగన్ కూడా కెసిఆర్ దారిలోనే విచ్చలవిడిగా 'సంక్షేమం' పేరిట నేరుగా ఓటర్లకు డబ్బు అందించారు. తీరా ఎలక్ట్రానిక్ ఓటింగు యంత్రాలలో ఓట్లు కురవలేదు. జనం ఆయనను ఇంటికి పంపించారు. 11 సీట్లకే పరిమితం చేశారు. ఆ మాటకొస్తే కెసిఆర్ నయం. 39 అసెంబ్లీ స్థానాలతో బిఆర్‌ఎస్ బలమైన ప్రతిపక్షంగా తయారైంది. కానీ అధికారం వేరు. ప్రతిపక్షం వేరు. అధికారంలో కొనసాగిన పదేండ్ల కాలంలో కెసిఆర్, ఆయన కుటుంబం వ్యవహరించిన తీరుకు వ్యతిరేకంగా ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి.

ఇదంతా గడచిపోయి 15 నెలలు దాటాయి. ఇప్పుడిక పార్టీ రజతోత్సవాల పేరిట భారీ 'బలప్రదర్శన' కు కెసిఆర్ నడుం బిగించారు. బిఆర్‌ఎస్ పార్టీ హెడ్ క్వార్టర్ 'తెలంగాణ భవన్' అన్నది కేవలం సాంకేతికమే. మొత్తం కార్యకలాపాలను కెసిఆర్ తన ఎర్రవల్లి ఫార్మ్ హౌజ్ కు బదిలీ చేశారు. ఫార్మ్ హౌజ్ నుంచి రాజకీయపార్టీ కార్యక్రమాలను, సమావేశాలు, సమీక్షలు నడుపుతున్న పార్టీగా బిఆర్‌ఎస్ దేశంలోనే ప్రత్యేక ప్రాధాన్యాన్ని సంపాదించుకున్నది. ప్రజలకు ప్రగతిభవన్ అయినా, ఫార్మ్ హౌజ్ అయినా 'ఏవగింపు' అన్న సంగతి కెసిఆర్ గ్రహించకపోవడం ఒక విషాదం. 'నా మాటే శాసనం' అని ఆయన అనుకుంటారు కనుక దానికిక తిరుగుండదు. జనంలో ఇలాంటి వ్యవహారాల వలన తప్పుడు సంకేతాలు వెడతాయని ఆయనకు ఎవరూ చెప్పే సాహసం చేయరు. చేసినా ఆయన వినే రకమూ కాదు.

ఎల్కతుర్తి బహిరంగసభలో కెసిఆర్ ఏమి మాట్లాడతారన్నది సర్వత్రా ఆసక్తిని కలిగిస్తోంది. 'జాతీయ పార్టీ' కథ ముగిసినట్లుగా అందరూ భావిస్తున్నారు. కనుక 'ప్రాంతీయ వాదాన్ని' ఆయన మళ్లీ ఆశ్రయించనున్నారు. తెలంగాణ ప్రజల బాధలు, గాథలు తనకు కాకుండా మరెవరికీ తెలియదనీ, తాము మరలా అధికారంలోకి వస్తే తప్ప 'తెలంగాణను గాడిలో పెట్టడం సాధ్యం కాద'ని కెసిఆర్ చెప్పనున్నట్టు తెలుస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హయాంలో తెలంగాణ పూర్తిగా విధ్వంసమైపోయిందని ఆయన కొన్ని లెక్కలు చెప్పవచ్చు. మాటల గారడీలో దిట్ట కనుక తెలంగాణ మాండలికపు పంచ్‌లు ఎలాగూ ఉంటాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని 'మోకాలెత్తు లేనోడు' అని బాడీ షేమింగ్ చేయవచ్చు. రజతోత్సవసభను కొందరు 'జన బలప్రదర్శన' అంటుండగా, మరికొందరు 'ధనబల' ప్రదర్శనగా విమర్శిస్తున్నారు. 25 ఏళ్ల వైభవాన్ని చాటిచెప్పడానికి బాహుబలి వేదిక నిర్మించారు.కనీవినీ ఎరుగని రీతిలో జనసమీకరణ జరుగుతోందని బిఆర్‌ఎస్ నాయకులు చెబుతున్నారు. పది లక్షల మంది జనం హాజరవుతారని ఒక అంచనా. 1213 ఎకరాల్లో బహిరంగ సభకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. 159 ఎకరాల్లో సభా ప్రాంగణం, 5 ఎకరాల విస్తీర్ణంలో సభా వేదిక ఉన్నాయి. ఐదు వందల మంది కూర్చునేలా సభా వేదిక తయారైంది. సభకు వెనుక 4 ఎకరాలు విఐపి పార్కింగ్‌కు కేటాయించారు. 150 ఎకరాల్లో ప్రజలు, మీడియా, ఉద్యమకారులకు ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటు చేస్తున్నారు. మిగిలిన స్థలాన్ని భోజన వసతి, పార్కింగ్ కోసం కేటాయించారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున పది లక్షల మజ్జిగ ప్యాకెట్లు, 10 లక్షల వాటర్ ప్యాకెట్లను అందుబాటు లో ఉంచనున్నారు. ఈ సభకు మొత్తంగా దాదాపు 200 కోట్లకు పైగానే ఖర్చు చేస్తున్నట్టు ప్రచారం సాగుతోంది.

కాగా 'మర్దన కళ' గురించి మనం మాట్లాడుకోవాలి. భౌతిక మర్దనకు దేహ సౌఖ్యం, ఆరోగ్యం మాత్రమే పరమ ప్రయోజనాలైతే, అభౌతిక మర్దనకు అంతకు మించిన ఆధిభౌతిక ప్రయోజనాలు ఎన్నో



ఉన్నాయి. 'మహదానందానికి మీరు కేవలం ఒక మర్దనదూరంలో ఉన్నారు' అనేది ఒక మర్దన కేంద్రం వ్యాపార నినాదం. మర్దన కలిగించే మహదానందం కోసమే మనుషులు అర్రులు చాస్తుంటారు. భౌతిక మర్దనలో కించిత్ శారీరక శ్రమ ఉంటుంది గాని, అభౌతిక మర్దనలో అలాంటిదేమీఉండదు. ఊరకే నోటికి పనిచెప్పి, ఎదుటివారికి పరమానందం కలిగించే మాటలు అదనుచూసి మాట్లాడితే చాలు భౌతిక మర్దనకు మించిన ప్రయోజనాలు అనాయాసంగానే నెరవేరుతాయి. అభౌతిక మర్దనకు కీలక సాధనం పొగడ్త. పొగడ్త అగడ్త అని అంటారు. చాలామందికి ఈ సంగతి తెలిసినా, తెలిసితెలిసి మరీ పొగడ్తలకు పడిపోతారు.

పొగడ్త 'మనోమర్దన' కళ. పొగడ్తలతో ఎదుటివారిని పడగొట్టడం ఒక కళ అయితే, పొగడ్తలకు పడిపోవడం ఒక బలహీనత.మనుషులన్నాక బలహీనతలు సహజం. మరి మనుషులన్నాక కొంత కళాపోషణ కూడా ఉండాలి కదా! అధికారంలో ఉన్న అత్యధికులకు పొగడ్తలు ఒక వ్యసనం. అధికారంలో ఉన్నవారిని పొగుడుతూ పబ్బం గడుపుకోవడం చాలామంది బతకనేర్పరులకు ఒక కాలక్షేపం. అధికారంలో ఉన్నవారు చండశాసనులుగా ఎంతటి ప్రచండ ప్రఖ్యాతి పొందినా, 'ముక్కోపానికి విరుగుడు ముఖస్తుతి' అని ఎరిగిన ధీమంతులు అలాంటివారిని కూడా తమ 'వాగ్మర్దన కళ'తో సులువుగా లోబరచుకుంటారు. కెసిఆర్ అంతటి గొప్ప రాజకీయ నాయకుడు ఈ పొగడ్తలకు,మనో మర్దన కళకు లొంగిపోయినందువల్లనే ఆయన జాతీయ రాజకీయాల్లో చక్రం తిప్పాలని అనుకున్నారు. 'ప్రధాని అయ్యే అవకాశాలున్నాయని' భజనపరులు చేసిన 'మసాజ్' కెసిఆర్ ను ఎక్కడో ఊహాలోకాల్లోకి తీసుకుపోయింది.

తెలంగాణ గడ్డ పోరాటాలకు అడ్డ అనేది జగమెరిగిన సత్యం. ఆత్మగౌరవ పోరాటం నుంచే తెలంగాణ ఉద్యమం ఉద్భవించింది. తుపాకీ గుళ్లకు ఎదురొడ్డి నిలిచిన కొమరం భీం చరిత్ర మనకున్నది. నైజాం నవాబుల అరాచకాలను అణిచివేసిన, రాంజీ గోండు పోరాట వారసత్వం మనది. చివరకు ఆంధ్ర పాలకులను పారద్రోలడానికి, తొలి, మలిదశ తెలంగాణ పోరాటాలను చేసి, తెలంగాణ సాధించిన నేల మనది. ఈ ఉద్యమం పోరాటాలలో వేలమంది నేలకొరిగారు. లక్షలమంది గొప్ప త్యాగధనులుగా చరిత్రలో నిలిచిపోయారు. ఎన్నో చారిత్రక ఆధారాలు, మరెన్నో చరిత్ర పుస్తకాలు ఇవి నిజమని చెప్పడానికి మనకు సాక్ష్యాధారాలుగా ఉన్నవి. కానీ కెసిఆర్ మాత్రం తానే చరిత్ర అని, తనతోనే చరిత్ర లిఖించబడిందని గట్టిగా నమ్ముతారు. అందుకే ఆయనను 'జాతిపిత' గా ఎవరైనా పిలిస్తే సంబరపడిపోతారు. 'తెలంగాణ ఉద్యమ నిర్మాణంలో రాళ్ళెత్తిన కూలీలను' ఉద్దేశపూర్వకంగానే కెసిఆర్ విస్మరించారు.

తెలంగాణ ఉద్యమంలో ముఖ్యపాత్ర పోషించిన విద్యార్థులకు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాతే పెద్దఎత్తున ఉద్యోగాల కల్పనా జరుగుతోంది. కెసిఆర్ హయాంలో ఉద్యోగాల భర్తీ జరగక పోగా జరిగినా లీక్‌లు, రద్దు, కోర్టు కేసులు అంటూ నిరుద్యోగుల ఆకాంక్షలు దెబ్బతీశారు. అయినా నిరుద్యోగులలో మునుపటి ఉద్యమాలు లేకపోవడం ఒక పరిణామమే. అప్పటి పోరాటాలు లేవు. ఉద్యోగ, ఉపాధ్యాయులు తమ ఉద్యోగాన్ని పణంగా పెట్టి తెలంగాణ ఉద్యమం కోసం పోరాడారు. ఆ సమయంలో ఉపాధ్యాయుల సమస్యలు సర్వీసు రూల్స్‌కు 'ఇన్ని పేజీలెందుకు,మూడు పేజీలు సరిపోవా'? అని తెలంగాణ వస్తే అసలు సమస్యలే ఉండవన్నట్టు కెసిఆర్ అన్నారు. ఒకప్పుడు ప్రభుత్వాలను గడగడలాడించిన ఉద్యోగ సంఘాల నాయకులు పదవుల కోసం పాలకుల చుట్టూ పాకులాడేలా కెసిఆర్ చాకచక్యంగా వ్యవహరించారు.

తెలంగాణ వస్తే మన నిధులు మనమే ఖర్చుపెట్టుకుంటామని, మన నీళ్ళు మనకే వస్తాయని తద్వారా తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని నమ్మి ఉద్యమంలో జనం పాల్గొన్నారు. కానీ తెలంగాణ వచ్చాక ఏమైంది? మిగులు రాష్ట్రంగా ఉన్న తెలంగాణ 7 లక్షల కోట్లకు పైగా అప్పు చేసి రాష్ట్రాన్ని దివాళా తీయించి, పైగా సంపద సృష్టించినట్టుగా ప్రచారం చేసుకోవడం బిఆర్‌ఎస్ పార్టీకే చెల్లుబాటు అవుతోంది. అధికారం కోసం ఉచితాల పేరుతో దగ్గర బంధువులకు, కోట్లకు కోట్లను కట్టబెట్టి తెలంగాణ ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తున్నా ప్రశ్నించిన వారు లేరు.

ఉచిత పథకాల పేరుతో మానవ వనరులను, ప్రకృతి సంపదను, జలవనరులను చెరబట్టినా ప్రతిఘటించిన వారు లేరు. పోరాడి తెచ్చుకున్న తెలంగాణలో కెసిఆర్ పాలన లో భావ ప్రకటన స్వేచ్ఛ లేదు. ప్రజాస్వామిక స్వేచ్ఛ లేదు. ఎన్నో నిర్బంధాలు, మరెన్నో ఆంక్షలు. ఇప్పుడు రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి కాగానే ఈ 15 నెలల్లోనే ఆర్థిక రంగం చిన్నాభిన్నమైపోయినట్లు, రాష్ట్రమంతటా అంధకారం అలుముకున్నట్టు, ప్రజలు తిండి లేక మలమల మాడిపోతున్నట్లు, రైతులు పొలాల్లో, వ్యవసాయ మార్కెట్లలో పిట్టల మాదిరిగా రాలిపోతున్నట్టు కెసిఆర్ చేస్తున్న ప్రచారం ప్రజల్లోకి బలంగా తీసుకువెడుతున్నారు.

ఇలాంటి ప్రచారపర్వానికి పరాకాష్టగానే ఎల్కతుర్తి సిల్వర్ జూబిలీ సభను చూడవలసి ఉన్నది.పైగా 'ప్రభుత్వ వ్యతిరేక సభ' గా రజతోత్సవ సభ మారిపోతుందని మాజీమంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి నిర్వచించారు. ఈ సభలో రేవంత్ రెడ్డిపై ఎన్ని టన్నుల నిప్పులు కురిపించగలరో, ఎన్ని టన్నుల బురద జల్లనున్నారో ఊహించడం కష్టం కాదు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ప్రజల్లో 'తిరుగుబాటు' మొదలయిందంటూ కెసిఆర్ వ్యాఖ్యానిస్తున్నారు. అధికారాన్ని జాగ్రత్తగా కాపాడుకుంటూ, రెండో టర్మ్‌లోనూ గెలిచే వ్యూహాలను ఇప్పటి నుంచే రేవంత్ పదునుబెడుతున్నారు. బిఆర్‌ఎస్ ప్రాంతీయవాద జాతీయ పార్టీయా? లేక జాతీయవాద ప్రాంతీయ పార్టీయా? అన్న అంశంపై బిఆర్‌ఎస్ నిర్మాత కెసిఆర్ తమ పార్టీ రజతోత్సవ సభలో స్పష్టత ఇవ్వవచ్చు. ఉద్యమ ఆకాంక్షల పునాదులపై నిర్మించిన టిఆర్‌ఎస్‌కు, ఇతర ప్రాంతీయ పార్టీలతో పోలికే లేదు. టిఆర్‌ఎస్ 'రాజ్యాంగం' వేరు. కెసిఆర్ 'సిలబస్' వేరు. ఆయనే ఒక యూనివర్సిటీ. 'ఫక్తు రాజకీయపార్టీ' అని ప్రకటించిన నాటినుంచే మిగతా పార్టీల అవలక్షణాలన్నీ వచ్చేశాయి.

## ఆదివాసీల అస్తిత్వంలో ఇప్పపువ్వు మూల వనరు

భారతదేశ ఆదిమ తెగల ప్రకృతి జీవనంలో ఒక చారిత్రక ప్రాధాన్యతను సంతరించుకున్న వృక్షం ఇప్ప చెట్టు. అందుకే అదిలాబాద్ ఇప్ప పువ్వు లడ్డులను మన్ కి బాత్ కార్యక్రమం లో ప్రధాని నరేంద్ర మోడీ ప్రస్తావించి ఇప్ప పువ్వు యొక్క పోషకాలు ఆహార పద్ధతిపై గొప్పగా చెప్పారు. ఉట్నూర్ గోండు మహిళల కృషి నీ కొనియాడారు. ఈ క్రమం లో ఈ పువ్వు ప్రాధాన్యత సంతరించుకుంది. ఆదివాసీల ప్రధాన ఆహారపు అలవాట్లలో ఇప్ప పువ్వు ప్రధానమైనది. ఒకానొక సందర్భంలో కరువు కాటకాలు సంభవించినపుడు ఆదివాసీ జాతికి అనేక రకాల ఆహార ఉత్పత్తులను అందించి బ్రతికించింది అని చెప్తారు గూడెం పెద్దలు.



అందుకే ఆదివాసీల ఆరాధ్య దైవంగా నేడు ఇప్ప చెట్టు ఉంది. తమ సాంస్కృతిక జీవనంలో ఇది లేకుండా పండుగలు జాతరలు జరగవు. భౌగోళిక దక్కన్ పీఠభూమిలో చోట నాగపూర్, సెంట్రల్ హైలాండ్ పీఠ భూమిలో ఆ భూమి యొక్క సారంకి అనుగుణంగా ఇప్పచెట్టు తన రూపం మార్చుకుంటుంది కానీ దానిని ఉపయోగించటంలో మాత్రం ఒకే విధానాలు అవలంబిస్తారు. లేత పసుపురంగులో ఎర్రని రెమ్మలతో మాఘ పున్నమిలో కొమ్మలకు కోలువేసి కాముని పున్నమి వరకు పువ్వు వికసించే ఒక అందమైన పరిమళం ఇది. బుట్టలో ఇంటికి తీసుకు వచ్చి వెంటనే వాకిట్లో ఆరబోస్తారు, అలా 20 నుండి 30 రోజుల పాటు ఎండలో ఆరబోసిన వాటిని మళ్లీ బుట్టలోకి తీసుకున్న తర్వాత అడవికి వెళ్లి పెద్ద తునికాకులు సేకరించి ఇస్తారి ఆకు కుట్టి జల్లగానీ గంపలుగానీ తీసుకొని వాటి లోపల ఇస్తార్లు కుట్టిన ఆకులను పరిచి ఎండపెట్టిన ఇప్ప పువ్వులను గంపలో వేసి తొక్కుతారు. సంవత్సరం వరకు నిల్వ ఉంటాయి. దీనికి గాలి మరియు నీరు తగల కుండా భద్రపరుస్తారు. ఇప్పపువ్వుకుడుములు అంటె లడ్డూలు కూడ ఇడ్లిల వలె చేస్తారు. ఇప్ప పువ్వులను కుడుములు చేయటానికి కొన్ని తీస్కొని పొయ్యి మీద కుండ పెట్టి సరిపడ నీళ్లు పోసి మధ్యలో వెదురు పుల్లలు పెట్టి వాటిపై ఇప్పపూలు, తెల్ల జొన్నల గడక కలిపి ముద్దలు చేసి గుడ్డ పరిచి వాటిపై పెడుతారు. అలా ఆవిరికి ఉడికి ఇప్ప పూల లడ్డు తయారు అవుతుంది ఆహారంగా తింటారు. ఇప్ప గింజల నుండి నూనెను ఉత్పత్తి చేస్తారు ఆదివాసులు. జూన్‌లో పలుకులు తీస్తారు అవి ఎండిన తర్వాత రోట్లో వేసి దంచి పిండిలా చేసి ఆ పిండిని కుండలో వేసి ఉడకబెడతారు. రెండు గంటల సమయం ఉడికిన తర్వాత దాన్ని తీసి వేడిగా ఉన్నప్పుడే తాటి ఆకుల బుట్టలో గట్టిగా కూరుస్తు ఈ బుట్టలను గానుగ మొద్దులో పెట్టి నూనె ఉత్పత్తి చేస్తారు – ఇది ప్రాచీన పద్ధతి.

ఇప్ప పువ్వుతో రొట్టెలు కూడా చేస్తారు. తెల్లజొన్నలను పోసి ఉడకపెట్టి రుబ్బు బండ పైన వేసి మెత్తగా రుబ్బి ఆ ముద్దను ఒక అటికలో వేసుకుని పిండిలో ఉప్పు కలిపి పొయ్యిమీద పెంక పెట్టి వేడయ్యాక అందులో నూనె లేద నెయ్యి వేసి ఒక ఆకు పైన రొట్టె లాగ అద్ది పెంక పైన వేసి రెండు వైపుల కాల్చి చేస్తారు

ఇప్పపువ్వు సార ఆదివాసి జీవనంలో అతి



ప్రాచీనమైనది, ప్రధానమైనది, అతి పవిత్రమైనది కూడ. ఈ సార మనిషి సేవించడం మానవునిలో రోగనిరోధకశక్తిని మెరుగు పరుస్తుంది. అందుకే దీనిని స్త్రీ, పురుషులు, చిన్నపిల్లల తేడా లేకుండ సేవిస్తారు. ప్రధానంగా పండుగలు సమ్మక సారలమ్మ ఇలవేల్పు జాతరలు, పెళ్లిళ్లు, దిన కార్యాలు ఉమ్మడిగా నిర్వహించే ప్రతి కార్యక్రమంలో ఉమ్మడిగా సేవిస్తారు. ఇప్పపువ్వులను కుండ లో 9 రోజులు నాన పెట్టి కుండ పై చిన్న కుండ పెట్టి ఆవిరి ద్వార సార తీస్తారు . ఇలా 30 రకాల ఆదివాసీల ఆహారపు అలవాట్లకు, కడుపు నింపటానికి ఒక ఆధారం అయింది ఇప్ప పువ్వు.

గణేష్ కోర్నిబెల్లి
సమ్మక్క సారలమ్మ ఆర్కియాలజి ఇండిజినస్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ తెలంగాణ
9493260760

## సమాచార కమిషనర్ల నియామకమెప్పుడు?

అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా వర్ధిలుతున్న భారతదేశంలో సమాచార హక్కు చట్టం 2005 అమలులోకి రావడం వెనుక మేధావుల సైద్ధాంతిక దార్శనికతలు, స్వచ్ఛంద సంస్థల జనజాగృతులు మరియు ప్రజల పోరాటోద్యమాల నిర్విరామ కృషి ఎంతగానో ఉంది. ప్రజలకు సుపరిపాలన అందించడం లక్ష్యంగా 2005 అక్టోబర్ 12 నాడు దేశంలో సమాచార హక్కు చట్టం అమలులోకి వచ్చింది.

అవినీతిని నిరోధించడంలో పౌరులకు ఉన్న ఏకైక 'బ్రహ్మాస్త్రం'గా ఈ సమాచార హక్కు చట్టం ఎంతగానో దోహదపడుతూనే ఉంది. కాని ఈ సమాచార హక్కు చట్టం అమలులోకి వచ్చి 20 ఏళ్లు కావస్తున్ననూ కూడా నేటికిని కూడా ఈ చట్టం సజావుగా అమలుకు నోచుకోవడం లేదు. ఫలితంగా సమాచార హక్కు లక్ష్యాలు నీరుగారిపోతున్నాయి. ముఖ్యంగా సమాచార హక్కు చట్టం 2005 ప్రకారం రాష్ట్ర సమాచార కమీషన్‌లో ఒక ప్రధాన సమాచార కమీషనర్‌తో పాటు గరిష్టంగా పదిమంది సమాచార కమిషనర్లు ఉంటారు. కాని నేడు తెలంగాణ రాష్ట్రంలో ప్రధాన సమాచార కమీషనర్‌గా బాధ్యతలు నిర్వహించిన బుద్ధా మురళి, మిగతా కొందరు సమాచార కమీషనర్లు పదవీ విరమణ చేసి రెండేళ్లకు పైగానే గడిచిపోయింది.

2023 ఫిబ్రవరి 24 నాడు చివరి సమాచార కమీషనర్ కూడా పదవీ విరమణ చేశారు. అయిననూ నేటికిని తెలంగాణ రాష్ట్ర సమాచార కమీషనర్ల నియామకాలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఎండమావిగ మిగిలిపోవడం కడు విచారకరం. తెలంగాణ రాష్ట్ర సమాచార కమీషన్ కార్యాలయంలో ఈ రకంగా ప్రధాన సమాచార కమీషనర్ సహా సమాచార కమిషనర్ పదవులు ఏకంగా సంవత్సరాలకు తరబడి ఖాళీగా ఉన్నందున పౌరులు సమాచారం కోసం అప్పీ లు చేసుకుంటున్నా కూడా వాటిని స్వీకరించి ప క్కన పెట్టుకుంటున్నారు. తత్ఫలితంగా సమాచార కమీషన్ కార్యాలయంలో దరఖాస్తుదారుల సమాచార హక్కు అప్పీళ్లు పేరుకుపోతూనే ఉన్నాయి. 2024 డిసెంబర్ 28 నాటికి 10,688 అప్పీళ్లు సమాచార కమీషన్ కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్నాయి. రోజురోజుకు ఈ అప్పీళ్లు పెరిగిపోతూనే ఉన్నాయి.

అందువలన రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే సమాచార కమీషనర్లను నియమించాలి అని ప్రజలు, సమాచార కార్యకర్తలు అడపాదడపా డిమాండ్ చేస్తూనే ఉన్నారు. సమాచార కమీషనర్లు ఉన్నప్పుడు అరకొర సమాచారం అయినా పౌరులకు అందుబాటులోకి వచ్చేది. ఇప్పుడు ఏకంగా కమీషనర్లు లేకపోవడం మూలంగా ఏ చిన్న సమాచారాన్ని కూడా ప్రజలు పొందలేకపోతున్నారు. ఆయా సమాచార కమీషనర్ పోస్టులు రెండేళ్లకు పైగానే భర్తీకి నోచుకోకపోవడం వల్ల అంతిమంగా 'సమాచార హక్కు చట్టం లక్ష్యాలు అసలుకే ఎసరులా ఆవిరి అవుతున్నాయి' అని చెప్పడంలో ఏమాత్రం సందేహం లేదు. 'త్వరలో సమాచార కమీషన్ల నియామకం కోసం సెర్చ్ కమిటీని ఏర్పాటు చేస్తాం. దీనికోసం నాలుగు వారాల గడువు కావాలి' అని ప్రభుత్వం గతంలో హైకోర్టుకు నివేదించిననూ ఆ దిశగా ఏ మాత్రం పురోగతి కనిపించడం లేదు.

జెజెసిపి బాబూరావు
94933 19690

## కావలసింది నినాదాలు కాదు... నిర్మాణాత్మక నిర్ణయాలు




ఐ.పి.రావు

ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పాలన అంతా మతం, మద్యం పైనే కేంద్రీకృతమై ఉంటుంది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత మహాత్మాగాంధీజీ మద్యపాన రహిత దేశంగా భారత్ ఉండాలని ఆశించగా, స్వాతంత్ర్య సమరయోధులు, రాజ్యాంగ నిర్మాతలు, దార్శనికులు భారతదేశం సోషలిస్టు, సెక్యులర్, ప్రజాస్వామ్య పద్ధతిలో కొనసాగాలని ఆశించారు.. దీనికోసమే భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కూడా రాజ్యాంగం రచించడమే కాకుండా, అందరికీ సమ న్యాయం చేయాలని ఆర్థిక, సామాజిక, రాజకీయ, సమానత్వం కోసం పాటుపడ్డారు. బౌద్ధ మతం స్వీకరించి తదనుగుణంగా తన జీవిత లక్ష్యాలను ప్రజలకు తేటతెల్లం చేసాడు..ఇక మొట్టమొదటి ప్రధాన మంత్రి జవహర్లాల్ నెహ్రూ మత పరమైన కార్యక్రమాలకు దూరంగా, దేవాలయాలు సందర్శనాలకు దూరంగా ఉంటూ, దేశంలో లౌకిక విధానానికి అనుగుణంగా తన జీవిత ప్రయాణం కొనసాగించారు. దేశంలో శాస్త్ర సాంకేతిక రంగాలకు, పారిశ్రామిక అభివృద్ధికి పునాదులు వేశారు..తరువాత వచ్చిన ఇందిరాగాంధీ కూడా దాదాపు ఇవే ప్రమాణాలు పాటించడం జరిగింది. అయితే ప్రస్తు త పాలకులు తరచూ దేశంలో ఉన్న దాదాపు అన్ని దేవాలయాలు, గుళ్ళు సందర్శించడమే పెద్ద పనిగా పెట్టుకున్నారు.. అదే సమయంలో అల్లర్లతో అట్టుడుకుతున్న మణిపూర్ లాంటి రాష్ట్రాన్ని మాత్రం దర్శించరు. అక్కడ ప్రజలకు భరోసా ఇవ్వరు. ఇటీవల కాలంలో ముఖ్యంగా గత ఇరవై సంవత్సరాలుగా దేశంలో ఉన్న'భిన్నత్వంలో ఏకత్వం' అనే భావనకు వ్యతిరేకంగా రాజకీయ పార్టీలు నాయకులు కులం, మతం, ప్రాంతం, భాష వంటి సున్నితమైన అంశాలను వివిధ సందర్భాల్లో ప్రజలపై రుద్దుతూ, ప్రజల ఓట్లతో అధికారం చేపట్టడం జరుగుతుంది.. అదే సందర్భంలో మనీ, మద్యం విపరీతంగా వినియోగిస్తూ రాజకీయ పార్టీలు అధికారంలోకి వస్తున్న సంప్రదాయం పెరిగింది.. దీనికి తోడు కేంద్రం, రాష్ట్రాలు అప్పులు ఊబిలో చిక్కుకున్నా, మరల విచ్చలవిడిగా ఉచిత పథకాలు, సంక్షేమ పథకాలు అమలు చేస్తాం అంటూ ప్రజలకు హామీలు ఇచ్చి అధికారంలోకి రావడం మనం అందరం చూస్తున్నం. దీనికి తాజా ఉదాహరణ ఇటీవల జరిగిన హర్యానా, మహారాష్ట్ర, ఢిల్లీ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎన్నికలే...

గత దశాబ్దకాలంగా దేశాన్ని పాలిస్తున్న పాలకులు ఒకే మతానికి ప్రాధాన్యత ఇస్తూ, మతం, దేవాలయాలు, మత క్రతువులు, కుంభమేళా వంటి కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలను మతం వైపు మొగ్గ చూపే విధంగా తర్ఫీదు ఇవ్వడం జరుగుతుంది.అన్ని అంశాలను'ఒకే' అనే నినాదంతో ముడిపెట్టడం జరుగుతుంది. దేశంలో పెరుగుతున్న నిత్యావసర ధరలు, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం వంటి విషయాలుపై ప్రజలు ఆలోచన చేయకుండా చేస్తున్న గమ్మత్తైన గేమ్ ఆడుతున్నారు.. ఈ ఉచ్చులో ప్రజలు కూడా పడిపోతున్నారు. ఇక చాలా రాష్ట్రాలు అపరిమిత మైన ఉచిత పథకాలు అమలు చేస్తూ అప్పుల్లో మునిగి తేలుతూ ఉన్నాయి.. దీనికి మన తెలుగు రాష్ట్రాలే చక్కటి ఉదాహరణ... గత ప్రభుత్వాలు చేసిన అప్పులు తెలిసికూడా, ఎన్నికల్లో గెలిపే లక్ష్యంగా ఇంకా ఉచిత పథకాలు ప్రకటించి అధికారంలోకి వచ్చాయి... తీరా అధికారంలోకి వచ్చిన తరువాత ఇచ్చిన హామీలను అమలు చేయడానికి 'టెంపుల్ టూరిజం' అని మతపరమైన కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తూ, మరోపక్క 'మద్యం(లిక్కర్)' అమ్మకాలు పెంచడం, ప్రోత్సహించడం జరుగుతూ ఆదాయ సముపార్జన చేయడానికి సన్నాహాలు ముమ్మరం చేస్తున్నారు... ఇది ప్రస్తుతం మన కళ్ళకు కట్టినట్లు కనపడుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పాలన...

> ప్రస్తుతం 'ట్రంప్' తీసుకుంటున్న 'టారిఫ్' నిర్ణయాలు ప్రపంచ దేశాలను వణికిస్తుంటే,. ఒకే ఒక 'చైనా' దేశం 'భయపడేది లేదు' అంటూ అమెరికాను హెచ్చరించ గలుగుతుంది అంటే, దీనికి ప్రధాన కారణం ఆ దేశం సాధించిన పారిశ్రామిక అభివృద్ధి అని గ్రహించాలి..ఇక మన దేశం రాష్ట్రాలు స్వయం సమృద్ధి సాధించేందుకు కృషి చేయాలి.. ఆత్మ నిర్భర్ భారత్ సాధనలో నిమగ్నమవ్వాలి. మతం, మద్యం వైపు ప్రజలను ప్రయాణింప చేయడం గాకుండా, ప్రభుత్వం విద్య, వైద్యం ప్రజలకు అందిస్తూ స్వయం ఉపాధి అవకాశాలు పొందే విధంగా ప్రయత్నాలు చేయాలి. అపరిమితమైన ఉచిత పథకాలకు స్వస్తి పలకాలి.

వికసిత భారత్, వికసిత ఆంధ్రప్రదేశ్, రైజింగ్ తెలంగాణ వంటి నినాదాలతో హోరెత్తిస్తున్నారు..ఆ దిశగా మన దేశం, రాష్ట్రాలు చేరాలంటే, నినాదాలు సరిపోవు అని పాలకులు ఇకనైనా గ్రహించాలి.. నిర్మాణాత్మకమై న నిర్ణయాలు తీసుకోవాలి. నాణ్యమైన విద్య అందరికీ అందించవలసిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది అని గ్రహించాలి. శాస్త్ర సాంకేతిక విజ్ఞానం అందించాలి. విద్య, వైద్యంపై దృష్టి సారించాలి. ప్రభుత్వరంగ సంస్థలను కాపాడుకోవాలి. పారిశ్రామిక రంగానికి ఊతం ఇవ్వాలి. ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగు పరచడానికి కృషి చేయాలి... ప్రస్తుతం 'ట్రంప్' తీసుకుంటున్న 'టారిఫ్' నిర్ణయాలు ప్రపంచ దేశాలను వణికిస్తుంటే,. ఒకే ఒక 'చైనా' దేశం 'భయపడేది లేదు' అంటూ అమెరికాను హెచ్చరించ గలుగుతుంది అంటే, దీనికి ప్రధాన కారణం ఆ దేశం సాధించిన పారిశ్రామిక అభివృద్ధి అని గ్రహించాలి..ఇక మన దేశం రాష్ట్రాలు స్వయం సమృద్ధి సాధించేందుకు కృషి చేయాలి.. ఆత్మ నిర్భర్ భారత్ సాధనలో నిమగ్నమవ్వాలి. మతం, మద్యం వైపు ప్రజలను ప్రయాణింప చేయడం గాకుండా, ప్రభుత్వం విద్య వైద్యం ప్రజలకు అందిస్తూ స్వయం ఉపాధి అవకాశాలు పొందే విధంగా ప్రయత్నాలు చేయాలి. అపరిమితమైన ఉచిత పథకాలకు స్వస్తి పలకాలి.. ప్రజల్లో సోమరితనం పెంచరాదు.. మతం, మద్యం మత్తులో ప్రజలను ముంచరాదు.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## 575 మంది కేరళీయులు ఇంకా కశ్మీర్‌లోనే: విజయన్



**తిరువనంతపురం :** జమ్ముకశ్మీర్‌లో పహల్గామ్ ఉగ్రవాద దాడిలో 26 మం ది ప్రాణాలు కోల్పోగా, కేరళకు చెందిన 575 మంది ఇప్పటికీ కశ్మీర్‌లోనే ఉన్నారని, అవసరమైన వారికి ప్రయాణం, వైద్య సహాయం, ఆహారం అం దించడానికి చర్యలు తీసుకున్నామని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ తెలిపారు. కశ్మీర్ నుండి ఢిల్లీకి వచ్చేవారికి తదుపరి ప్రయాణానికి టికెట్ బుకింగ్‌తో సహా ఏర్పాట్లు చేసినట్లు ముఖ్యమంత్రి కార్యాలయం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. కశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడి దేశ మనస్సాక్షిని దిగ్భ్రాంతికి గురిచేసిన దాడిగా అభివర్ణించిన విజయన్, ఇది మళ్ళీ జరగడానికి అనుమతించకూడదని, ఇది మానవాళిపై జరిగిన దాడి అని అన్నారు. అక్కడ ప్రాణాలు కోల్పోయిన వారిలో ఒక కేరళీయుడు ఉండటం మా దుఃఖాన్ని రెట్టింపు చేసిందని, మరణించిన ఎన్ రామచంద్రన్ బంధువుల దుఃఖంలో తాము కూడా పాలుపంచుకుంటున్నామన్నారు. ఇలాంటి దాడులకు, వాటికి ఆజ్యం పోసే ద్వేషపూరిత ప్రచారానికి వ్యతిరేకంగా అందరూ ఐక్యంగా నిలబడాలని ఆయన అన్నారు.

## మన గణతంత్ర విలువలపై
# నేరుగా జరిగిన దాడి


పాకిస్థానే సూత్రధారి,
ఇది పిరికిపంద చర్య
దాడిని ఖండిస్తూ సిడబ్ల్యుసి సమావేశం తీర్మానం



**న్యూఢిల్లీ :** జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడికి పాకిస్థాన్ సూత్రధారి అని, ఇది పరికిపంద చర్య అని కాంగ్రెస్ పార్టీ పేర్కొంది. ఈ దాడి మన గణతంత్ర విలువలపై ప్రత్యక్ష దాడి అని అభివర్ణించింది. ఐక్యత అత్యంత అవసరమైన సమయంలో ఈ విషాదాన్ని బిజెపి విద్వేషానికి ఉపయోగించుకుంటుందని ఆరోపించింది. పార్టీ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే అధ్యక్షతన జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సిడబ్ల్యుసి).. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ప్రత్యక్షం పరిధిలో ఉన్న కేంద్రపాలిత ప్రాంతంలో ఇటువంటి దాడికి దారితీసిన నిఘా వైఫల్యాలు, భద్రతా లోపాలపై సమగ్ర విశ్లేషణ నిర్వహించడం అత్యవసరం ఉద్ఘాటించింది. ఢిల్లీలో 24, అక్బర్ రోడ్‌లో ఉన్న పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగిన సిడబ్ల్యుసి సమావేశానికి పార్టీ మాజీ అధ్యక్షులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రధాన కార్యదర్శులు కెసి వేణుగోపాల్, జైరామ్ రమేష్, ప్రియాంక గాంధీ వాద్రా తదితరులు పాల్గొన్నారు. పహల్గామ్ ఉగ్రదాడి బాధితుల జ్ఞాపకార్థం నాయకులు ఒక క్షణం మౌనం పాటించి నివాళులర్పించారు. అయితే కీలకమైన సమావేశంలో పాల్గొనడానికి రాహుల్ గాంధీ తన అమెరికా పర్యటనను ముగించుకుని తిరిగి వచ్చారు. సిడబ్ల్యుసి సమావేశంలో పహల్గామ్‌లో జరిగిన దారుణమైన ఉగ్రవాద దాడిలో 26 మంది అమాయక పర్యాటకులు ప్రాణాలు కోల్పోగా, అనేక మంది గాయపడటం పట్ల పార్టీ అత్యున్నత నిర్ణయాధికార సంస్థ దిగ్భ్రాంతిని వ్యక్తం చేసింది. దాడిని తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఒక తీర్మానాన్ని ఆమోదించింది. ఈ తీర్మానాన్ని పార్టీ ప్రధాన కార్యదర్శి కె.సి. వేణుగోపాల్, జైరాం రమేష్, పవన్ ఖేరా విలేకరుల సమావేశంలో చదివి వినిపించారు. దేశవ్యాప్తంగా హిందువులను లక్ష్యంగా చేసుకుని జరిగిన దాడి అని, దేశవ్యాప్త భావోద్వేగాలను రెచ్చగొట్టడానికే చేశారన్నారు. 'పహల్గామ్ దాడికి పాకిస్థాన్ సూత్రధారి. ఇది ఒక ప్రణాళికాబద్ధంగా జరిగింది. గణతంత్ర విలువలపై ప్రత్యక్ష దాడి. దేశవ్యాప్తంగా భావోద్వేగాలను రెచ్చగొట్టడానికే హిందువులను ఉద్దేశపూర్వకంగా లక్ష్యంగా చేసుకోవడం జరిగింది. ఈ తీవ్రమైన రెచ్చగొట్టే చర్యను ఎదుర్కొని ప్రశాంతంగా ఉండాలని విజ్ఞప్తి చేస్తున్నాము. ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొని మన సమష్టి బలాన్ని పునరుద్ఘాటిద్దాం' అని తీర్మానం పేర్కొంది. ఈ సమయంలో ప్రజలు శాంతియుతంగా ఉండాలని విజ్ఞప్తి చేసింది. సీమాంతర ఉగ్రవాదాన్ని యుక్తితో ఐక్యంగా ఎదుర్కోవాలని తీర్మానంలో చెప్పింది. జమ్ముకశ్మీర్‌లో జరిగిన ఈ మారణహోమాన్ని అన్ని రాజకీయ పార్టీలు, కేంద్రపాలిత ప్రాంత ప్రజలు సమర్థవంతంగా ఖండించారని కాంగ్రెస్ గుర్తుచేసింది. అయితే ఐక్యత, సంఘీభావం అత్యంత అవసరమైన సమయంలో మరింత అసమ్మతి, అపనమ్మకం, విభజనను ప్రోత్సహించేందుకు బిజెపి అధికారిక, పరోక్ష సోషల్ మీడియా వేదికల ద్వారా ఈ ఘోర విషాదాన్ని ఉపయోగించుకోవడం దిగ్భ్రాంతికరమని తీర్మానం పేర్కొంది. పహల్గామ్ అత్యంత రక్షణాత్మక ప్రాంతంగా ప్రసిద్ధి చెందిందని, మూడు అంచెల భద్రతా ఏర్పాట్ల ద్వారా సురక్షితంగా ఉందని, ఈ పరిస్థితుల్లోనూ దాడికి దారితీసిన నిఘా వైఫల్యాలు, భద్రతా లోపాలపై సమగ్ర విశ్లేషణ చేయాలని సిడబ్ల్యుసి కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. విశాల ప్రజా ప్రయోజనం దృష్ట్యా ఈ ప్రశ్నలను లేవనెత్తాలని, ఇంత దారుణంగా నాశనమైన కుటుంబాలకు నిజంగా న్యాయం జరిగేలా చూడగలిగే ఏకైక మార్గం ఇదే అని తీర్మానం పేర్కొంది. అమర్‌నాథ్ యాత్ర త్వరలో ప్రారంభం కానుందని సిడబ్ల్యుసి గుర్తుచేస్తూ బలమైన, పారదర్శకమైన, చురుకైన భద్రతా ఏర్పాట్లను ఆలస్యం లేకుండా అమలు చేయాలని డిమాండ్ చేసింది. భారతదేశం అంతటా లక్షలాది మంది యాత్రికులు ఈ వార్షిక ప్రయాణంలో పాల్గొంటారని, వారి భద్రతను జాతీయ ప్రాధాన్యతగా పరిగణించాలని కోరింది. జమ్ముకశ్మీర్ ప్రజల జీవనోపాధిని, అలాగే యాత్రికుల భద్రతను పూర్తి నిజాయితీ కాపాడాలని సిడబ్ల్యుసి నొక్కి చెప్పింది. అదే విధంగా భారతదేశ ఆలోచనను నిలబెట్టడానికి పర్యాటకులను రక్షించడానికి నిస్వార్థంగా ప్రయత్నిస్తున్నప్పుడు అమరవీరులైన స్థానిక 'పోనీవాలాస్', టూరిస్ట్ గైడ్‌లకు కూడా సిడబ్ల్యుసి నివాళులర్పించింది. భయంకరమైన ఉగ్రవాద దాడిలో మరణించిన వారికి సంఘీభావంగా ఈనెల 25న దేశవ్యాప్తంగా రాష్ట్ర, జిల్లా స్థాయిలో కాంగ్రెస్ కొవ్వొత్తుల ర్యాలీలు నిర్వహిస్తుందని వేణుగోపాల్ ప్రకటించారు. సిడబ్ల్యుసి తర్వాత కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గులాం అహ్మద్ మీర్ విలేకరులతో మాట్లాడుతూ పహల్గామ్ ఉగ్రవాద దాడి భద్రత, నిఘా వైఫల్యం గురించి తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతుందన్నారు. ఈ ప్రాంతంలో భద్రత ఎందుకు లేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

## ఉగ్రవాదులకు ఊహించని శిక్ష విధిస్తాం

**భూమిపై ఏ మూలకు ఉన్నా వెంబడిస్తాం : ప్రధాని మోదీ ప్రకటన**




**న్యూఢిల్లీ :** జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులను దారుణంగా కాల్చివేసిన హంతకులను భూమి ఏ మూలకు ఉన్నా వెంబడించి శిక్షిస్తామని ప్రధాని నరేంద్రమోదీ ప్రకటించారు. ప్రతి ఉగ్రవాదిని , వారికి మద్దతు ఇచ్చేవారిని గుర్తించి వారిని వేటాడి మరీ శిక్ష విధిస్తామని హెచ్చరించారు. ఈనెల 22న పహల్గామ్‌లో జరిగిన దాడిలో 26 మంది మరణించిన తర్వాత తొలిసారి ప్రధాని స్పందించారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా బిహార్‌లోని మధుబనిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మోదీ పాల్గొని ప్రసంగించారు. దాడి వెనుక ఉన్న ఉగ్రవాదులను శిక్షిస్తామని ప్రధానమంత్రి ప్రతిజ్ఞ చేశారు. ఉగ్రవాదం ద్వారా భారతదేశ స్ఫూర్తి ఎప్పటికీ విచ్ఛిన్నం కాదని పేర్కొన్నారు. 'మిత్రులారా ఈ రోజు బీహార్ నేల నుండి, నేను మొత్తం ప్రపంచానికి చెబుతున్నాను. భారతదేశం ప్రతి ఉగ్రవాదిని, వారికి మద్దతు ఇచ్చేవారిని గుర్తించి, ట్రాక్ చేసి శిక్షిస్తుంది. మేము వారిని భూమి చివరి వరకు వెంబడిస్తాము. ఉగ్రవాదం ద్వారా భారతదేశ స్ఫూర్తి ఎప్పటికీ విచ్ఛిన్నం కాదు. ఉగ్రవాదాన్ని శిక్షించకుండా ఉండము' అని మోదీ ఇంగ్లీషులో గట్టి వార్నింగ్ ఇచ్చారు. ఈ విపత్కర పరిస్థితిని ఎదుర్కొనేందుకు యావత్ దేశం దృఢసంకల్పంతో ఉందన్నారు. మానవత్వాన్ని విశ్వసించే ప్రతి ఒక్కరూ మనతో ఉన్నారని, ఈ కాలంలో మనతో పాటు నిలిచిన వివిధ దేశాల ప్రజలకు, వారి నాయకులకు కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. దాడి చేసిన ఉగ్రవాదులు, కుట్ర పన్నిన వారిని వారి ఊహకు మించి శిక్షిస్తామని పరోక్షంగా పాకిస్థాన్‌ను హెచ్చరించారు. 140 కోట్ల మంది భారతీయుల సంకల్ప శక్తి ఉగ్రవాదుల వెన్నెముకను విరిచివేస్తుందని ప్రధానమంత్రి అన్నారు. బాధితులకు వారి కుటుంబాలకు సంతాపం తెలియజేస్తూ, ఏప్రిల్ 22న కశ్మీర్‌లో ఉగ్రవాదులు 26 మంది అమాయక పౌరులను చంపిన దారుణమైన తీరుపై దేశవ్యాప్తంగా పౌరులు శోకసంద్రంలో ఉన్నారని అన్నారు. దేశం వారి కుటుంబాలకు అండగా నిలుస్తుందని చెప్పారు. ప్రధాని తన ప్రసంగానికి ముందు వేదికపై ఉన్న ఇతర నాయకులు, సభకు హాజరైన వారు ఉగ్రదాడి బాధితులకు నివాళులర్పించి మౌనం పాటించారు. ప్రజలు తమ కుమారులు, సోదరులు, భర్తలను కోల్పోయారని, బాధితులు బెంగాల్, కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్, ఒడిశా మరియు బీహార్ తదితర రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాలకు చెందినవారని ఆయన అన్నారు. కార్గిల్ నుండి కన్యాకుమారి వరకు దుఃఖం, కోపం ఒకేలా ఉన్నాయని చెప్పారు.

## పాక్ హైకమిషన్ వద్ద నిరసనలు



**న్యూఢిల్లీ :** పహల్గామ్ ఉగ్రదాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోవడాన్ని వ్యతిరేకిస్తూ ఢిల్లీలోని పాకిస్తాన్ హైకమిషన్ సమీపంలో 500కుపైగా మంది నిరసన తెలిపారు. ప్లకార్డులు పట్టుకుని, పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పొరుగు దేశంపై నిర్ణయాత్మక చర్య తీసుకోవాలని నిరసనకారులు డిమాండ్ చేశారు. భారతదేశంలో ఉగ్రవాద కార్యకలాపాలకు మద్దతు ఇస్తున్నారని ఆరోపించారు. ఉగ్రవాద వ్యతిరేక చర్య ఫోరం వంటి వివిధ సామాజిక సంస్థలతో పాటు బిజెపి కూడా ఈ నిరసనలో పాల్గొంది. ఢిల్లీ పోలీసులు హైకమిషన్ నుండి 500 మీటర్ల దూరంలో బారికేడ్లు ఏర్పాటు చేశారు. నిరసనకారులను అక్కడ అడ్డుకున్నట్లు ఒక అధికారి తెలిపారు. గతంలో, ప్రభుత్వం సర్జికల్ స్ట్రైక్ చేసిందని, ఉగ్రవాదాన్ని నిర్మూలించడానికి మళ్ళీ ఇలాంటి చర్యలను చేపట్టాడలని డిమాండ్ చేస్తున్నట్లు యాంటీటెర్రర్ యాక్షన్ ఫోరం సభ్యుడు పిటిఐకి చెప్పారు. పహల్గామ్‌లో జరిగిన దాడి అమాయక పర్యాటకులపై సిగ్గుచేటు దాడి అని అన్నారు. ప్రభుత్వం ఇప్పటికే ఒక ప్రణాళికను రూపొందించి ఉంటుందని తాము విశ్వసిస్తున్నామన్నారు. ప్రభుత్వం పాకిస్తాన్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని మరొక నిరసనకారుడు విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం మరిన్ని సర్జికల్ స్ట్రైక్స్ అవసరమని తాము భావిస్తున్నామని, ఇది ఉగ్రవాదుల సిగ్గుచేటు చర్య అని, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఉగ్రవాదంపై కఠిన చర్యలు తీసుకుంటారని ప్రతి భారతీయుడు ఆశిస్తున్నాడన్నారు. జమ్ముకశ్మీర్‌లో జరగనున్న అమర్‌నాథ్ యాత్ర కోసం వెళ్లే యాత్రికుల భద్రతను నిర్ధారించడానికి తక్షణ చర్యలు తీసుకోవాలని నిరసనకారులు డిమాండ్ చేశారు. 'అమర్‌నాథ్ యాత్రికుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఇప్పటికే జరుగుతోంది, ఈ దాడి వారిలో భయాందోళనలకు గురిచేసింది. చాలా మంది భక్తులు తమ ప్రణాళికలను రద్దు చేసుకుంటున్నారు. ఇప్పుడు, కఠినమైన చర్యలు తక్షణం అవసరం' అని మరొక నిరసనకారుడు అన్నారు. హైకమిషన్ వైపు ర్యాలీగా వెళ్లడానికి కొంతమంది నిరసనకారులు బారికేడ్లను ఎక్కేందుకు ప్రయత్నించగా వారిని పోలీసులు అడ్డుకున్నారు. అయితే ఇంకా అనేక సంస్థలు నిరసనకు పిలుపునిచ్చిన తర్వాత ఢిల్లీ పోలీసులు హైకమిషన్ వెలుపల భద్రతను కట్టుదిట్టం చేశారు. పాకిస్తాన్ హైకమిషన్ సమీపంలోని త్రిమూర్తి చౌక్ వద్ద నిరసన జరుగుతుందని తమకు సమాచారం అందిందని ఒక పోలీసు అధికారి తెలిపారు.


## ప్రపంచదేశాల దౌత్యవేత్తలకు..
# పాకిస్థాన్ ఆగడాలు వివరించిన భారత్



**న్యూఢిల్లీ:** భారత్ సరిహద్దుల్లోంచి పాకిస్థాన్ చేస్తు న్న ఉగ్రవాద ఆగడాలను ప్రపంచ దేశాల దౌత్యవేత్తలకు భారతదేశం వివరించింది. దక్షిణ కశ్మీరు అనంత్‌నాగ్‌జిల్లా పహల్గామ్ సమీపం బైసారన్ యాత్రాప్రాంతంలో మంగళవారం మధ్యాహ్నం 26 మంది పర్యాటకులను కాల్చి చంపిన ఉగ్రవాదుల దుశ్చర్యను, దాని వెనుక పనిచేస్తున్న కారకాలను వివిధ దేశాల దౌత్యవేత్తలకు భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిశ్రీ తెలియజేశారు. అమెరికా,రష్యా,చైనా, బ్రిటన్,ఫ్రాన్స్,జర్మనీ సహా అనేక దేశాల దౌత్యవేత్తలకు ఉగ్రవాదుల దుశ్చర్య గురించి ఆయన వివరించారు. భారత్–పాకిస్థాన్ సరిహద్దుల్లో పనిచేస్తున్న ఉగ్రవాదులు, వారికి ఉన్న సంబంధాల గురించి ఆయన వివరించారు. ఉగ్రవాదాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ భారతదేశం సహించబోదని, వారి ప్రతిచర్యకూ కఠినమైన శిక్ష లు విధిస్తుందనీ చెప్పారు. బైసారన్‌లో కాల్పుల దాడి జరిగిన మరునాడు కేంద్ర ప్రభుత్వ సిసిఎస్ సమావేశమై పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా ఐదు కీలక నిర్ణయాలు తీసుకుని వాటిని తక్షణ ప్రాతిపదికపై అమలులోకి తీసుకువచ్చింది. 1960 లో పాకిస్థాన్‌తో చేసుకున్న సింధు జలాల ఒప్పందం రద్దు, వాఘా సరిహద్దు మూసివేత, ప్రత్యేక వీసాల రద్దు, పాకిస్థాన్ దౌత్యకార్యాలయంలో సిబ్బంది సంఖ్యను 55 నుండి 30కి తగ్గింపు, పాకిస్థాన్ దౌత్యకార్యాలయాల్లో పనిచేసే సైనిక సిబ్బంది, దౌత్యాధికారులను అవాంఛిత వ్యక్తులుగా ప్రకటించి దేశం విడిచ వెళ్ళాలని చెప్పడంతోపాటు తాజాగా వైద్యపరమైన వీసాలతోపాటు పాకిస్థాన్ జాతీయులకు ఇచ్చిన అన్ని రకాల వీసాలను రద్దుచేస్తున్నట్లు భారత ప్రభుత్వం ప్రకటించింది. భారత పౌరులను పాకిస్థాన్‌లో పర్యటించవద్దని కూడా గట్టి ఆదేశాలు జారీ చేసింది. గతంలో భారత్ సరిహద్దులు దాటి పాకిస్థాన్ సహాయంతో ఉగ్రవాదులు చేసిన ఆగడాలను కూడా విదేశీ దౌత్యవేత్తలకు భారత ప్రభుత్వం వివరించింది. విక్రమ్ మిశ్రీ ఈ సమాచారం తెలియజేయడానికి ఏర్పాటు చేసిన సమావేశంలో ఓమన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఖతార్, నార్వే, ఇటలీ, ఇండోనేసియా, మలేసియా దౌత్యవేత్తలు కూడా పాల్గొన్నారు. పహల్గామ్ సమీపంలో జరిగిన దాడి వెనుక సరిహద్దుల వెలుపల నుండి ఉగ్రవాదులకు లభించిన సహాయం, వారితో ఉన్న సంబంధాలు కూడా సిసిఎస్ సమావేశంలో వెలుగులోకి వచ్చాయని, దీంతో ప్రభుత్వం పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా పలు చర్యలు తీసుకోవాలని దేశ భద్రతకు సంబంధించిన మంత్రివర్గ కమిటీ నిర్ణయించిందని మిశ్రీ చెప్పారు. ఈ ఘటనపై దేశ వ్యాప్తంగా తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం కావడంతో, పహల్గామ్‌లో కాల్పులు జరిపిన కిరాతకులు, వారి సూత్రధారులకు ఈ భూమ్మీద ఎక్కడా చోటు లేకుండా చేస్తామని ప్రధానమంత్రి నరేంద్రమోదీ మంగళవారంనాడు ప్రకటించారు. పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా గతంలో తీసుకున్న చర్యలు కాకుండా తాజా నిర్ణయాలతో రెండు దేశాలమధ్య సంబంధాలు మరింత క్షీణస్థాయికి చేరుకున్నట్లయింది.

ఇదిలా ఉండగా, ఉగ్రవాదులకు భూమ్మీద చోటు లేకుండా చివరివరకూ తరిమికొడతామని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రకటించారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా గురువారంనాడు బీహార్‌లోని మధుబనిలో పలుకార్యక్రమాల్లో ప్రధానమంత్రి ప్రసంగించారు. ఉగ్రవాద దాడులకు వెనక ఉన్న శక్తులను శిక్షించి తీరుతామని చెప్పారు. భారతదేశ స్ఫూర్తిని ఉగ్రవాదం ఎన్నటికీ నాశనం చేయలేదని అన్నారు.

## పాక్ జాతీయులకు
## భారత్ వీసాల నిలిపివేత



**న్యూఢిల్లీ :** పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో భారత ప్రభుత్వం తీవ్రంగా స్పందిస్తోంది. పాకిస్థాన్‌తో దౌత్య సంబంధాలపై కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. తాజాగా పాక్ జాతీయులకు వీసా సేవలు నిలిపివేసింది. వైద్యపరమైన వాటితో సహా ఆ దేశ ప్రజలకు ఇచ్చిన అన్ని వీసాలను రద్దు చేసింది. ఈ మేరకు మన విదేశాంగ శాఖ ఆదేశాలు ఇచ్చింది. పాక్ జాతీయులకు భారత్ జారీ చేసిన అన్ని చెల్లుబాటు అయ్యే వీసాలు 2025 ఏప్రిల్ 27 నుంచి రద్దుకానున్నాయి. ఆ దేశీయులకు జారీ చేసిన అన్ని మెడికల్ వీసాలు ఏప్రిల్ 29 వరకు మాత్రమే చెల్లుబాటు అవుతాయి. ఈ గడువు ముగిసేలోగా వారంతా భారత్‌ను వీడివెళ్లిపోవాలి. ఈ దేశ పౌరులు పాక్‌లో పర్యటించవద్దని సూచిస్తున్నాం అని విదేశాంగ శాఖ గురువారం ప్రకటన విడుదల చేసింది. ఇదిలా ఉంటే.. పహల్గాం ఘటన తర్వాత ప్రధాని మోదీ అధ్యక్షతన భద్రతా వ్యవహారాల క్యాబినెట్ కమిటీ (సిసిఎస్ ) సమావేశమైన సంగతి తెలిసిందే. ఆ తర్వాత కొన్ని కీలక నిర్ణయాలు వెలువడ్డాయి. భారత్‌లోని పాకిస్థాన్ దౌత్య కార్యాలయాల్లో పనిచేస్తోన్న ఆ దేశ సైనిక సిబ్బంది, అధికారులను అవాంఛిత వ్యక్తులుగా ప్రకటిస్తూ నిర్ణయం తీసుకోవడంతో పాటు వారు దేశం వీడి వెళ్లేందుకు వారం గడువు విధించారు. సార్క్ వీసా మినహాయింపు పథకం ద్వారా మన దేశంలో పర్యటిస్తున్న పాకిస్థాన్ జాతీయులకు అనుమతుల రద్దు చేస్తున్నట్లు చెప్పారు. మే ఒకటో తేదీలోగా దేశం వీడి వెళ్లిపోవాలని ఆదేశించారు. ఈ క్రమంలో తాజాగా విదేశాంగ శాఖ ఆ దేశ ప్రజలనుద్దేశించి సవివర ప్రకటన విడుదల చేసింది.

## ఉధంపూర్‌లో ఎన్‌కౌంటర్

**జమ్ము :** జమ్ముకశ్మీర్‌లోని ఉధంపూర్ జిల్లాలో భద్రతా దళాలు, ఉగ్రవాదుల మధ్య గురువారం ఎన్‌కౌంటర్ జరిగింది. ఎదురు కాల్పుల్లో ఆర్మీ ప్రత్యేక దళాలకు చెందిన ఒక సైనికుడు మృతి చెందినట్లు అధికారులు తెలిపారు. ఉగ్రవాదులు నక్కి ఉన్నారనే సమాచారం ఆధారంగా కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్‌లో ప్రారంభించారు. ఈ నేపథ్యంలో దుదు–బసంత్‌గఢ్ ప్రాంతంలో కాల్పులు జరిగాయని అధికారులు తెలిపారు. నిఘావర్గాల పక్కా సమాచారం ఆధారంగా, జమ్ముకశ్మీర్ పోలీసులతో కలిసి ఉధంపూర్‌లోని బసంత్‌గఢ్ ప్రాంతంలో గురువారం సంయుక్తంగా ఆపరేషన్ ప్రారంభించినట్లు వైట్ నైట్ కార్ప్స్ ఎక్స్‌లో పోస్టు చేసింది. కాల్పుల ప్రారంభంలో తూటాలు తగిలి ఒ సైనికుడు గాయపడగా, అతనికి మెరుగైన చికిత్స అందించినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని ఆర్మీ తెలిపింది. మరణించిన సైనికుడిని ప్రత్యేక దళాల 6 పారాకు చెందిన హవల్దార్ ఝూంటు అలీ షేక్‌గా గుర్తించారు. అయితే ఆపరేషన్ ఇంకా కొనసాగుతూనే ఉంది. అయితే విచారణ నిమిత్తం ఆ ప్రాంతం నుంచి నలుగురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. గత 24 గంటల్లో జమ్ములో ఉగ్రవాదులు, భద్రతా దళాల మధ్య జరిగిన మూడవ ఎన్‌కౌంటర్ ఇది. దక్షిణ కశ్మీర్‌లోని కుల్గాం జిల్లాలోని టాంగ్‌మార్గ్ ప్రాంతంలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ సందర్భంగా ఉగ్రవాదులు భద్రతా సిబ్బందిపై కాల్పులు జరిపిన తర్వాత బుధవారం ఎన్‌కౌంటర్ జరిగింది. బారాముల్లాలోని ఉరి నాలా ప్రాంతంలో చొరబాటు ప్రయత్నాన్ని భారత సైన్యం భగ్నం చేసింది. బుధవారం జరిగిన తీవ్ర కాల్పుల మధ్య ఇద్దరు ఉగ్రవాదులను హతమార్చింది. మంగళవారం పహల్గామ్‌లో జరిగిన ఘోరమైన ఉగ్రవాద దాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయిన తర్వాత ఈ ఘటన జరిగింది. ఉధంపూర్ జిల్లాలోని బసంత్‌గఢ్ బెల్ట్ గత ఏడాది కాలంలో వరుస ఉగ్రవాద ఘటనలను చవి చూసింది. ఆ నెల 9న, ఉధంపూర్ జిల్లాలోని రాంనగర్‌లోని జోఫర్‌మార్తా బెల్ట్‌లో భద్రతా దళాలు, ఉగ్రవాదుల మధ్య ఎన్‌కౌంటర్ జరిగింది. అయితే, ఉగ్రవాదులు తప్పించుకున్నారు. గత సంవత్సరం సెప్టెంబర్ 11న, బసంత్‌గఢ్ ఎగువ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో జైషే మహమ్మద్ (జెఎం) సంస్థకు చెందిన ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారు. గత ఏడాది ఏప్రిల్ 29న, బసంత్‌గఢ్‌లోని పనారా గ్రామంలో గుర్తుతెలియని ముష్కరులతో జరిగిన కాల్పుల్లో ఒక విలేజ్ డిఫెన్స్ గార్డ్ సభ్యుడు మరణించాడు. కతువా సరిహద్దు జిల్లా, దోడాకిష్త్వార్ బెల్ట్ మధ్య ఉన్న ఈ వ్యూహాత్మక బెల్ట్‌లో చొరబాటు మార్గాలలో భాగంగా అనేక ఎన్‌కౌంటర్లు, ఆపరేషన్లు జరిగాయి.

## ఢిల్లీ జెఎన్‌యు ఎన్నికల డిబేట్..
# 'మినీ పార్లమెంట్ '!

డ్రమ్స్ ధ్వనులు, రెపరెపలాడిన జెండాలు, పోటాపోటీ నినాదాల వేదికగా యాంఫిథియేటర్

బుధవారం రాత్రి మొదలైన అధ్యక్ష అభ్యర్థుల ప్రసంగాలు గురువారం ఉదయం వరకూ కొనసాగింపు

'నేడే' ప్రతిష్ఠాత్మక జెఎన్‌యు స్టూడెంట్స్ యూనియన్ ఎన్నికలు



**న్యూఢిల్లీ :** భారతదేశంలో అత్యంత రాజకీయ స్పృహ కలిగిన ఢిల్లీలోని ప్రఖ్యాత జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం(జెఎన్‌యు)లో జరుగబోతున్న విద్యార్థి యూనియన్ ఎన్నికల వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. జెఎన్‌యు ప్రెసిడెంట్ ఎన్నికకు సంబంధించిన డిబేట్‌కు వేదికైన యాంఫిథియేటర్ అత్యంత బలంగా డ్రమ్స్ ధ్వనులు, దిక్కులు పిక్కటిల్లేలా నినాదాలు, చప్పట్లు, కేరింతలు, రెపరెపలాడుతున్న జెండాల నడుమ హోరెత్తింది. జెఎన్‌యు ఎన్నికలలో 7,906 మంది విద్యార్థులు ఓటు హక్కు అర్హత కలిగిఉన్నారు. ఇందులో పురుషులు 57శాతం, స్త్రీలు 43శాతం ఉన్నారు. ఏప్రిల్ 25న (శుక్రవారం) నాడు రెండు సెషన్లలో అంటే ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, మధ్యాహ్నం 230 గంటల నుండి సాయంత్రం 530 గంటలవరకు పోలింగ్ జరుగనున్నది.అదే రోజు రాత్రి కౌంటింగ్ జరుగనుండగా, ఏప్రిల్ 28న ఫలితాలు వెల్లడించే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. బుధవారం రాత్రి ఎన్నికల డిబేట్ సందర్భంగా 'కశ్మీర్ హమారా హై'. 'హిందూ జీవనపోరాటం' ఎబివిపి 'ఆజాదీ' నినాదాలు, ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఎస్ఏ) పాలస్తీనా జెండాకు సంఘీభావం ప్రదర్శన మధ్య యాంఫిథియేటర్ మినీపార్లమెంట్‌ను తలపించింది. వేదిక ప్రతీ అంగుళం ఒక కథ చెబుతున్నట్లుగా మారింది. చేతిరాతలతో కూడిన పోస్టర్లు సమాధానాలను డిమాండ్ చేస్తున్నాయి. 'మా హాస్టల్ ఎక్కడ ఉంది'? అని ఓ వ్యక్తి అడిగారు. నెహ్రూ చిత్రపటం కొద్దిగా చినిగి ఉండటం కనిపించింది. యూనివర్సిటీ మూలాలను జనసమూహాలు గుర్తు చేస్తున్నాయ్. మైక్రోఫోన్లతో కూడిన చెవులు చిల్లులు పడేలా థాప్లిస్, డ్రమ్స్, నినాదాలను తరచూ ఎన్నికల కమిటీ అడ్డుకోవడం కంటపడింది. బుధవారం రాత్రి 1130గంటలకు మొదలైన డిబేట్ గురువారం తెల్లవారుజాము వరకూ కొనసాగింది. దాదాపు 4గంటలకు ముగిసింది. అధ్యక్ష పదవికి పోటీ చేస్తున్న 13మంది అభ్యర్థులు ఒక్కొక్కరూ 10నిమిషాల చొప్పున వారి అభిప్రాయాలను వినిపించారు. ఒక్కసారిగా జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ ఆదర్శ భావజాలపరమైన ముఖాముఖీ చర్చతో రాజకీయ వాతావరణాన్ని దర్శనమిచ్చింది. ప్రసంగాలకు ముందు జమ్ముకశ్మీర్ లోని పహల్గామ్‌లో ఉగ్రవాదుల చేతిలో అత్యంత కిరాతకంగా చంపబడిన 28మంది ప్రజల జ్ఞాపకార్థం రెండు నిమిషాలపాటు మౌనం పాటించి సంతాపం తెలిపారు. ఉపన్యాసాలు ప్రారంభ సమయంలో పోటాపోటీగా యాంఫిథియేటర్‌లో దిక్కులు పిక్కటిల్లేలా నినాదాలు ప్రతిధ్వనించాయి. ఆల్ ఇండియా స్టూడెంట్స్ యూనియన్, ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు మధ్య ఘర్షణ వాతావరణం తలపించింది. వక్తలు వేదికమీదకు వచ్చినప్పుడల్లా ఎబివిపి వాలంటీరుల ధోలక్స్, మెటల్ ప్లేట్స్ మోగించారు. ఇటీవలి పహల్గామ్ ఉగ్రదాడిని ఘటనపై ఎబివిపి అధ్యక్ష అభ్యర్థి శిఖా స్వరాజ్ జనాన్ని ఉద్దేశించి తనదైన శైలిలో రెచ్చగొట్టే ప్రసంగంచేశారు. ఉగ్రవాదానికి మతం అంటూ లేదని అన్నారు. జెఎన్‌యులో వామపక్షం విద్యార్థి సంఘాలు వైఫల్యం చెందాయన్నారు. విద్యార్థుల హక్కులపై ఎబివిపి ఎంత నిజాయితీగా పోరాటం చేస్తుందనేది చూపించేందుకు ఈ ఎన్నికలు ఒక మంచి అవకాశం అన్నారు. జెఎన్‌యు ఎన్నికలను తారుమారు చేసి గెలవాలనుకుంటున్నారని , రిగ్గింగ్ చేసేందుకు ఛండీగఢ్ మేయర్ ఎన్నికలు అనుకుంటున్నారా? ఇది జెఎన్‌యు అని పదునైన చురకలు వేశారు. చౌదరి తయ్యబా అహ్మద్ ప్రసంగిస్తున్నంత సేపు కొంతమంది అత్యంత నాటకీయ అంతరాయం కలుగజేశారు. ఎస్ఎఫ్ఐ, బిఎపిఎస్ఎ, పిఎస్ఎ సంకీర్ణం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మహిళ ప్రసంగిస్తున్నంతసేపు ఎబివిపి మద్దతుదారులు లోహపు మూతల శబ్ధాలతో ఆటంకపరిచారు. ఈసారి ఎన్నికలలో ప్రధాన పునర్వ్యవస్థీకరణలు చోటుచేసుకున్నాయి. దీర్ఘకాలం ఐక్యంగా ఉన్న వామపక్ష విద్యార్థి సంఘాలు చీలిపోయాయి. ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ డిఎస్ఎఫ్‌తో జతకట్టింది. కాగా అదేసమయంలో ఎస్ఎఫ్ఐ, బిఎపిఎస్ఎ , ఏఐఎస్ఎఫ్ మరియు పిఎస్ఏ మరొక కూటమిని ఏర్పాటుచేసుకున్నాయి.

## బెంగళూరులో భరత్‌భూషణ్‌కు
# సిఎం సిద్ధరామయ్య నివాళి



**బెంగళూరు :** జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రవాదుల కాల్పుల్లో మరణించిన భరత్ భూషణ్‌కు బెంగళూరులోని నివాసంలో గురువారం కర్ణాటక ము ఖ్యమంత్రి సిద్ధరామయ్య నివాళులు అర్పించారు. అలాంటి ఘటనలు పునరావృతం కాకుం డా ఉగ్రవాదులను తుదముట్టించాలని సిద్ధరామయ్య కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఉగ్రవాదులకు వ్యతిరేకంగా చర్య చేపట్టే విషయంలో ప్రతీ ఒక్కరూ కేంద్రం పక్షాన ఉంటారని ఆయన నొక్కిచెప్పారు. మంగళవారం నాడు పహల్గామ్‌లో ఉగ్రవాదుల కాల్పులలో మరణించిన 26మందిలో కర్ణాటకకు చెందిన మంజునాథరావు, భరత్ భూషణ్ ఉన్నారు. వారి మృతదేహాలను గుర్తుపట్టిన అనంతరం ఇక్కడకు తీసుకువచ్చా రు. అయితే పహల్గామ్ ఉగ్రదాడిలో చనిపోయిన 26మందిలో అధిక సంఖ్య లో పర్యాటకులే ఉన్నారు. మంజునాథరావు మృతదేహాన్ని ఆయన స్వస్థలం శివమొగ్గకు తీసుకువెళ్లగా, భరత్‌భూషణ్ మృతదేహాన్ని ఆయన బెంగళూరులోని నివాసానికి తీసుకువచ్చారు.'ప్రభుత్వం సమక్షంలో 7కోట్లమంది కన్నడిగులు భరత్‌భూషణ్‌కు నివాళులు అర్పిస్తున్నారు. 'ఆయన తక్కువ వయస్సు(41)లోనే బిఇ, ఎంబిఏ గ్రాడ్యుయేట్‌గా ఉన్నారు. జరగకూడని సంఘటన జరిగింది. అది అమానవీయ చర్య. దీనిని నేను తీవ్రంగా ఖండిస్తున్నాను' అని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య చెప్పారు. భరత్‌భూషణ్‌కు నివాళులు అర్పించిన తర్వాత సిఎం సిద్ధరామయ్య విలేకరులతో మాట్లాడుతూ 'ఉగ్రవాదులను తుదముట్టించే బాధ్యత ప్రభుత్వానిదే అన్నారు. ఈ దేశంలో ఉగ్రవాదం, ఉగ్రవాద చర్యలకు స్థానం ఉండకుండాచేయాలన్నారు. ఈ ఘటన పట్ల కేంద్ర ప్రభుత్వం ఉపేక్షించాల్సిన అవసరం లేదని, మేమందరం కేంద్రం పక్షాన ఉం టామని, ఉగ్రవాదులను ఏరిపారేయాలని నేను కేంద్ర ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తున్నానని, అందుకోసం కేంద్రానికి పూర్తి మద్దతు తప్పక ఉంటుంది. టూరిస్టులుగా కశ్మీర్‌కు వెళ్లినఅ మాయకులైన పర్యాటకులను ఉగ్రవాదులు వారి భా ర్యా పిల్లల ముందే అత్యంత దారుణంగా కాల్చి చంపడం ఇంతకంటే కిరాతక, అమానవీయ చర్య ఇంకేదైనా ఉంటుందా' అని ప్రశ్నించారు. పహల్గామ్ ఉగ్రదాడి ఇంటెలిజెన్స్ వైఫల్యం వల్లే జరిగిందని తాను భావిస్తున్నానని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య చెప్పారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## రాష్ట్రంలో పెరుగుతున్న ఉష్ణోగ్రతల తీవ్రత

**హైదరాబాద్ :** తెలంగాణలో భానుడు నిప్పుల వర్షం కురిపిస్తున్నాడు. మొన్నటి వరకు వర్షాలతో కాస్త తెరిపినిచ్చినా, ఉదయం నుంచి సూర్యుడు తన ప్రతాపం చూపిస్తున్నాడు. గరిష్ఠ ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. తెలంగాణలో రానున్న రెండు రోజుల్లో ఎండల తీవ్రత మరింత అధికంగా ఉండే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 3 డిగ్రీలు ఎక్కువగా ఉండే వీలుందని వెల్లడించింది. గురు, శుక్రవారాల్లో ఉత్తర తెలంగాణలోని కొన్ని జిల్లాల్లో అక్కడక్కడా వడగాల్పులు వీచే అవకాశం ఉందని వెల్లడించింది. చాలా జిల్లాల్లో రాత్రి పూట వేడి వాతావరణం మరింత అధికంగా ఉండనుందని తెలిపింది. ఉత్తర, దక్షిణ ఉపరితల ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. శుక్ర, శనివారాల్లో కొన్ని జిల్లాల్లో మెరుపులు, ఉరుములు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు అక్కడక్కడ కురిసే వీలుందని పేర్కొంది. గంటకు 30 నుంచి 40 కి.మీ వేగంతో గాలులు వీచే అవ కాశముందని వాతావరణ కేంద్రం వెల్లడించింది. నిర్మల్ జిల్లాలో వడ దెబ్బతో యువకుడు మృతి చెందారు.

## కర్నూల్ నుంచి సికింద్రాబాద్ వరకు విండో తనిఖీ



ద.మ.రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కర్నూల్ రైల్వే స్టేషన్ నుంచి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ వరకు దక్షణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ గురువారం 'విండో' తనిఖీ నిర్వహించారు. ఆయన వెంట ఈ తనిఖీలో వంపులు, వాలుతలం, వంతెనలు, రైల్వే సిగ్నల్స్, ట్రాక్‌ల నిర్వహణ మొదలైన అనేక భద్రతా అంశాలను అధికారులతో సమీక్షించారు. ఈ తనిఖీ అరుణ్‌కుమార్ జైన్‌తో పాటు హైదరాబాద్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ లోకేష్ విష్ణోయ్, ఇతర సీనియర్ అధికారులు ఉన్నారు. జోగుళాంబ హాల్ట్ స్టేషన్ నుండి ప్రారంభించిన తనిఖీల సందర్భంగా అరుణ్‌కమార్ జైన్ ప్రయాణీకుల సౌకర్యాలు, స్టేషన్ ఆస్తులు, స్టేషన్ పరిసర ప్రాంగణాన్ని పరిశీలించారు. అమృత్ భారత్ స్టేషన్ పథకం (ఏ.బి.ఎస్.ఎస్.)లో భాగంగా రూ.6.07 కోట్ల వ్యయంతో స్టేషన్లో జరుగుతున్న పునరాభివృద్ధి పనుల పురోగతిని కూడా ఆయన సమీక్షించారు. నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నపుడు పాటిస్తున్న భద్రతా విధానాలు, మార్గదర్శకాలను ఆయన పరిశీలించారు. అలాగే, నిర్దేశించిన సమయంలోగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.కర్నూలు ఎంపి నాగరాజు బస్తీపతి జనరల్ మేనేజరును కలిసి తన అధికార పరిధికి సంబంధించిన రైలు అభివృద్ధి ప్రణాళికలపై చర్చించారు.

## బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ అరెస్ట్.. బెయిల్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** పంజాగుట్ట కేసులో బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ అరెస్ట్ అయ్యారు. షకీల్‌ను అరెస్టు చేసిన అనంతరం కోర్టులో హాజరు పరచగా అనారోగ్య కారణాలు చూపెట్టడంతో కోర్ట్ ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. 2023 డిసెంబర్‌లో ప్రజా భవన్ ముందు షకీల్ కుమారుడు రాహిల్ తప్పతాగి కారు నడుపుతూ బ్యారికేడ్‌ను ఢీకొట్టాడు. పోలీసులు అదుపులోకి తీసుకోగా పోలీస్ కస్టడీ నుండి పారిపోవడంతో పాటు రాహిల్‌కు బదులు వేరే వ్యక్తిని పోలీసులు ముందు లొంగిపోయేలా షకీల్ చేశాడు. ఈ విషయం తెలుసుకున్న అప్పటి కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి సీరియస్ అయి పోలీస్ స్టేషన్‌లో సిఐతో సహా హోమ్‌గార్డ్ వరకు అందరిని బదిలీ చేశారు. అనంతరం సాక్ష్యాలు తారుమారు చేసే ప్రయత్నం చేసిన షకీల్‌పై కూడా కేసు నమోదైంది. క్రితం దుబాయ్ నుండి ఇండియాకు వచ్చిన షకీల్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచగా అన్ని సెక్షన్స్ ఏడు సంవత్సరాల లోపు ఉండటంతో నాంపల్లి కోర్టు బెయిల్ మంజూరు చేసింది.

## మెట్రోలో బెట్టింగ్ యాప్‌ల ప్రచారంపై హైకోర్టులో పిల్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మెట్రో రైల్వేలో బెట్టింగ్‌లకు సంబంధించిన ప్రకటనలు ఇవ్వడాన్ని సవాలు చేస్తూ హైకోర్టులో పిల్‌ను గురువారం హైకోర్టు విచారణ చేపట్టింది. బెట్టింగ్ యాప్‌లతో హైదరాబాద్ మెట్రో రైల్వే డిపార్ట్‌మెంట్ కుదుర్చుకున్న ఒప్పందాలపై దర్యాప్తు చేయించాలని కోరుతూ న్యాయవాది ఎన్.నాగూర్‌బాబు హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. మెట్రో రైలులో, ఫ్లాట్‌ఫారాలు, స్టేషన్, హోర్డింగ్‌లు తదితర ప్రాంతాల్లో బెట్టింగ్ యాప్‌లపై ప్రకటనలను తక్షణం నిలిపివేసేలా ఆదేశించాలని కోరారు. మెట్రో రైల్వేకు బెట్టింగ్ యాప్ సంస్థలకు మధ్య కుదిరిన లావాదేవీలపై దర్యాప్తు చేపట్టేలా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌కు ఆదేశాలు జారీ చేయాలన్నారు. బెట్టింగ్ యాప్‌లపై ఈడీ ఇప్పటికే కేసు నమోదు చేసి రూ.399 కోట్లు జప్తు చేసిన నేపథ్యంలో ఈ ఒప్పందాలపై విచారణ జరపాలన్నారు. ప్రకటనల విధానంపై హైకోర్టు మాజీ న్యాయమూర్తితో ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలన్నారు. అక్రమ కార్యకలపాలకు సంబంధించి ప్రకటనలను నిషేధిస్తూ తీసుకువచ్చిన ఐటీ, డిజిటల్ మీడియా మార్గదర్శకాలను అమలు చేసేలా కేంద్ర ఐటీ శాఖను ఆదేశించాలని కోరారు. మెట్రో రైల్వే, డీజీపీతో సమన్వయం చేసుకుని నిషేధిత ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లపై చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. చట్టవిరుద్ధమైన ప్రకటనలు జారీ చేయడానికి బాధ్యులైన ఉన్నతాధికారుల నుంచి భారీ ఎత్తున పరిహారం రాబట్టి ప్రజాసంక్షేమ నిధికి చెల్లించేలా ఆదేశించాలన్నారు. ఇందులో ప్రతివాదులుగా మెట్రోతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, డీజీపీ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి,. జీహెచ్‌ఎంసీ కమిషనర్‌లతోపాటు వారిని వ్యక్తిగత హోదాలోను చేర్చారు. ఈ పిటిషన్ నెంబరు కేటాయింపు నిమిత్తం రిజిస్ట్రీ పరిశీలనలో ఉంది.

## 28 వరకు పాడి కౌశిక్‌రెడ్డిని అరెస్ట్ చేయొద్దు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హనుమకొండ జిల్లా సుబేదారి పోలీసులు నమోదు చేసిన కేసులో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని ఈనెల 28వరకు అరెస్ట్ చేయరాదంటూ గురువారం హైకోర్టు పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది. అయితే దర్యాప్తు కొనాసగించవచ్చని, దీనికి సహకరించాలని పాడి కౌశిక్‌రెడ్డికి ఆదేశించింది. రూ.50 లక్షలు డిమాండ్ చేశారంటూ తన భర్తను బెదిరించారంటూ క్వారీ యజమాని మనోజ్ భార్య ఉమాదేవి ఫిర్యాదు చేయడంతో హనుమకొండ పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కోరుతూ కౌశిక్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ కె.లక్ష్మణ్ గురువారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ రాజకీయ కక్షతో కేసు నమోదు చేశారని, 27న జరగనున్న బీఆర్‌ఎస్ రజతోత్సవ వేడుకల్లో పాల్గొనకుండా అరెస్ట్ చేసే అవకాశాలున్నాయన్నారు.

## నల్ల బ్యాడ్జీలతో నిరసనకు బార్ కౌన్సిల్ పిలుపు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడికి నిరసనగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని బార్ అసోసియేషన్‌లు శుక్రవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేయాలని రాష్ట్ర బార్ కౌన్సిల్ ఛైర్మన్ ఎ.నరసింహారెడ్డి గురువారం పిలుపునిచ్చారు.

# భూ(దాన్)దందాలో ఐఏఎస్, ఐపిఎస్‌లకు నోటీసులు

కేంద్ర, రాష్ట్రాలతోపాటు సిబిఐ, ఇడిలకు కూడా జారీ

నిషేధిత జాబితాలో చేర్చాలని మధ్యంతర ఉత్తర్వులు

పిటిషన్‌లోని అభియోగాలపై హైకోర్టు ఆశ్చర్యం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** భూదాన్ భూమికి చెందిన సర్వే నెంబర్లు మార్పు చేసి అక్రమ లావాదేవీలకు తెర తీశారంటూ దాఖలైన కేసులో 26 మంది ఐఏఎస్/ఐపీఎస్ అధికారులకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ వ్యవహారంపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలంటూ బిర్లా మహేష్ దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి గురువారం విచారించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు ఐఏఎస్, ఐపిఎస్, వాళ్ల కుటుంబసభ్యులు, పలువురు అధికారుల, ప్రైవేట్ వ్యక్తులతోపాటు సిబిఐ, ఈడీలకు కూడా నోటీసులు జారీ చేశారు. మహేశ్వరం మండలం, నాగారం గ్రామంలోని సర్వే నంబర్లు 180,182ల్లోని 26 ఎకరాల ప్రభుత్వ, భూదాన్‌కు చెందిన భూమి లావాదేవీలు చేపట్టరాదని మధ్యంతర ఉత్తర్వులను జారీ చేశారు. ఆ భూములను నిషేధిత జాబితాలో చేర్చాలని జిల్లా కలెక్టర్, మహేశ్వరం, ఏల్బీనగర్ సబ్ రిజిస్ట్రార్లలకు ఆదేశించారు. ఈ భూములు అన్యాక్రాంతం కాకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఉన్నతాధికారులపై తీవ్ర అభియోగాలు ఉన్నందున ఈ పిటిషన్‌ను ఉపసంహరించుకునేందుకు అనుమతించరాదని హైకోర్టు రిజీస్ట్రీని ఆదేశించారు. ఉన్నతాధికారులు భూ దుర్వినియోగానికి పాల్పడకుం డా మధ్యంతర ఉత్తర్వులను జారీ చేస్తున్నట్లు చెప్పారు. భూదాన, గ్రామదాన చట్టం ప్రకారం దాతలు ఇచ్చిన భూదాన భూములను పేదలకు వ్యవసాయం, ఇళ్ల నిర్మాణాలకు కేటాయించాల్సి ఉందని, ఇవి అన్యాక్రాంతం చేయడానికి వీల్లేదని తేల్చి చెప్పారు,

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు రెవెన్యూ అధికారుల ద్వారా రికార్డులను తారుమారు చేశారని, రిజిస్ట్రేషన్ అధికారులతో అక్రమంగా భూబదిలీ వంటి జరగకుండా చర్యలు తీసుకోవాలని పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది రవిచందర్ వాదించారు. గత ఏడాది నవంబర్ నుంచి ఫిర్యాదులు చేస్తున్నప్పటికీ అధికారులు స్పందించలేదన్నారు. సర్వే నెం 180ని 194గా మార్చి అక్రమాలకు తెర తీశారన్నారు. ధరణి డిజిటల్ పోర్టల్ దుర్వినియోగం చేయడమే కాకుండా 'సాదా బైనామా' అని పిలిచే నమోదు చేయని సేల్ డీడ్‌లను క్రమబద్ధీకరణకు నిర్దేశించిన 13—బి సర్టిఫికెట్ల సరికాదన్నారు. మోసపూరిత పాస్‌బుక్‌లను రద్దు చేయాలన్నారు. భూమిని ప్రభుత్వ నియంత్రణలోకి తీసుకురావాలన్నారు. పేదల కోసం దానంగా ఇచ్చిన భూముల వ్యవహారంలో ఉన్నత స్థాయిలో వారిపై ఇలాంటి అభియోగాలు రావడంపై న్యాయమూర్తి విస్మయాన్ని వ్యక్తం చేశారు.

ఇందులో ప్రతివాదులైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు, రంగారెడ్డి జిల్లా కలెక్టర్, భూదాన్ యజ్ఞ బోర్డు, సీసీఎల్ఏలతోపాటు సీబీఐ, ఈడీలకు నోటీసులు జారీ చేస్తూ కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించారు. వ్యక్తిగత హోదాలో ప్రతివాదులైన ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు, వారి కుటుంబ సభ్యులకు నోటీసులు అందజేయాలని పిటిషనర్‌ను ఆదేశించారు. నోటీసులు జారీ చేసినవారిలో ఐఏఎస్ నవీన్‌మిట్టల్, ఐఏఎస్‌లు అమోయ్‌కుమార్, రాజశ్రీ హర్ష, అజయ్‌జైన్, ఐపీఎస్‌లు మహేశ్ భగవత్, సౌమ్యా మిశ్రా, స్వాతి లక్రా, రవి గుప్త, తరుణ్ జోషి, తోట శ్రీనివాసరావు, సుబ్బారాయుడు, రాహుల్ హెగ్డే, కుటుంబ సభ్యులు జ్ఞానముద్ర (సోమేశ్‌కుమార్ భార్య), ఐశ్వర్య రాజు (ఐఏఎస్ వికాస్ రాజు భార్య), వసుంధర సిన్హా, ఎకె మొహంతి, ఓం.అనిరుధ్ (రాచకొండ కమిషనర్ కుమారుడు), నందిన్ మాన్ (ఐపీఎస్ విక్రమ్‌సింగ్‌మాన్ భార్య), రీటా సుల్తానియా (ఐఏఎస్ సందీప్ సుల్తానియా భార్య), రాధిక (ఐపీఎస్ కమలాసన్‌రెడ్డి భార్య), నితేష్ రెడ్డి (మాజీ డీజీపీ మహేందర్‌రెడ్డి కుమారుడు), రేఖా షరాఫ్ (ఐపీఎస్ ఉమేష్‌షరాఫ్ భార్య), రేణుగోయల్ (డీజీపీ జితేందర్ భార్య), దివ్యశ్రీ (ఐఏఎస్ ఆంజనేయులు భార్య), హేమలత (ఇంటిలిజెన్స్ డీజీ శివధర్‌రెడ్డి భార్య), ఇందూ రావు కావేటి (ఐపీఎస్ లక్ష్మీనారాయణ భార్య), సవ్యసాచి ప్రతాప్‌సింగ్ (ఐపీఎస్ గోవింద్‌సింగ్ కుమారుడు), రాహుల్ (విశ్రాంత ఐఏఎస్ జనార్దన్‌రెడ్డి కుమారుడు), రుణ్ (ఐపీఎస్ విశ్వప్రసాద్ కుమారుడు), విశ్రాంత డీజీపీ అనురాగ్ శర్మ, వీరితోపాటు పలువురు అధికారులు, ప్రైవేటు వ్యక్తులున్నారు. ఈ పిటిషన్‌పై తదుపరి విచారణను జూన్ 12కు వాయిదా వేశారు.



కేరళలోని తిరువనంతపురంలో రెండు రోజుల పాటు జరుగుతున్న సిపిఐ జాతీయ కౌన్సిల్ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన బహిరంగ సభలో ప్రసంగించిన పార్టీ ప్రధాన కార్యదర్శి డి.రాజా.

### బిసి రిజర్వేషన్ బిల్లు ఆమోదానికి
# మరో మండల్ ఉద్యమం

మే తొలివారం నుంచి రాష్ట్రాల పర్యటన : బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల

ప్రధానిపై సిఎం రేవంత్‌రెడ్డి ఒత్తిడి పెంచాలి : బిసి ఇంటలెక్చువల్ ఫోరం చైర్మన్ చిరంజీవులు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిసి రిజర్వేషన్ బిల్లును కేంద్ర ప్రభుత్వం ఆమోదించకపోతే మరో మండల్ ఉద్యమాన్ని చేపడతామని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. హైదరాబాద్‌లో గురువారం బిసి కుల సంఘాల జెఎసి చైర్మన్ కుందారపు గణేశాచారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిసి ఉద్యమాన్ని జాతీయస్థాయిలో మరింత ఉధృతం చేస్తామని, అందులో భాగంగా అన్ని రాష్ట్రాల్లో పర్యటిస్తామని తెలిపారు. మే నెల మొదటి వారంలో తమిళనాడులో పర్యటించి అక్కడి అఖిలపక్ష పార్టీల మద్దతు తీసుకుంటామన్నారు. ఆ తర్వాత బిహార్‌కు వెళ్లి అక్కడ జరిగిన కులగణనపై ప్రజల నుంచి వివరాలను, వారి సహకారాన్ని తీసుకుంటామన్నారు. మే రెండోవారంలో రాష్ట్రంలోని 33 జిల్లాల్లో బస్సు యాత్ర నిర్వహిస్తామని తెలిపారు. బిసి బిల్లును అడ్డుకొనేదెవరో, బిసి ద్రోహులు ఎవరనే విషయంపై తమ పర్యటనలో ప్రజలకు తెలియజేస్తామన్నారు. బిసి ఇంటలెక్చువల్ ఫోరం చైర్మన్ చిరంజీవులు మాట్లాడుతూ బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లు ఆమోదానికి సిఎం రేవంత్‌రెడ్డి ప్రధాని మోదీపై ఒత్తిడి పెంచాలన్నారు. ముందుగా అఖిలపక్ష పార్టీల నేతలను ఢిల్లీకి తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు. తమిళనాడు తరహాలో బిసి బిల్లును కేంద్రం ఆమోదించి రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బిసి కుల సంఘాల జెఎసి కన్వీనర్ బాలగోని బాలరాజ్‌గౌడ్, బిసి సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కుల్కచర్ల శ్రీనివాస్, బిసి నేతలు కనకాల శ్యామ్, చామకూర రాజు, కె.వి.గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## భూ సమస్యల పరిష్కారానికే...
మంత్రి పొన్నం ప్రభాకర్

**ప్రజాపక్షం/హుస్నాబాద్:** తెలంగాణలో నూత న భూ భారతి చట్టంతో భూ సమస్యల పరిష్కార మవుతుందని ఇక నుండి ఏ రైతు కోర్టుల చుట్టు తిరగనవసరం లేదని తెలంగాణ బిసి, రవాణశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు. గురువారం పొతారం ఎస్ గ్రామంలో శుభం గార్డెన్‌లో నూతన భూ భారతిచట్టంపై అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ మనుచౌదరి, అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్‌లు భూభారతి చట్టంపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం భూ సమస్యల పరిష్కారానికి రైతుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ రాష్టంలో తీసుకువచ్చిన నూతన భూభారతి చట్టంపై ప్రతి మండలంలో అవగాహన సదస్సు కార్యక్రమాలను నిర్వహించి వారి సమస్యలకు సరైన సమాధానాలను ఇస్తున్నట్లు అయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి, మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతిరెడ్డి, కొహెడ మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ చందు. సహకార సంఘం చైర్మన్ బొల్లి శెట్టి శివయ్య, అర్‌డిఒ రామూర్తి, తహసీల్దార్ గుజ్జుల రవిందర్‌రెడి, అర్‌టిఎ మెంబర్ సూర్యవర్మ, అధికారుల స్థానిక ప్రజా ప్రతినిధుల రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# ఉత్కంఠ పోరులో బెంగళూరు విజయం

ఐపిఎల్ 18లో సొంతమైదానంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఎట్టకేలకు విజయం సాధించింది. రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన ఉత్కంఠ పోరులో బెంగళూరు 11 పరుగుల తేడాతో గెలుపొందింది. తొలుత ఆర్సీబీ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 205 పరుగులు చేసింది. విరాట్ కోహ్లీ (70), పడిక్కల్ (50) అర్ధశతకాలతో చెలరేగారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రాజస్థాన్ 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 194 పరుగులు చేసింది. యశస్వీ జైస్వాల్ (49), ధ్రువ్ జురెల్ (47) పోరాడినప్పటికీ.. చివర్లో ఆ జట్టు బోల్తాపడింది. చివరి రెండు ఓవర్లలో రాజస్థాన్ లక్ష్యం 18 పరుగులు కాగా, హేజిల్‌వుడ్ అద్భుతంగా బౌలింగ్ చేశాడు. కేవలం ఒక పరుగే ఇచ్చి రెండు వికెట్లు తీశాడు. బెంగళూరు బౌలర్లలో హేజిల్ వుడ్ 4, కృనాల్ పాండ్య 2, భువనేశ్వర్ కుమార్, యశ్ దయాల్ ఒక్కో వికెట్ తీశారు.

తొలుత కోహ్లీ (70; 42 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్స్‌లు), దేవ్‌దత్ పడిక్కల్ (50; 27 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) చెలరేగడంతో బెంగళూరు 205/5 పరుగుల భారీ స్కోర్ చేసింది. ఐపీఎల్‌లో రాజస్థాన్‌పై ఆర్సీబీకిదే అత్యధిక స్కోరు. ఓపెనర్ ఫిల్ సాల్ట్ (26; 23 బంతుల్లో 4 ఫోర్లు) ఫర్వాలేదనిపించాడు. చివర్లో జితేశ్ శర్మ (20;10 బంతుల్లో 4 ఫోర్లు), టిమ్ డేవిడ్ (23; 15 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) మెరుపులు మెరిపించారు. రాజస్థాన్ బౌలర్లలో సందీప్ శర్మ 2, జోఫ్రా ఆర్చర్, హసరంగ చెరో వికెట్ పడగొట్టారు.

తొలుత సాల్ట్, కోహ్లీ శుభారంభం అందించారు. ఈ జోడీ తొలి వికెట్‌కు 40 బంతుల్లో 61 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పింది. మొదటి రెండు ఓవర్లలో చెరో ఫోర్ బాదగా.. ఆర్చర్ వేసిన మూడో ఓవర్‌లో కోహ్లీ వరుసగా రెండు బౌండరీలు రాబట్టాడు. ఫిల్ సాల్ట్ తుషార్ దేశ్‌పాండేకు వరుసగా



రెండు బౌండరీలతో స్వాగతం పలికాడు. ఈ క్రమంలో పవర్ ప్లే ముగిసేసరికి ఆర్సీబీ 59/0తో మెరుగైన స్థితిలో నిలిచింది. తర్వాత బంతి అందుకున్న హసరంగ తన తొలి ఓవర్‌లో ఫిల్ సాల్ట్‌ను వెనక్కి పంపి మూడే పరుగులు ఇచ్చాడు.

అనంతరం పడిక్కల్‌తో కలిసి కోహ్లీ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. సందీప్ బౌలింగ్‌లో విరాట్ వరుసగా రెండు ఫోర్లు కొట్టి హాఫ్ సెంచరీ (32 బంతుల్లో) అందుకున్నాడు. ఈ సీజన్‌లో కోహ్లీకిది ఐదో అర్ధ శతకం. ఆ తర్వాత విరాట్, పడిక్కల్ జోరు పెంచారు. పరాగ్ బౌలింగ్ చెరో సిక్స్ రాబట్టారు. తుషార్ దేశ్‌పాండే వేసిన 15 ఓవర్‌లో పడిక్కల్ రెండు సిక్స్‌లు కొట్టి 26 బంతుల్లోనే అర్ధ శతకం అందుకున్నాడు. ఇదే ఓవర్‌లో కోహ్లీ ఒక సిక్స్ బాదాడు. దీంతో 15 ఓవర్లకు ఆర్సీబీ 156/1తో పటిష్ట స్థితిలో నిలిచింది.

## ఉగ్రదాడికి సిపిఐ నిరసన



ఉగ్రవాద దిష్టిబొమ్మ దహనం : సిపిఐ

**ప్రజాపక్షం/వనపర్తి :** దేశంలో ఉగ్రవాదంపై ఉక్కు పాదం మోపాలని సిపిఐ పట్టణ కార్యదర్శి రమేష్, ఏఐటియూసి జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి, సిపిఐ నేత గోపాలకృష్ణ పిలుపునిచ్చారు. కాశ్మీర్ పహల్గామ్ వద్ద భారతీయులు పర్యాటకులు 27 మందిని ఉగ్రవాదులు కాల్చి చంపడంపై సిపిఐ ఆధ్వర్యంలో వనపర్తి పట్టణ అంబేద్కర్ చౌక్‌లో ఉగ్రవాదం దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. ఉగ్రవాదం నశించాలని, మత సామరస్యం విలసిల్లాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పర్యాటకులపై ఉగ్రదాడి పిరికిపంద చర్య అన్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా దేశంలో నక్సలైట్లను చంపించే పనిపై ఉన్న దృష్టి ఉగ్రవాదులను మట్టు పెట్టడంలో లేదన్నారు. మా దేహం ముక్కలైన దేశాన్ని ముక్కలు కానీయబోమశన్నారు. పార్టీలు ఎన్ని ఉన్నా దేశం శాంతి సామరస్యం కాపాడటంలో ఏకమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ, ఎన్‌ఎఫ్ఐడబ్ల్యూ, ఏఐఎస్ఎఫ్, ఏఐటియూసి నేతలు కళావతమ్మ, గోపాలకృష్ణ, ఎర్ర కుర్మయ్య, శిరీష, వెంకటమ్మ, జ్యోతి, చిన్న కుర్మయ్య, బాలరాజు, రాముడు, నరేష్ , వంశి, విజయ్, ప్రకాశ్ , రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## మొక్కజొన్నకు నిప్పు అంటించబోయి ప్రమాదవశాత్తు రైతు మృతి

**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం:** వేసవిలో మళ్ళీ వ్యవసాయ భూముల ను సిద్ధం చేసే సమయంలో ఓ రైతు ప్రతి కొట్టేకు నిప్పు అంటించబోయి ప క్కనే ఉన్న అన్నచేనులో ఉన్న మొక్కజొన్నకు నిప్పు అంటుకోగా మంటను ఆర్పే సమయంలో ప్రమాదవశాత్తు రైతు కట్టుకున్న పంచకు అంటుకొని రై తు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని పిండిప్రోలు గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పిండిప్రోలు గ్రామానికి చెందిన కిలారు వెంకయ్య 60 తనకున్న వ్యవసాయ భూ మిలో ప్రతి పంటను సాగు చేయగా ప్రతి కట్టెకు నిప్పుంటించే క్రమంలో ప క్కనే ఉన్న తన అన్న భూమిలో ఉన్న మొక్కజొన్న పంటను సాగు చేయగా మొక్కజొన్నకు నిప్పు అంటుకోగా నిప్పు ఆర్పబోయి కిలారు వెంకయ్య క ట్టుకున్న పంచకు నిప్పు అంటుకొని రైతు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య సులోచన మూడు సంవత్సరాల క్రితం అనారోగ్యంతో మృ తి చెందింది. వీరికి ముగ్గురు ఆడ సంతానం కాగా అందరికీ వివాహం జ రిపించారు. గ్రామంలో ప్రతి ఒక్కరితో స్నేహభావంతో కలివిడిగా నడుచుకునే కిలారి వెంకయ్య చనిపోవడం గ్రామస్తుల్ని కంటతడి పెట్టించిది. గ్రా మస్తుల సమాచారం మేరకు స్థానిక ఎస్ఐ కూచిపూడి జగదీష్ సిబ్బందితో కలిసి వెళ్లి జరిగిన సంఘటనను పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం ని మిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## పాడి రైతుల అభివృద్ధికి ప్రభుత్వ తోడ్పాటు
విజయ డెయిరీ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** పాడి రైతుల అభివృద్ధికి ప్రభు త్వం తోడ్పాటు నందిస్తుందని విజయ డెయిరీ ఛైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి తెలిపారు. గురువారం ఛైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి మ్మంలోని విజయ డెయిరీని సందర్శించారు. తొలుత ఖమ్మం రూరల్ మండలం పొన్నెకల్ గ్రామంలో పాల సేకరణ కేంద్రం వద్ద రైతులతో ఛైర్మన్ అమిత్‌రెడ్డి ముచ్చటించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఖమ్మం నగరంలోని వీడియోస్ కాలనీలో సమీకృత వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన విజయ డెయిరీ పార్లర్‌ను ఛైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి, మంత్రి తుమ్మల తనయుడు తుమ్మల యుగంధర్, డిసిసి ప్రెసిడెంట్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, కార్పొరేటర్ మిక్కిలినేని మంజుల నరేందర్ చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం విజయ డెయిరీ ప్లాంట్‌ను ఛైర్మన్ సందర్శించి కంప్రెసర్, ప్యాకేజింగ్, కోల్డ్ రూమ్స్, బాయిలర్ తదితర వాటిని పరిశీలించి ఉద్యోగులతో ప్లాంట్ గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం డెయిరీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఛైర్మన్ అమిత్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. పాల ఉత్పత్తిదారులు, పాడి రైతుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ సహకారంతో డెయిరీ కృషి చేస్తుందని ఆయన తెలిపారు. పాడి రైతులను ప్రోత్సహించేందుకు లీటరుకు ఐదు రూపాయలు ధర పెంచినట్లు ఆయన తెలిపారు. సొసైటీ రిజిస్ట్రేషన్‌కు పాడి రైతులు తీర్మానించగా ఛైర్మన్ అభినందించారు. ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్ సిఅండ్ ఐ హైదరాబాద్ మధుసూదన్‌రావు, అడిషనల్ డిఆర్‌డివో నూరుద్దీన్, పాడి గణాభివృద్ధి సంస్థ ఛైర్మన్, ఖమ్మం డిడి మోహన్‌మురళి, డెయిరీ మే నేజర్ మురళి కృష్ణ, డెయిరీ ఇంజనీర్ నాగమణి, హన్మంతు, సేల్స్ ఇంచార్జ్ , పాడి రైతులు పాల్గొన్నారు.

## జిల్లా అదనపు కలెక్టర్‌గా నారాయణ్‌అమిత్

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** నల్లగొండ జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ)గా మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్ గురువారం నల్లగొండ కలెక్టరేట్‌లో బాధ్యతలు స్వీకరించారు. సెప్టెంబర్ 5, 2024న మిర్యాలగూడ సబ్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన నారాయణ్‌అమిత్ ఏడున్నర నెలలు పనిచేశారు. గతంలో వికారాబాద్‌లో అడిషనల్ కలెక్టర్‌గా పనిచేసిన నారాయణ్‌అమిత్ బదిలీపై మిర్యాలగూడకు వచ్చారు. ఇప్పుడు నల్లగొండ జిల్లా అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు.



## జోగులాంబ ఆలయ ఉప ప్రధాన అర్చకుడు ఆనంద్‌శర్మ సస్పెన్షన్

**ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల ప్రతినిధి:** జోగులాంబ ఆలయ ఉప ప్రధాన అర్చకుడుగా విధులు నిర్వహిస్తున్న ఆనందశర్మపై పలు అవినీతి ఆరోపణలు రావడంతో విచారణ జరిపిన అనంతరం దేవదాయ శాఖ సస్పెన్షన్ వేటు వేసింది. ఆలయ కార్యకలాపాల్లో ఆనంద శర్మ మాటే వేదంగా వ్యవహరిస్తూ అక్రమాలకు పాల్పడుతూ ఆలయ ప్రతిష్ట దెబ్బతీస్తున్నారని ధార్మిక సంస్థలు, భక్తులు దేవాదాయ కమిషనరేట్ లో , మంత్రికి ఫిర్యాదు చేశారు. పలు దఫాలుగా ఆలయంలో విచారణ జరిపిన అనంతరం ఆరోపణలు నిజం కావడంతో ఆ నివేదిక ఆధారంగా దేవాదాయ శాఖ ఈ మేరకు ఆదేశాలు ఇచ్చింది. ఈ క్రమశిక్షణ చర్యలు తక్షణం అమల్లోకి రానున్నట్లు పేర్కొంది జిల్లాను వదిలి వెళ్ల కూడదని ఆంక్షలు విధించింది. ఆలయానికి సంబంధించిన ఆభరణాలు, వస్తువులు అప్పగించాలని ఆదేశించారు. ఆలయ ప్రతిష్టకు భంగం కలిగించేలా అక్రమాలకు ఆనంద్ శర్మ పాల్పడ్డారని ఆరోపణలు ఉన్నాయి.



## రైతులు నాణ్యమైన ధాన్యం తీసుకురావాలి

### జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబు

**ప్రజాపక్షం/అర్వపల్లి(నాగారం):** రైతులు నాణ్యమైన ధాన్యం తీసుకరావాలని, మిల్లర్లు ధాన్యంను వెంటనే దిగుమతి చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబు కోరారు. గురువారం జాజిరెడ్డిగూడెం మండలంలోని రామన్నగూడెంలోని పిఎసిఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే ధాన్యం కొనుగోలు కేంద్రాలను అకస్మికంగా పరిశీలించారు. ఇప్పటి వరకు ఈ సెంటర్ ద్వారా 1680 క్వింటాల ధాన్యం మిల్లులకి ఎగుమతి చేశామని పేర్కొన్నారు. భద్రయ్య అనే రైతుకు చెందిన ధాన్యం పరిశీలించి రైతులు తాలు లేకుండా తూర్పాల పోసి శుభ్రం చేసి తేమశాతం 17 ఉండేలా నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకరావాలని కోరారు. కొనుగోలు కేంద్రాలకి ముందుగా వచ్చిన ధాన్యం ప్రకారం సీరియల్ నెంబర్‌లు ఇవ్వాలని తేమ శాతం 17 రాగానే కాంటావేసి ధాన్యం మిల్లులకు తరలించాలని సూచించారు. ఈకార్యక్రమంలో తహసిల్దార్ భద్రయ్య, సెంటర్ ఇన్‌ఛార్జి శ్రీను, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## చెక్‌బౌన్స్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక లోక్ అదాలత్

**ప్రజాపక్షం/భువనగిరి :** తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ వారి ఆదేశాలు , జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ అధ్యక్షులు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.జయరాజు వారి సూచనల మేరకు జూన్ 9వ తేదీ నుండి 14వ తేదీ వరకు చెక్ బౌన్స్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించబడుతుందని, దీనికై జిల్లా వ్యాప్తంగా పెండింగులో ఉన్న 691 చెక్ బౌన్స్ కేసులను గుర్తించినట్లు, ఇట్టి కేసులలో నోటీసులు కూడా జారీ చేసే ప్రక్రియ ప్రారంభం అయ్యిందని, దీనికై బ్యాంకు అధికారులచే ప్రత్యేక సమావేశాలు నిర్వహించి కేసుల పరిష్కారానికి తీసుకొనే చర్యలకై సూచనలు చేయడమైనది తెలియచేసి, చెక్ బౌన్స్ కేసులలో ఇరు పక్షాలు ఈ ప్రత్యేక లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకొని తమ కేసులను పరిష్కరించుకోవాలని, ప్రత్యేక కౌన్సెలింగుకై తేదీ 5.5.2025 నుండి 19.05.2025 వరకు ప్రీ సిట్టింగులు నిర్వహించబడుతాయని, ఇట్టి ప్రీ సిట్టింగులలో లోక్ అదాలత్ సభ్యులను, మీడియేషన్ న్యాయవాదులు కౌన్సెలింగు నిర్వహించటానికి జిల్లాలోని భువనగిరి, రామన్నపేట, ఆలేరు, చౌటుప్పల్, యాదాద్రి కోర్టుల న్యాయమూర్తులకు తగిన సూచనలు తెలియచేయటమైనదని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ, యాదాద్రి భువనగిరి కార్యదర్శి వి.మాధవిలత పత్రిక ప్రకటన జారీ చేశారు.

## ఎఐవైఎఫ్ మహాసభ కరపత్రాల ఆవిష్కరణ



**ప్రజాపక్షం/మోటకొండూర్ :** మోటకొండూరు మండల కేంద్రంలో అఖిలభారత యువజన సమైక్య జిల్లా 2వ మహాసభ కరపత్రాలను సిపిఐ మండల కార్యదర్శి గాదగాని మాణిక్యం గురువారం విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ అఖిలభారత యువజన సమైక్య దేశవ్యాప్తంగా దేశ సమగ్ర సమైక్యతను పరిరక్షించడానికి సమరశీల ఉద్యమాలు నిర్వయిస్తున్న సంఘం అన్నారు. మన భారత దేశ భవిష్యత్తు అభివృద్ధిలో యువత పాత్ర చాలా ముఖ్యమైనదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి బాలరాజ్, ఏఐవైఎఫ్ మండల అధ్యక్షులు కార్యదర్శులు బోలగాని అశోక్, గొట్టిపాముల సునీల్ కుమార్, జీవికలపల్లి పాండు, ఎండి గుంశి, జీవికలపల్లి గణేష్, ఎంపాల నర్సిరెడ్డి, జీవికలపెల్లి శేఖర్, గడ్డం శ్రీను, రాములు తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ కేసులు పరిష్కరించాలి

**ప్రజాపక్షం/ నల్లగొండ :** సాధ్యమైనంత త్వరగా పెండింగ్ కేసులు క్లియర్ చేయాలని జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ పోలీస్ అధికారులను ఆదేశించారు. గురువారం నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీసు అధికారులతో నిర్వహించిన నెలవారి నేర సమీక్షా సమావేశంలో జిల్లా ఎస్పీ పాల్గొని మాట్లాడుతూ పెండింగ్ కేసులు లేకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని, పెండింగ్ కేసులను త్వరితంగా పరిష్కరిస్తూ పెండింగ్ కేసుల సంఖ్య తగ్గించడానికి ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.పెండింగ్‌లో ఉన్న అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులలో గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల గురించి అడిగి, గ్రేవ్ నాన్ గ్రేవ్ కేసులలో ఇన్వెస్టిగేషన్ చేసేటప్పుడు ప్రతి కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ తో పూర్తి పారదర్శకంగా చేయాలి అన్నారు. కేసు నమోదు నుండి చార్జిషీట్ వరకు ప్రతి విషయాన్నికూలంకుషంగా పరిశోధన చేసి ఫైనల్ చేయాలి అన్నారు. ఫోక్సో, గ్రేవ్ కేసుల్లో త్వరితగతిన ఇన్వెస్టిగేషన్ పూర్తి చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాలన్నారు. ప్రతి అధికారికి సి.సి.టి.యన్.ఎస్‌పై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ సమావేశంలో ఏఎస్పి మౌనిక,అడిషనల్ ఎస్పి రమేష్, నల్లగొండ డిఎస్పి శివరాం రెడ్డి,మిర్యాలగూడ డిఎస్పి రాజశేఖర్ రాజు,సైబర్ క్రైమ్ డిఎస్పి లక్ష్మీ నారాయణ,సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

## అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు

**ప్రజాపక్షం/ నాంపల్లి:** తెలంగాణ ప్రభుత్వం అందించే ఇందిరమ్మ ఇండ్లను అర్హులైన పేదలకే ఇవ్వాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్ అంజచారి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మండల కౌన్సిల్ సమావేశం మండల సహాయ కార్యదర్శి ఊరుపాక వెంకటయ్య అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు ఇందిరమ్మ ఇండ్లను అర్హులైన నిరుపేదలకు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఘనంగా మేడే ఉత్సవాలను గ్రామ గ్రామాన జెండాలు ఎగురవేయాలని కార్మికులకు సూచించారు. సిపిఐ గ్రామ శాఖ సమావేశాలు జరపాలని, పార్టీ అభివృద్ధి కోసం ప్రతి కార్యకర్త పనిచేయాలని సూచించారు. రైతులు పండించిన వడ్లకు ఎలాంటి ఆంక్షలు విధించకుండా ప్రభుత్వం వడ్లు కొనుగోలు చేసి, సమయానికి రైతులకు బస్తాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి సుదనబోయిన రమేష్, సహాయ కార్యదర్శి నేతాళ్ల రాజు, మండల కార్యవర్గ సభ్యులు కోరే సత్తయ్య, దండిగా వెంకటయ్య, గిరి స్వామి, కానుగుల మహేష్, బుషిపాక యాదయ్య, దశరథ, బుషిపాక యాదయ్యా, అగ్గిరాజు పాల్గొన్నారు.




## సాదా బైనామా, భూ సమస్యలకు మోక్షం

# భూభారతి చట్టం

### భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి:** భూ కబ్జా మీద ఉండి సాదా బైనామా ఉన్న ప్రతి రైతు భూ సమస్యలకు మోక్షం భూభారతి చట్టమని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పునరుద్ఘాటించారు. తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి చట్టం అమలు రైతులకు విస్తృత అవగాహన సదస్సులో ఆయన పోచంపల్లి పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో భూభారతి అవగాహన సదస్సు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. చౌటుప్పల్ ఆర్డీవో శేఖర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయనతోపాటు భువనగిరి అదనపు కలెక్టర్ వీరారెడ్డి వివిధ పార్టీ ముఖ్య నాయకులు రైతులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో అధికారం ఒక్క దగ్గర కేంద్రీకృతం అయ్యిందని అస్తవ్యస్తమైన పాలనతో ధరణి పేరుతో రైతులనూ భూహక్కు కలిగిన యజమానులను అయోమయానికి గురిచేసి అధోగతి పాలు చేసిందని ఆయన ఘాటుగా విమర్శించారు. మే 1 నుండి ప్రతి గ్రామం వెళ్లి సమస్యలు తెలుసుకొని పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. భూభారతి రూపశిల్పి లాండ్ సునీల్ కృషిని కొనియాడారు. ఇంద్రియాల గ్రామంలో తెల్లరేషన్ కార్డు లబ్దిదారులు మొగిలిపాక పుష్ప కుమారుడు అనిల్ ఇంట్లో సన్న బియ్యం అన్నంతో పార్టీ ముఖ్య నాయకులతో కలిసి ఆయన భోజనం చేశారు. కార్యక్రమానికి ముందే డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా కలెక్టర్ వీరారెడ్డి ఇన్చార్జి తహసీల్దార్ నాగేశ్వరరావు, ఎండిఓ భాస్కర్, మార్కెట్ కమిటి చైర్మన్ జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు తడక వెంకటేశ్వర్లు, మండల అధ్యక్షుడు పాక మల్లేష్ యాదవ్, డిసిసి ఉపాధ్యక్షులు కళ్లెం రాఘవరెడ్డి, జిల్లా నాయకులు సామ మధుసూదన్ రెడ్డి, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు మర్రి నరసింహారెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు టౌన్ అధ్యక్షుడు భారత లవ కుమార్, ఉపాధ్యక్షుడు పకీరు నర్సిరెడ్డి పాల్గొన్నారు.



## భూ సమస్యల పరిష్కారానికి భూభారతి: కలెక్టర్ ఇలా త్రిపాఠి

**ప్రజాపక్షం/ నాంపల్లి:** భూ సమస్యలు పరిష్కరించేందుకే భూభారతి చట్టాన్ని తీసుకు వస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్ లో భూ భారతి చట్టం 2025 పై రైతులకు కల్పిస్తున్న అవగాహన సదస్సులలో భాగంగా ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ధరణిలో గుర్తించిన లోపాలన్నింటిని భూ భారతి ద్వారా సరిచేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. జూన్ 2 నుండి భూ భారతి చట్టం అందుబాటులోకి రానుందని, రైతులు వారి భూములకు సంబంధించిన సమస్యలను పరిష్కరించుకొనేందుకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ధరణి లో వీఆర్వో వ్యవస్థను తీసివెయడం జరిగిందని, దీనివల్ల ఇబ్బందులు ఏర్పడగా, తిరిగి రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రతి గ్రామానికి ఒక గ్రామ పాలన అధికారిని నియమించనున్నదని తెలిపారు. భూ భారతి చట్టాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నాంపల్లి మండలంలో ఆర్ఐ కొరతను దృష్టిలో ఉంచుకొని ఒక ఆర్ఐని నియమించడం జరిగిందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీదేవి, తహసిల్దార్ దేవసింగ్, మండల ప్రత్యేక అధికారి, సర్వే ల్యాండ్ రికార్డ్ ఏ డి శ్రీనివాస్, ఎంపీడీవో శర్మ, పిఎసిఎస్ చైర్మన్ గట్టుపల్లి నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ ఫలితాల్లో శ్రీ వశిష్ట విద్యార్థుల విజయకేతనం



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో హయత్ నగర్ శ్రీ వశిష్ట కాలేజ్ విద్యార్థులు స్టేట్ మొదటి, రెండవ ర్యాంకులు సాధించినట్లు కళాశాల సూర్యాపేట ఎగ్జిక్యూటివ్ పోలగాని జానకిరాములు, జోనల్ ఇన్‌చార్జీ కరణం అనూఫ్ చక్రవర్తిలు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సృజన కళాశాలలో ఇంటర్ ఎంపిసి విభాగంలో 468 మార్కులు సాధించిన గుగులోతు సాయిచరణ్, ద్వితీయ సంవత్సరంలో 994 మార్కులు సాధించిన మిర్యాల అక్షయ తారలను ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ కళాశాల చైర్మన్ లింగమనేని ప్రమీల రాణి, జిఎం వంశిచంద్ర, డిన్ రాచకొండ శ్రీనివాస్ పర్యవేక్షణలో ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధపెట్టి అత్యుత్తమ ఫలితాలు సాధించినట్లు తెలిపారు. సృజన పాఠశాల కరస్పాండెంట్ మిర్యాల రవికుమార్, ప్రిన్సిపల్ శ్రీనివాస్, విద్యార్థుల తల్లిదండ్రులు సైదులు, సంధ్య పాల్గొన్నారు.

# ఆధార్‌కార్డులున్న ప్రతి రైతుకూ ‘భూధార్’

### సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్



**ప్రజాపక్షం/తుంగతుర్తి:** గ్రామాల్లో ఉన్న భూ సమస్యల పరిష్కారానికి అందుబాటులో భూ భారతి నూతన ఆర్ఓఆర్ చట్టం 2025 అని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అన్నారు. గురువారం భూభారతి 2025పై తుంగతుర్తి పట్టణంలోని ధనలక్ష్మి ఫంక్షన్‌హాల్‌లో తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామ్యేలు, ఆర్డీవో వేణుమాధవరావు హాజరై తెలంగాణ గీతం అలపించి, పిపిటి చదివి వినిపించి రైతులకు భూ భారతి చట్టంపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సామ్యానులకు, ప్రజలకు అందుబాటులో భూభారతి నూతన ఆర్ఓఆర్ చట్టం 2025, భూ భారతిలో గ్రామాల్లో నెలకొన్న సమస్యలకు పరిష్కారం ఉందని, దీనిలో కొన్ని అధికారాలు తహసిల్దర్, ఆర్డీవో, అడిషనల్ కలెక్టర్, కలెక్టర్ స్థాయిలో వికేంద్రీకరణ చేశారని తెలిపారు. మండలాలలో త్వరలో భూ సమస్యల పరిష్కారానికి రెండు అంచెల అప్పిల్ వ్యవస్థ ఉందని, ఆధార్‌కార్డుల ప్రతి రైతుకు భూఆధార్ కార్డు జారీ చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. అనంతరం తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు మాట్లాడుతూ ధరణి వల్ల రైతులు అధికారులు చాల సమస్యలను ఎదుర్కొంటున్నారని, గత ప్రభుత్వం ధరణి వల్ల ఎలాంటి పరిష్కారాలు జరగలేదని అన్నదమ్ములు, అక్కచెల్లెలు భూ తగాదాలు బాగా జరిగేవని, దాని వల్లే గత ప్రభుత్వాన్ని వ్యతిరేకించారని అన్నా రు. ఉద్యోగ విరమణ పొందిన మేధావులు, రెవిన్యూ అధికారులతో 14నెలలు శ్రమించి భూ భారతి చట్టాన్ని రూపొందించారన్నారు. ఆర్డీవో వేణుమాదవరావు, తహసిల్దార్ దయానందం, తిరుమలగిరి తహసిల్దార్ హరిప్రసాద్, ఎంపీడీవో సురేష్ కుమార్, మార్కెట్ కమిటి చైర్మన్, గిరిధర్‌రెడ్డి, మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, పిఏసిఎస్ చైర్మన్ సైదులు పాల్గొన్నారు.

## అక్రమంగా డ్రగ్స్ విక్రయిస్తున్న ముఠా అరెస్ట్

### నల్లగొండ డిఎస్‌పి శివరాం రెడ్డి



**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్ :** మెడికల్ షాప్ నిర్వాహకులు డాక్టర్ ప్రిస్కిప్షన్ లేకుండా డ్రగ్స్ అమ్మినట్లయితే షాప్ లైసెన్స్ రద్దు చేయడంతో పాటు కఠిన చర్యలు తప్పవని నల్లగొండ డిఎస్‌పి శివరాం రెడ్డి హెచ్చరించారు. అక్రమంగా డ్రగ్స్ విక్రయిస్తున్న ముఠాను పోలీసులు అరెస్ట్ చేసి మీడియా ముందు ప్రవేశపెట్టారు ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ మునుగోడు రోడ్ లో నల్లగొండ వన్ టౌన్ సిఐ ఏమి రెడ్డి రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ సందీప్ రెడ్డి అతని సిబ్బంది మునుగోడు రోడ్డులో వాహన తనిఖీ నిర్వహిస్తుండగా, ఒక వ్యక్తి అనుమానాస్పదంగా బైక్ పై బ్యాగుతో ఉండగా, అతన్ని పట్టుబడి చేసి విచారించగా, అతని పేరు మమ్మద్ ఖాజా వసీముద్దీన్ గత కొంతకాలంగా స్పాస్మో టాబ్లెట్స్ సేవిస్తూ వాటికి బానిసై, ఈజీగా డబ్బులు సంపాదించాలని వసీం, అతని స్నేహితులైన ఇద్దరు పరారీ లో ఉన్నారని తెలిపారు. నల్గొండ చుట్టుపక్కల మెడికల్ షాపులలో ఇట్టి టాబ్లెట్స్ అమ్మట్లేదని, పోలీసువారికి ఇక్కడ నిఘా ఉంటుందని, ఆరు నెలల నుండి పిడుగురాళ్ల లోని ఛాయా మెడికల్ షాప్ నిర్వాహకుడైన ఏ4 మణిదీప్ దగ్గరికి బైక్ పై వెళ్లి ఒక షీటును వంద రూపాయలకు కొని, అట్టి టాబ్లెట్స్ ను వినియోగిస్తూ, అవసరం ఉన్నవారికి 180 రూపాయలకు అమ్ముతూ డబ్బులు సంపాదిస్తూ ఉన్నారని ఇదే క్రమంలో మమ్మద్ వసీముద్దీన్ 288 టాబ్లెట్స్ షీట్స్ తీసుకుని, అవసరం ఉన్నవారికి అమ్ముదామని వెళుతూ ఉండగా పట్టుబడడం జరిగిందని తెలిపారు . ఇతడిని తీసుకొని గురజాలలోనే మెడికల్ షాప్ నిర్వాహకుడైన మణి దీపిని పట్టుబడి చేసి, అతని వద్ద నుండి 15 షీట్స్, సెల్ ఫోన్, షాపు డాక్యుమెంట్స్ స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు.

## బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలి



**ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల ప్రతినిధి :** పోలీస్ స్టేషన్ ల నిర్వహణలో హెడ్ కానిస్టేబుల్స్ దే కీలక పాత్ర అని అందుకు అనుగుణంగా బాధ్యతా తో విధులు నిర్వహించి ప్రజలకు మంచి సేవలు అందించాలని జిల్లా ఎస్పీ టి శ్రీనివాస్ రావు హెడ్ కానిస్టేబుల్స్ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని పోలీస్ స్టేషన్ లలో , వివిధ విభాగాలలో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్స్ అధికారులతో గురువారం జిల్లా ఎస్పీ గ్రీవెన్స్ హాల్ నందు సమావేశమై తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ నిర్వహణలో హెడ్ కానిస్టేబుల్స్ ప్రముఖ పాత్ర పోషిస్తున్నారని పోలీస్ వ్యవస్థలో గతంలో కంటే సాంకేతిక పరిజ్ఞానం చాలా పెరిగిందని, సిసిటిఎన్ఎస్ పై ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాలని అన్నారు. పోలీస్ స్టేషన్‌లలో ఎవరెవరు ఏఏ విధులు నిర్వహిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. సెక్షన్ ఇంచార్జి తో పాటు కేసుల ఇన్వెస్టిగేషన్‌లో అవగాహన మరింత పెంచుకోవాలని అన్నారు. కోర్టు డ్యూటీ అధికారులతో రోజు వారి కోర్టు కేసుల వివరాలు, ట్రయల్స్, సమ్మాన్స్ వివరాలు తెలుసుకోవాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదు దారుడికి చట్ట ప్రకారం న్యాయం చెయ్యాలని, గస్తి డ్యూటీ వారిని రాత్రి వేళల్లో నేరాలు జరగకుండా బ్రీఫింగ్ చేసి సరైనా విధంగా జరిగేలా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీసీఎస్ ఇన్స్పెక్టర్ నాగేశ్వర్‌రెడ్డి, జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల నుండి వచ్చిన హెడ్ కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

# ప్రైవేట్ ఆసుపత్రిలో ఆకస్మిక తనిఖీలు

### తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సభ్యుల సోదాలు

### యాపిల్ స్కానింగ్ సెంటర్, సాయి గణేష్ డాక్టర్ల గుట్టు రట్టు

### నిద్రావస్థలో జిల్లా ప్రభుత్వ వైద్యాధికారులు




**ప్రజాపక్షం/సూర్యాపేట ప్రతినిధి:** ఇటీవల సూర్యాపేట జిల్లా కేంద్రంలో శరత్ గుండెవైద్య నిపుణుల ఆసుపత్రిని తెలంగాణ మెడికల్ సభ్యులు జిల్లా వైద్యాధికారితో సీజ్ చేయించిన సంఘటన మరవక ముందే గురువారం మరో మారు సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆసుపత్రులను తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సభ్యులు ఆకస్మీకంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీలో ఆసుపత్రుల వైద్యుల గుట్టు రట్టు అయ్యింది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మహాత్మగాంధీ రోడ్డులోని యాపిల్ స్కానింగ్ సెంటర్‌ను తనిఖీ చేసిన కౌన్సిల్ సభ్యులు ఈ సెంటర్ నిర్వహకులు డాక్టర్ వనమా కిరణ్ రెడియాలజిస్టు కాకున్న ఫోర్జరీ సర్టిఫికెట్లతో రెడియాలజిస్టుగా చెలామణి అవుతున్నట్లు గుర్తించారు. ఎంబిబిఎస్ చదివిన సదరు వైద్యుడు తన తండ్రిపేరు వీరభద్రయ్య కాగా అందులోని ఎండి అనే రెండు అక్షరాలను స్కానింగ్ చేసి తాను రెడియాలజిస్టుగా చలామణి అవుతూ గత 15 సంవత్సరాలుగా రోగులను మోసం చేస్తూ దోచుకుంటున్న పరిస్థితి బయటపడింది. ఇందులో పని చేస్తున్నా మరో వైద్యుడు తెలంగాణ మెడికల్ కౌన్సిల్‌లో సభ్యత్వం లేకున్న ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ సభ్యత్వంతో వైద్యం చేస్తున్నట్లు తనిఖీలో నిర్ధారించారు. ఇది ఇలా ఉండగా విద్యానగర్‌లోని శ్రీ సాయిగణేష్ ఆసుపత్రిలో తనిఖీ చేసిన కౌన్సిల్ సభ్యులు అందులో వైద్యం చేస్తున్న డాక్టర్ సందీప్ ఎంబిబిఎస్ చదివి ఎండి అని చలామణి అవుతూ బోర్డుపై డిగ్రీ ఉన్నట్లుగా లెటర్ ప్యాడ్‌లో ముద్రించుకొని అర్హత లేకున్న రోగులకు వైద్యం చేస్తున్నారు. 2019కు చెందిన ఎంబిబిఎస్ డిగ్రీను కూడా రెన్యూవల్ చేయించుకోకుండా చెల్లని సర్టిఫికెట్లతో వైద్యం చేస్తున్నట్లు తనిఖీలో బట్టబయలయ్యింది. కొత్తబస్టాండ్ సమీపంలోని సూర్య ఆసుపత్రిని కూడా కౌన్సిల్ సభ్యులు తనిఖీ చేయగా డాక్టర్ లేకుండానే రోగులకు నిర్వహకులు వైద్యం చేస్తున్నట్లు గుర్తించారు. ఆసుపత్రి బోర్డుపై ఓ వైద్యుడి పేరు ఉండడంతో అతడికి ఫోన్ చేసి తెలుసుకోగా తాను ఆ ఆసుపత్రిలో వైద్య సేవలు అందించడం లేదని చెప్పారు. ఇది ఇలా ఉండగా నక్షత్ర ఆసుపత్రిలో కాలం చెల్లిన సర్టిఫికెట్లను చూపించి నిర్వహకులు ఆసుపత్రి నిర్వహణ చేస్తున్నట్లు సభ్యులు గుర్తించారు. సూర్యాపేటలో తెలంగాణ మెడికల్ సభ్యుల తనిఖీలలో బయటపడ్డ నిజాలకు స్థానిక వైద్యులు నివ్వెరబోయారు. అర్హత లేకున్న నకిలీ సర్టిఫికెట్లతో వైద్య సేవలు అందిస్తున్న ప్రైవేట్ ఆసుపత్రులపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి అండగా నిలవడంతోనే వీరి ఆటలు సాగుతున్నాయంటూ ఐఎంఎ డాక్టర్లు గుర్రుమంటున్నారు. ఇలాంటి వైద్యులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని సీనియర్ వైద్యులు కోరుతున్నారు. జిల్లా వైద్యాధికారులు వీరపై చర్యలు తీసుకోకపోతే వారిని మేమే తరిమికొడుతామని చెప్పారు. ఈ నకిలీ వైద్యులతో తమ వైద్య వృత్తి కలంకమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

**తనిఖీ నివేదికను కౌన్సిల్ ముందు పెడతాం కౌన్సిల్ సభ్యులు డాక్టర్ నరేష్**

సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆసుపత్రులపై తాము చేసిన తనిఖీలలో బయటపడ్డ విషయాలను తెలంగాణ మెడికల్ కౌన్సిల్ ముందు పెడుతామని కౌన్సిల్ సభ్యులు డాక్టర్ నరేష్ తెలిపారు. తనిఖీల అనంతరం మరో సభ్యులు రాజీవ్‌తో ఆయన మీడియాతో మాట్లాడుతూ అర్హత లేకున్నా వైద్యం చేస్తూ ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని అన్నారు. స్టెరాయిడ్స్, యాంటిబయాటిక్ మందులను మోతాదుకు మించి ఇచ్చి రోగులను బలి తీసుకుంటున్నారని అన్నారు. స్థానిక జిల్లా వైద్యాధికారులకు కూడా తన తనిఖీ నివేదికను అందజేస్తామని చెప్పారు.

## ‘ఓపెన్ టెన్త్ ’పరీక్షలో ఒకరికి బదులు మరొకరు

### ఇద్దరిపై కేసు నమోదు



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రంలో ఓపెన్ టెన్త్ పరీక్షలో ఒకరికి బదులుగా మరొకరు పరీక్ష రాస్తుండగా సబ్ కలెక్టర్ ఆదేశాలతో పట్టుకోని కేసు నమోదు చేశామని తహసీల్దార్ హరిబాబు తెలిపారు. బకల్‌వాడ ఉన్నత పాఠశాలలో ఓపెన్ టెన్త్ పరీక్షలకు దరఖాస్తు చేసిన గువ్వల శ్రీనివాస్‌కు స్థానికంగా బాలికల ఉన్నత పాఠశాలలో సెంటర్ పడింది. గువ్వల శ్రీనివాస్‌కు బదులు అప్పాముల శ్రీనివాస్ అనే మరో విద్యార్థి పరీక్ష రాస్తున్నాడు. ఈనెల 20 నుంచి పరీక్షలు జరుగుతుండగా చివరి రోజు సాంఘీక శాస్త్రం పరీక్ష జరుగుతుంది. ఎంసీపీఐయు రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వస్కుల మట్టయ్య గురువారం సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. తక్షణమే స్పందించిన సబ్ కలెక్టర్ తహసీల్దార్ హరిబాబు, ఎంఈవో బాలునాయక్‌ను పరీక్షా కేంద్రానికి పంపి తనిఖీ చేయాలని ఆదేశించారు. రూమ్ నెం.8లో 166 రూల్ నెంబర్‌తో ఒకరికి బదులుగా మరొకరు పరీక్ష రాస్తున్నట్లు గుర్తించారు. వెంటనే వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్, ఇన్విజిలేటర్, కోఆర్డినేటర్లపై విచారణ నివేదికను డీఈవోకు పంపుతామని ఎంఈవో బాలునాయక్ తెలిపారు. కాగా గురువారం పట్టణంలో పలు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన భిక్షపతిని ఈ విషయమై విలేకరులు ప్రశ్నించగా ఓపెన్ పరీక్షలు ఓపెన్‌గానే జరుగుతాయని సమాధానం చెప్పడం గమనార్హం.

## ఉపాధి పనుల పరిశీలన

**ప్రజాపక్షం/ఎర్రవల్లి :** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన గ్రామీణ అభివృద్ధి పనులను పరిశీలించిన జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగరావు గురువారం ఇటిక్యాల మండలంలోని ఇటిక్యాల, ధర్మవరంలోని చేపట్టిన పొలంబాట నిర్మాణ పనులు పరిశీలించి, గ్రామీణ ప్రాంత రైతుల రవాణా సౌకర్యాల మెరుగుదలకు తోడ్పడే ఈ రోడ్ ఫార్మేషన్ పనులు త్వరగా పూర్తి చేయాలని అన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ప్రతి పనిని సమర్థవంతంగా అమలు చేయాలని, ఉపాధి హామీ కూలీలకు నిరంతరంగా ఉపాధి కల్పించాలని అధికారులకు సూచించారు. వేసవిలో అధిక ఉష్ణోగ్రతల వల్ల కూలీలు ఉదయం పనులను ప్రారంభించాలన్నారు.

## 28న భూభారతిపై అవగాహన సదస్సు



**ప్రజాపక్షం/బిజినేపల్లి :** రాష్ట్రప్రభుత్వం ధరణివెబ్‌సైట్ స్థానంలో కొత్తగా రూపొందించిన భూభారతిచట్టంపై రైతులకు , అధికారులకు ఈనెల 28న అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శ్రీరాములు తెలిపారు. మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం తహసీల్దార్ చిక్కుడు రవికుమార్‌తోకలిసి విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. మండలకేంద్రంలోని వనపర్తిరోడ్డు వైపు ఉన్న రైతువేదికలో నిర్వహించే భూభారతిచట్టం అవగాహన సదస్సుకు ఆయాగ్రామాల్లోని రైతులు, పంచాయతీ కార్యదర్శులు,ఏఈఓలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఆశ, అంగన్‌వాడి కార్యకర్తలు, మీసేవ ఆపరేటర్లు, మహిళా సంఘాల సభ్యులు, రేషన్‌డీలర్లు హాజరుకావాలని ఆదేశించారు. భూభారతిచట్టంపై పూర్తి అవగాహన ఉంటేనే భూసమస్యలను సకాలంలో నివృత్తి చేయవచ్చన్నారు.

## నేటి నుండి షూటింగ్‌బాల్ పోటీలు



**ప్రజాపక్షం/బిజినేపల్లి :** నారాయణపేట జిల్లాలోని బిజ్వర్ గ్రామంలో ఈనెల 25,26,27తేదిల్లో మూడురోజులపాటు నిర్వహించే రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్‌పోటిలకు ఎంపికైన నలుగురు విద్యార్థులను గురువారం ఎంఈఓ రఘునాథ్‌శర్మ , పాఠశాల డైరెక్టర్స్ సత్తార్, వహీద్, భానుప్రకాష్ రెడ్డి, సుబ్బారెడ్డి, ప్రిన్సిపాల్ లక్ష్మి నారాయణ, పిఇటి శ్రీనివాసులు అభినందించారు. మండలకేంద్రంలోని మాస్టర్‌మైండ్స్ స్కూల్‌కు చెందిన సాయి ధాత్రి, అక్షిత్‌రెడ్డి, బన్ని, రాకేష్ అనే విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటిల్లో ఉత్తమ ప్రతిభకనబర్చి గోల్డ్‌మెడల్స్ సాధించి చదువుకున్న పాఠశాలకు , తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని ఎంఈవో తెలిపారు. క్రీడలను కెరియర్‌గా ఎంచుకొని జాతీయ, అంతర్జాతీయస్థాయిలో పతకాలు సాధించి దేశానికి పేరు తీసుకురావాలని సూచించారు. విద్యార్థులను విద్యతోపాటు క్రీడల్లో ప్రతిభ ఉన్నవారిని ప్రోత్సహిస్తున్న పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు.



## సన్న, దొడ్డు ధాన్యం కొనుగోలు

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి:** ఐకెపి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ విజయేందిర బోయి తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రం ధాన్యం కొనుగోలు రికార్డులను పరిశీలించారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలో గన్నీలు ఉన్నాయా పరిశీలించి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తేమ శాతంను కలెక్టర్ పరిశీలించారు. తేమ, తాలు, మట్టి లేకుండా నాణ్యతా ప్రమాణాలు ఉన్న ధాన్యంను వెంటనే కొనుగోలు చేయాలని ఆదేశించారు. సన్నరకం, దొడ్డు రకం వేరువేరుగా కొనుగోలు చేయాలని సూచించారు. ప్యాడి క్లీనర్ ఉపయోగించి శుభ్రపరచుకోవాలని అన్నారు. కొనుగోలు కేంద్రంలో ధాన్యం రైతుల వివరాలు ఓపియంఎస్ ఆన్‌లైన్‌లో వెంట వెంటనే నమోదు చేసి కొనుగోలు చేసిన ధాన్యం డబ్బులు వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్ రావు, ఆర్‌డిఓ నవీన్, తాహసీల్దార్ అన్నారు.

## ఆర్మీ క్యాంటీన్ పరిశీలన



**ప్రజాపక్షం/ మహబూబ్ నగర్ ప్రతినిధి:** మహబూబ్ నగర్ పట్టణం లోని బండమీదపల్లి తో ఉన్న ఆర్మీ క్యాంటీన్‌ను ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా క్యాంటీన్ నిర్వహణకు వసతి సరిపోవడం లేదని, పార్కింగ్ సమస్య కూడా ఎక్కువగా ఉందని, ప్రస్తుతం ఉన్న క్యాంటీన్ ప్రదేశం స్థలాభావంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం అని , స్టోరేజీ కోసం మేము చాలా ఇబ్బందులు పడుతున్నామని నిర్వాహకులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఎన్‌సిసి కార్యాలయం దగ్గర ఖాళీ గా ఉన్న ఆగ్రో సర్వీస్ సెంటర్‌ను తమకు కేటాయించాలని వారు కోరగా, ఆయన వెంటనే స్పందించి ఆగ్రో సర్వీస్ సెంటర్‌ను ఆర్మీ క్యాంటీన్ సభ్యులతో కలిసి ఆయన పరిశీలించారు.కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి ఆర్మీ క్యాంటిన్‌కు కేటాయించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.గుండామనోహర్, ఎంఆర్ కే రెడ్డి, వేణుగోపాల్‌పాల్గొన్నారు.

## డ్రగ్స్ నిర్మూలన అందరి బాధ్యత



**ప్రజాపక్షం/నారాయణపేట్ :** డ్రగ్స్ నిర్మూలన అందరి సామాజిక బాధ్యత. డ్రగ్స్ మత్తుతోజీవితం నాశనం అవుతుంది. డ్రగ్స్ వినియోగించిన,రవాణా చేసిన శిక్షలు తప్పవు అని జిల్లా ఎస్‌పి యోగేష్ గౌతమ్ అన్నారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో డ్రగ్స్ వాడకాన్ని నిషేధిస్తూ ఏర్పాటు చేసిన అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు. యోగేష్ గౌతమ్ మాట్లాడుతూ. డ్రగ్స్ వల్ల సమాజంలో యువశక్తి విచ్ఛిన్నం అవుతుందన్నారు. డీడబ్ల్యూఓ జయ, ఎఫ్ఆర్ ఓ సాయి, వాలంటీర్స్ సంధ్య, లక్ష్మి కాంత్ పాల్గొన్నారు.

## భూ భారతి చట్టం రైతుకు వరం



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి:** భూ భారతి చట్టం రైతుకు వరం అని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. హన్వాడ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భూ భారతి సదస్సులోముఖ్య అతిథిగా మాట్లాడారు. ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణంలో పైలెట్ ప్రాజెక్టుగా తీసుకున్న హన్వాడ మండలం లోని ఇబ్రహీంబాద్ గ్రామానికి చెందిన నలుగురు లబ్ధిదారులకు మహిళా సమైక్య ద్వారా ఒక్కరికి 50 వేల రూపాయల చెక్కును జిల్లా కలెక్టర్ కలిసి ఎమ్మెల్యే అందజేశారు. అనంతరం హన్వాడ మండలానికి చెందిన 24 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు.అదనపుకలెక్టర్ మోహన్‌రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, డిఆర్డీవో నర్సింహులు, ఆర్డీవో నవీన్, హన్వాడ మండల తహసిల్దార్ కిష్ట్యా నాయక్, ఎంపిడిఓ యశోద, హన్వాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వి.మహేందర్, నాయకులు కృష్ణయ్య యాదవ్,నవనీత, బుద్దారం సుధాకర్‌రెడ్డి, యాదవ రెడ్డి, లింగంనాయక్, వెంకటయ్య ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## అన్నాసాగర్‌లో అంగడి కోసం వినతి



**ప్రజాపక్షం/నారాయణపేట్:**దామరిగిద్ద మండల అన్నాసాగర్‌లో వారంలో ఒక రోజు కూరగాయల సంత బజార్ (అంగడి) ఏర్పాటు చేయాలని గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజ్ నారాయణకు వినతి పత్రం అందజేశారు. మెన్స్ రేట్స్ అసోసియేషన్ ఫౌండర్ మోహన్ రాజ్, మహేందర్ సురేందర్ గౌడ్, రాజు గౌడ్ , అనిల్ గౌడ్, మధు కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

## సంజయ్ సింఘ్వీకి నివాళి

**ప్రజాపక్షం/ మక్తల్ :** భారత విప్లవోద్యమ నాయకుడు, కార్మిక వర్గ అగ్ర నాయకుడు, టియూసిఐ ఆల్ ఇండియా ప్రధాన కార్యదర్శి సంజయ్ సింఘ్వి ఈ రాత్రి అమరత్వం పొందారు. స్థానిక మున్సిపాలిటీ కార్యాలయ నందు టియూసిఐ మక్తల్ కమిటీ ఆధ్వర్యంలో సంజయ్ సింఘ్వి చిత్రపటానికి నివాళులర్పించారు. టియుసీఐ జిల్లా కోశాధికారి కోలిమి రాములు అధ్యక్షత వహించగా ముఖ్య వక్తగా టియుసిఐ జిల్లా అధ్యక్షులు యస్. కిరణ్ మాట్లాడారు. టియుసీఐ జిల్లా కోశాధికారి కొలిమి రాములు, పిడిఎస్యు రాష్ట్ర ఉపాధ్యక్షులు భాస్కర్ , జిల్లా ప్రధాన కార్యదర్శి అజయ్ నాయకులు చంద్రశేఖర్, నాయకులు ఎల్లప్ప , తిరుపతి మున్సిపల్ వర్కర్స్ లంగన్న, బాలా రాజు బాబు, బాలు, జి . కృష్ణయ్య, మహేష్, ఆకాష్ జగ్గలి ఆంజనేయులు, టి. రామన్న ,కర్రెం బాలరాజు, బాలస్వామి పాల్గొన్నారు.

## ఈత సరదా విషాదంగా మారకూడదు

**ప్రజాపక్షం /వనపర్తి ప్రతినిధి :** ఎంతో మంది పిల్లలు యువకులు, సరదా కోసం, ఈత నేర్చుకోవడానికి చెరువులు, కాలువలకు వెళ్తుంటారు. ఈత సరదా విషాదం కారాదని జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. ఏదైనా అనుకొని సంఘటన జరిగినట్లయితే జరిగే నష్టాన్ని ఎవరూ పూడ్చలేరని ముఖ్యంగా తల్లిదండ్రులు తమ పిల్లలను చెరువుల వద్దకు, కాలువల వద్దకు, కుంటలు వద్దకు , క్వారీ గుంతల వద్దకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.పోలీసుశాఖ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లో పట్టణాలలో ఈతకు వెళ్లినప్పుడు పాటించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

# ‘భూభారతి’తోనే భరోసా

## ధరణితో సాధ్యంకాని ఎన్నో సమస్యలకు పరిష్కారం

### కలెక్టర్ సిక్తా పట్నాయక్, మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి



**ప్రజాపక్షం/ నారాయణపేట్/నర్వ :** ధరణి తో సాధ్యం కాని ఎన్నో భూ సమస్యలకు కొత్త చట్టం భూభారతి ద్వారా పరిష్కారం లభిస్తుందని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, మక్తల్ ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు. గురువారం నర్వ మండల కేంద్రాల్లోని రైతు వేదికలలో ఏర్పా టు చేసిన భూ భారతి అవగాహన సదస్సుకు వారు ముఖ్యఅతిథిలుగాహాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ ధరణిలో ఉన్న సమస్యలను గుర్తించి ధరణి స్థానంలో రైతులకు మేలైన చట్టం తేవాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ధరణిని రద్దుచేసి రైతు సంఘాలు, రెవెన్యూ అధికారులు, మేధావులతో చర్చలు జరిపి భూభారతి చట్టాన్ని తీసుకోచ్చిందన్నారు. కొత్త చట్టాన్ని గత జనవరిలో రూపొందించిన ప్రభుత్వం కేవలం మూడు నెలల్లో రూల్స్ ను కూడా తీసుకొచ్చిందని తెలిపారు. గతంలో చట్టం తీసుకు రావడానికి 13 సంవత్సరాలు పట్టిందన్నారు. మక్తల్ ఎమ్మెల్యే డాక్టర్॥ వాకిటి శ్రీహరి మాట్లాడుతూ. భూ భార తి చట్టాన్ని తీసుకురావడానికి 10 నెలలు అహర్నిశలు సీఎం రేవంత్ రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనిహస రెడ్డి కష్టపడ్డారని తెలిపారు నర్వమండల కేంద్రంలోని బీసీ కాలనీకి రహదారి సౌకర్యం కల్పించిన జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్‌కు సదస్సులో బీసీ కాలనీ మహిళలు సన్మానించారు. కాగా సదస్సు ప్రారంభానికి ముందు ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, కలెక్టర్ సిక్తాపట్నాయక్, అధికారులు పహల్గామ్‌లో మరణించిన పర్యాటకుల ఆత్మశాంతికి రెండు నిముషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు.

## చట్టాలపై అవగాహన కల్పించండి



**ప్రజాపక్షం/ నారాయణపేట్ :** దామరిగిద్ద మండలం పరిధిలో ని అన్నాసాగర్ గ్రామంలోని చట్టాలు, నేరాలు ఘోరాలు దొంగతనాలు, మోసం, సైబర్ నేరాలు, సోషల్ వీడియా మద్యానికి, మత్తు పదార్థలకు బాని పైన వారి పరిస్థితి, బాల్య వివాహాల పై, మైనర్ డ్రైవింగ్, కోర్టు శిక్షలు మహిళా వేధింపుల పై అవగాహన సదస్సు ఏర్పాటు చేయాలని అలాగే గ్రామంలో సీసీ కెమెరాల బిగింపు ఏర్పాటు ఉపయోగాల తదితర అంశాల పై గ్రామ ప్రజలకు అవగాహన సదస్సు కార్యక్రమం ఏర్పాటు చేయాలని గురువారం మెన్స్ రైట్స్ అసోసియేషన్ తరఫున దామరగిద్ద మండలం ఎస్సై రాజు కి వినతి పత్రం అందజేశారు. అందుకు ఎస్సై సానుకూలంగా స్పందిస్తూ అన్నా సాగర్ గ్రామంలో చట్టాలు గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం చాలా సంతోషం వ్యక్తం చేస్తూ అతి త్వరలో అవగాహన పోలీస్ డిపోర్ట్మెంట్ నుండి సదస్సు ఏర్పాటు చేస్తున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మెన్స్ రేట్స్ అసోసియేషన్ ఫౌండర్ మోహన్ రాజ్, మధు , కిష్టప్ప, సురేందర్ గౌడ్, అనిల్ , నరేష్, రాజు గౌడ్, గ్రామ యువకులు, స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.

## రోగులకు నిత్యం అందుబాటులో ఉండాలి

### ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



**ప్రజాపక్షం/కల్వకుర్తి :** వైద్యులు రోగులకు అం దుబాటులోఉండాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. గురువారం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రిలో దయాలసిస్‌కేంద్రం రాష్ట్రంలోనే మొదటిస్థానంలో నిలవడంతో దయాలసిస్ పెషెంట్‌మధ్య కేక్‌కట్ చేయించి తినిపించారు. అదేవిధం గా అపెక్స్ కిడ్నికేర్ వాళ్లు దయాలసిస్ యూనిట్‌కి అందించిన అవార్డుషీల్డ్‌ని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శివరాంకి అందజేశారు. నిమ్స్ నెఫ్రాలజిస్టు డాక్టర్ గంగాధర్‌తో జూమ్ మీటింగ్‌లో ప్రసంగించారు. వారికి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం వార్డుపక్కన నిర్మించిన రోగి సహాయకులు వేచి ఉండే షెడ్డుని, మొదటి అంతస్తులో నిర్మించిన ఆడ్మినిస్ట్రేషన్ బ్లాక్‌నుప్రారంభించారు.దయాలసిస్ సిబ్బంది అందరిని ప్రశంసించిరోగులను జాగ్రత్తగా చూసుకోవాలనిసూచించారు. వైద్యులు యశోద, విష్ణు, శివ, స్వప్న, షకీల్, నర్సింగ్‌సిబ్బంది శిరోమణి, బాలమణి,, సునీత, ల్యాబ్ టెక్నిషియన్లు,ఫార్మాసిస్టులు,ఆరోగ్యమిత్రలు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు బృంగిఆనంద్ కుమార్,విజయ్‌కుమార్‌రెడ్డి, సంజీవ్‌కుమార్, శ్రీకాంత్‌రెడ్డి, షేక్ ఇజాజ్, రమాకాంత్‌రెడ్డి, జిల్లెలరాములు, రేష్మ, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

### కొనుగోలుకేంద్రాలలోనే విక్రయించాలి

కల్వకుర్తిరూరల్:వరిధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలలోనే విక్రయించాలని ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డి అన్నారు. మండల పరిధిలోనిమార్చాల, పంజుగుల, ముకు రాలలలోవరిధాన్యంకొనుగోలుకేంద్రాలను ప్రారంభించారు.మాజీ సర్పంచ్ ఆనంద్ కుమార్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు విజయ్ కుమార్‌రెడ్డి, మాజీ జడ్పిటిసి అశోక్‌రెడ్డి, తదిత రులున్నారు.



## ‘స్కాలర్స్’ ప్రభంజనం

**ప్రజాపక్షం / వనపర్తి టౌన్ :** వనపర్తి జిల్లాలోని తమదైన శైలితో విద్యాసంస్థను రాణిస్తున్న స్కాలర్స్ కళాశాల యాజమాన్యం ఇంటర్ ఫలితాల్లో ప్రత్యేకమైన స్థానం దక్కించుకుంది. స్కాలర్స్ జూనియర్ కళాశాల విద్యార్థులు సత్తాచాటి అత్యుత్తమ ఫలితాలను సాధించారు. ఎంపీసీ సెకండ్ ఇయర్ విభాగంలో బి. సోని 992, డి. రాజు 989, బైపిసి విభాగంలో బి. శిరీష 992, స్రవంతి 991, ఎస్. తన్మత 990, హన్సిక 989, ఫస్ట్ ఇయర్ సుస్మిత 436, తేజ హరిని 435, అలీషా సాహిజీ 435 , సంధ్యారాణి 434, మహలక్ష్మి 433, శ్రావణి 432, ఎంపీసీ విభాగంలో కె. రన్మదా 465, కె. శిరీష 463, గీత 463, ఆర్. ప్రణవి 463, కె. విజయ్ కుమార్ 463, సీసీ విభాగంలో శృతి 917, మార్కులు సాధించినట్లు తెలిపారు. అధ్యాపక బృందాన్ని కళాశాల ప్రిన్సిపల్ శ్రీధర్ మధుసూదన్ గుప్తలను విద్యార్థి తల్లిదండ్రులను కళాశాల డైరెక్టర్ జగదీశ్వర్ , వరప్రసాదరావు, నాగేశ్వర్ రెడ్డి, సత్యనారాయణరెడ్డి అభినందించారు.

## భారతదేశాన్ని విచ్ఛిన్నం చేసే కుట్రను సహించం



### ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి:** అఖండ భారతదేశాన్ని విచ్చిన్నం చేయడానికి పాకిస్థాన్ ఉగ్రవాదులు కుట్ర చేస్తున్నారని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు. కాశ్మీర్ పహల్గాం ఉగ్రదాడికి నిరసనగా మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో న్యాయవాదులు చేపట్టిన ర్యాలీలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. దేశంలో కులమతాల మధ్యన చిచ్చు పెట్టి దేశంలో అల్లర్లు సృష్టించేందుకు పన్నాగం పన్నారన్నారు.టిపిసిసి ప్రధాన కార్యదర్శి వినోద్ కుమార్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎన్‌పి వెంకటేశ్, గుండా మనోహర్, వీరబ్రహ్మాచారి, రమాకాంత్‌గౌడ్, మురళి కృష్ణ, లక్ష్మ య్య, కృష్ణయ్య, అనంతచారి, శ్రీపాద రావు, విక్రంగౌడ్, కృష్ణయ్య తదితరులు ఉన్నారు.





**జడ్చర్ల:** భారతీయ జనతా యువమోర్చా జడ్చర్ల పట్టణ అధ్యక్షులు పిట్టలనరేష్ ఆధ్వర్యంలో పాకిస్తాన్ దిష్టి బొమ్మ దహనం చేశారు.జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనాథ్ మాట్లాడారు. నాయకులు బీజేపీ పట్టణ అధ్యక్షులు అమర్నాథ్ గౌడ్, మండల అధ్యక్షుడు రమేశ్ జీ మహిళా మోర్చ జిల్లా అధ్యక్షురాలు, సాహితీ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుల రాపోతుల శ్రీనివాసులు గౌడ్ జిల్లా నాయకులు బాల వర్ధన్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, జడ్చర్ల మండల ప్రధాన కార్యదర్శి మల్లేష్ యాదవ్, బాలస్వామి నడిమింటి శ్రీను, బుక్క నవీన్, జగదీశ్ యాట రామకృష్ణ, మోహన్ విశ్వనాథ్, సూరజ్, మహేష్, ప్రశాంత్, శివ రెడ్డి, కన్న, రవి ముదిరాజ్, కృష్ణ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

**జడ్చర్ల:** జడ్చర్ల పట్టణంలోని కోర్టుకు చెందిన న్యాయవాదులు విధులు బహిష్కరించారు. న్యాయవాద సంఘం నాయకులు మాట్లాడుతూ పాకిస్తాన్ ఉగ్రవాదులు కాశ్మీర్లో భారత పర్యాటకులపై దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. అనంతరం కోర్టు నుండి తహసిల్దార్‌కు కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి తహసిల్దార్‌కు మెమోరాండం అందజేశారు.

## ‘భూభారతి’పై అవగాహన ఉండాలి



### ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి, కలెక్టర్ విజయేందిర బోయి

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి:** భూ భారతి చట్టం పై రైతులందరూ అవగాహన కలిగి ఉండాలని నారాయణ పేట శాసనసభ్యురాలు డా.చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కోయిల్ కొండ మండలంలో గురువారం భూ భారతి అవగాహన సదస్సును కలెక్టర్ విజయేందిర బోయితో కలిసి నారాయణపేట శాసనసభ్యురాలు డా.చిట్టెం పర్ణికరెడ్డి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ రైతులందరికీ ఉపయోగపడేలా రాష్ట్ర ముఖ్య మంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మేధవులతో చర్చించి అందరి ఆమోదంతో చట్టాన్ని ఏప్రిల్ 14నుండి అమలులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. సమస్యలు పరిష్కారం కోసం వేలాదిమంది దరఖాస్తులను ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్ అధికారులకు ఇచ్చే వారని అన్నారు. భూ భారతి చట్టం అమలుపై నారాయణపేట జిల్లా మద్దూరు మండలం ఖాజిపూర్‌లో పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసినట్లు తెలిపారు. గ్రామంలో చాలా సంఖ్యలో దరఖాస్తులు వస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ విజయేందిర బోయి మాట్లాడుతూ భూ సమస్యలను సత్రం పరిష్కారం చేసేందుకు అన్ని అంశాలను పొందుపరిచిఉగాదినచట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీసుకురావడం జరిగిందని తెలిపారు. సాదా బైనమా ద్వారా కొనుగోలు చేసి భూములు పరిష్కారంకు వెసులుబాటు కల్పించిందని పేర్కొన్నారు. శాసనసభ్యురాలు కళ్యాణలక్ష్మి షాది ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. రెవెన్యూ అదనపు కలెక్టర్‌మోహన్‌రావు,ఆర్‌డిఓ నవీన్, మండల ప్రత్యేక అధికారి, జిల్లా యువజన క్రీడల అధికారి శ్రీనివాస్, తాహసీల్దార్ రాజగణేష్, రిటైర్డ్ తాహసీల్దార్ జాఫరుల్లాఖాన్ చట్టం పై వివరించారు.

## కెజిబివి విద్యార్థుల విజృంభణ

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** ఇంటర్ ఫలితాల్లో మంచిమార్కులు సాధించిన నాగర్‌కర్నూల్ జిల్లాలోని ఆరు కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల్లో జూనియర్ కళాశాలల విద్యార్థినిలను నాగర్‌కర్నూల్ జిల్లావిద్యాశాఖ కార్యాలయంలో డిఇఓ రమేష్‌కుమార్ మంగళవారంఅభినందించారు. ఇంటర్ ఫలితాలలో నాగర్‌కర్నూల్ జిల్లాలో కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయం విద్యార్థినిలు అద్భుతమైన ప్రతిభ కనబర్చారని తెలిపారు. ఎంపిసిలో నాగర్‌కర్నూల్ కేజిబివి విద్యార్థిని పి.కృష్ణవేణి 943/1000 మార్కులు సాధించింది. సిఈసిలో కేజిబివి తెలకపల్లి విద్యార్థిని దివ్య 941/1000, ఎంపిహెచ్‌డబ్ల్యూలో కేజిబివి కల్వకుర్తి విద్యార్థిని పి.హేమలత 966/1000 మార్కులు సాధించి ఉత్తమ ప్రతిభకనబర్చారు. ప్రథమ సంవత్సరం ఫలితాల్లోను కేజిబివి విద్యార్థినిలు సత్తాచాటారు. ఎంపిసిలో కేజిబివి కొల్లాపూర్ విద్యార్థినిని అనూష 470 మార్కులకు 462, బైపిసిలో కేజిబివి నాగర్‌కర్నూల్ విద్యార్థిని విజయ 440మార్కులకు 433, సిఈసిలో కేజిబివి బిజినేపల్లి విద్యార్థిని ఆర్.పుష్ప 500మార్కులకుగాను 467, ఎంపిహెచ్‌డబ్ల్యూలో కేజిబివి తెలకపల్లి విద్యార్థిని అనూష 500మార్కులకు 492 మార్కులు సాధించారు. మొత్తం జిల్లాలోని 11కేజిబివి కళాశాలల్లో ప్రథమ సంవత్సరంలో 556 మంది విద్యార్థినిలు పరీక్షకు హాజరుకాగా 409మంది ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరంలో 527మంది విద్యార్థినిలు హాజరుకాగా 441మంది ఉత్తీర్ణత సాధించారన్నారు.గణాంక అధికారి మధుసూదన్‌రెడ్డి, జిసిడిఓ శోభారాణి, సమగ్రశిక్ష అభియాన్ కార్యాలయ పర్యవేక్షకులు సుజాత, సీనియర్ అసిస్టెంట్ తిరుపతమ్మ, ప్రత్యేక అధికారులు మంజుల, హసీన, రమాదేవి, సుమిత్ర, నారాయణమ్మ పాల్గొన్నారు.

## ఇంటర్‌లో సివి రామన్ కళాశాల ప్రభంజనం



**ప్రజాపక్షం / వనపర్తి టౌన్ :** ఇంటర్మీడియట్ ఫలితాల్లో వనపర్తిలోని సివి రామన్ కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. ఐపిఈ 2025 మొదటి ద్వితీయ సంవత్సరం ఫలితాలలో సివి రామన్ జూనియర్ కళాశాల విద్యార్థులు అన్ని గ్రూపుల్లో రాష్ట్ర స్థాయి మార్కులతో విజయ భేరి ప్రమోగించి వనపర్తి జిల్లాలోని చరిత్ర సృష్టించినట్లు కళాశాల కరెస్పాండెంట్ వీరయ్య , ప్రిన్సిపల్ మల్లికార్జున్ తెలిపారు. సీనియర్ ఇంటర్ బీపీసీ విభాగంలో అక్షయ్ 988, మౌనిక 984, శ్వేత, నవ్య 982 మార్కులు , ఎంపీసీ విభాగంలో టి. చరణ్ తేజ, ఆర్షియా 993, రాధిక, అక్షయ , విశ్వతేజ 992, ఆర్. సంధ్య 991, కె. అక్షిత, తులసి 990 మార్కులు సాధించినట్లు చెప్పారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో సానియా 467, శ్రావణి 465, తనుశ్రీ , సుకన్య, మేఘన 464, శిరీష 463, ఐశ్వర్య, హేమలత, అక్షయ 462, కురుమూర్తి , లోకేష్ 461, శ్రీనివాస్ , అనిల్ , మధు, స్వా,ఇ హన్సిక 460 మార్కులు , బీపీసీ విభాగంలో లక్ష్మీ నారాయణ 435, మధుమోహన్ రెడ్డి 431 , సూర్య హర్షిని 428, ఎంఈసి నందిని 490, జ్ఞానేశ్వరి 485, సిఈసి 1 ఆర్. వైష్ణవి 440 మార్కులు సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మా కళాశాల విద్యార్థులు 990 పైగా మార్కులు 8 మంది విద్యార్థులు సాధించడం జిల్లా రికార్డు ఎంతో గొప్ప సంతోషమన్నారు. ఈ సందర్భంగా అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను కళాశాల కరెస్పాండెంట్ కె. వీరయ్య, సెక్రటరీ వెంకటేశ్వర్లు, కోశాధికారి కుమారస్వామి, కళాశాల ప్రిన్సిపల్ మల్లికార్జున్ , కళాశాల సిబ్బంది రమణ, అమరీ ఖాన్ , వెంకటేశ్వర్ రెడ్డి, రఘుతపిరెడ్డి, లింగస్వామి అభినందించారు.

## ‘అభ్యాస’ కళాశాల సంచలనం



**ప్రజాపక్షం / వనపర్తి టౌన్ :** జిల్లా కేంద్రంలోని అభ్యాస జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ పరీక్ష ఫలితాల్లో సంచలం సృష్టించారు. ప్రథమ సంవత్సరం ఎంఈసిలో లహరి 495, భవిత 493, మనస్వీతి 492, ఎంపిసి విభాగంలో కావలి ఝాన్సీ 466, ప్రణవి 465, రసజ్ఞరెడ్డి 464, బైపిసి విభాగంలో గౌతమి , లక్ష్మీ, రేష్మ 430 మార్కులు సాధించారు. సిఈసిలో విద్యవత్ సునీల్ 488 మార్కులు, జేఈఈ సిఏ ఫలితాల్లో ఐదు సంవత్సరాల్లోనే దాదాపు 100కు పైగా విద్యార్థులు అర్హతలు సాధించారని అభ్యాస విద్యాసంస్థల చైర్మన్ మణిగిల్ల జ్ఞానేస్వర్ రెడ్డి తెలిపారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం అభినందించింది. కళాశాల ప్రిన్సిపల్ ముజమిల్ ,లోకనాథ్ కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫోకస్

# వ్యవసాయం

## పంట వ్యర్థాల దగ్ధానికి ప్రత్యామ్నాయం ఏమిటి?





దేశంలో పంట వ్యర్థాలను తగలబెట్టే విధానానికి స్వస్తి పలకాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అందుకే, యుద్ధ ప్రాతిపదికన ప్రత్యామ్నాయాలను అన్వేషించక తప్పని పరిస్థితి. పంట వ్యర్థాలను దగ్ధం చేయడాన్ని సుప్రీం కోర్టు ఆక్షేపించడం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేయడం తెలిసిందే. ఈ నేపథ్యంలో, పంట వ్యర్థాల నిర్వహణ అంశం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ సమస్య అధికంగా ఉన్న పంజాబ్‌లో అనుసరించాల్సిన విధానాలపై ఐఎంఎం అమృత్‌సర్ ఒక అధ్యయనాన్ని నిర్వహించింది. దాని నివేదికను అనుసరించి, పంట దుబ్బులను తగలబెట్టే విధానాన్ని, నిర్మాణాత్మక మార్కెట్ విధానాలతోపాటు, కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) వంటి ప్రోత్సాహకారాల ద్వారా నియంత్రించవచ్చు. కేంద్ర ప్రభుత్వం నేతృత్వంలోని అంశాలు, నిర్ణయాలు, జోక్యాలు అనుకోకుండా స్థిరమైన వ్యవసాయ పద్ధతులను ఎలా బలోపేతం చేస్తాయో ఇది ప్రతిబింబిస్తుంది. కాగా, పంటల దగ్ధానికి గల కారణాల్లో విధాన ప్రేరిత 'మోనోక్రాపింగ్' నమూనాలు ప్రధాన భూమిక పోషిస్తున్నాయి. ఎంఎస్‌పి వ్యవస్థ గోధుమ, బియ్యం ఉత్పత్తికి ప్రాధాన్యత ఇస్తుంది. రైతులకు హామీ ఇచ్చిన ఆదాయాన్ని అందిస్తుంది. ధరల నష్టాలను తగ్గిస్తుంది. ముఖ్యంగా పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో ఎంఎస్‌పిపై తీవ్ర అసంతృప్తి నెలకొని ఉంది. రైతుల డిమాండ్‌కు అనుగుణంగా ఎంఎస్‌పికి చట్టబద్ధతపై లిఖితపూర్వకంగా ఇచ్చిన హామీని సైతం మోదీ సర్కారు నిర్లక్ష్యం చేస్తున్నది. దీనితో పంట నిర్వహణ ఖర్చులు తగ్గించుకోవడానికి రైతులు పంట వ్యర్థాలు లేదా దుబ్బులను దగ్ధం చేసే కాలం చెల్లిన విధానాన్ని ఇప్పటికీ అనుసరిస్తున్నారు. పంట వ్యవర్థాల నిర్వహణపై స్పష్టత లేకపోవడం పంట వైవిధ్యతను నిరుత్సాహపరుస్తున్నది. వరి పంట పేరుకుపోవడానికి దారితీస్తున్నది. రైతులు తరచుగా తదుపరి విత్తే సీజన్ కోసం పొలాలను త్వరగా క్లియర్ చేయడానికి కాల్చివేస్తారు. కాగా, మార్కెట్ వక్రీకరణలు, ధరల ఒత్తిళ్లు కూడా రైతులను ఇరుకున పెడుతున్నాయి. భారతదేశంలో వ్యవసాయ మార్కెటింగ్ వ్యవస్థ వక్రీకరణ జరిగింది. రైతులు పంట ధరలు, రుణ సదుపాయం, మార్కెట్ సంబంధాలను నియంత్రించే మధ్యవర్తులపై (ఆర్థియాలు) ఆధారపడుతున్నారు. రైతులు తమ ఉత్పత్తులను ఈ మధ్యవర్తులు నిర్ణయించిన కృత్రిమంగా తక్కువ ధరలకు అమ్ముతారు. ఇది తరచుగా అప్పుల ఊబిలోకి కూరుకుపోయే పరిస్థితిని సృష్టిస్తుంది. ప్రధాన రబీ పంటలకు రైతులు వినియోగదారుల ధరలలో 4067శాతం మాత్రమే పొందారని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) సర్వే (మే-జూలై 2024) స్పష్టం చేస్తున్నది. నిలకడగా ఉన్న ఎంఎస్‌పి రేట్లు పెరుగుతున్న సాగు ఖర్చులను భరించలేకపోతున్నాయి. దీని వలన రైతులు ఖర్చుతో కూడుకున్న, హానికరమైన, గడ్డి దహనం వంటి పద్ధతులను అనుసరించాల్సి వస్తున్నది. పరిస్థితులను కేంద్రం చక్కదిద్దలేకపోతున్నది. పంట వ్యర్థాలను తగలబెట్టడాన్ని శిక్షిస్తున్నప్పటికీ, పంట అవశేషాలను నిర్వహించడానికి సరసమైన, స్థిరమైన ప్రత్యామ్నాయాలను అందించడంలో విఫలమవుతోంది. తగినంత ప్రభుత్వ మద్దతు, మౌలిక సదుపాయాలు లేకపోవడం వల్ల రైతులు త్వరితమైన, చౌకైన పరిష్కారంగా గడ్డి దహనంపై ఆధారపడవలసి వస్తుంది. అనూహ్యమైన రుతుపవనాలు, వాతావరణ మార్పుల కారణంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు వ్యవసాయ అనిశ్చితిని పెంచాయి. ఉదాహరణకు, అక్టోబర్ 2023లో కురిసిన వర్షాల కారణంగా పంట కోత ఆలస్యమైంది. దీని వలన రైతులు పంట కోత కోసం పంట కోతలను త్వరగా తొలగించడానికి పంట కోతలను ఆశ్రయించారు. పుసా డీకంపోజర్ వంటి బయో డీకంపోజర్లు లాజిస్టికల్ ఆలస్యం, అస్థిరమైన ఫలితాలు, ఫాలో అప్ లేకపోవడం వల్ల తక్కువ ఫీల్డ్ వినియోగాన్ని ఎదుర్కొంటున్నాయి. సరైన శిక్షణ, సకాలంలో పంపిణీ లేకపోవడంతో, పర్యావరణ అనుకూల పరిష్కారాలు తగిన స్థాయిలో ఉండడం లేదు. ఇవన్నీ రైతులు అవలంబిస్తున్న సేద్య విధానాలు, పంట కోత తదుపరి తీసుకుంటున్న నిర్ణయాలను ప్రభావితం చేస్తున్నాయి. పంట వ్యర్థాలను కాల్చడం అనే సమస్య ఉత్తర భారత దేశంలో ఎక్కువగా ఉంది. పంజాబ్, హర్యానా, వాటి సమీప రాష్ట్రాలలోని రైతులు అక్టోబర్-నవంబర్‌లలో రబీ పంటల కోసం పొలాలను శుభ్రం చేయడానికి వరి దుబ్బులను కాల్చివేస్తున్నారు. ఈ సీజన్‌లో వాయు కాలుష్యానికి ఇది 22–35 శాతం దోహదపడిందని 2023లో ఐఐటిలు, టిఇఆర్ఐ నిర్వహించిన అధ్యయనంలో స్పష్టమైంది. ఈ ప్రాంతాల నుండి వచ్చే గాలులు ఢిల్లీ నేషనల్ క్యాపిటల్ ప్రాంతంలో పిఎం2.5 స్థాయిలను పెంచుతున్నాయి. ప్రతి అగ్ని ప్రమాదం పిఎం2.5లో 112.44యూనిట్ల పెరుగుదలకు దారితీస్తుంది.

## ప్రకృతి విలయం..






ఇటీవల కాలంలో ప్రకృతి విలయాలు పెరుగుతున్నాయి. తాజాగా జమ్మూకశ్మీర్‌లోని రాంబన్ తహసీల్‌లో కుండపోత వర్షం కారణంగా గణనీయమైన ప్రాణనష్టం, మౌలిక సదుపాయాల, ఆకస్మిక వరదలు విస్తృతమైన విధ్వంసానికి ప్రధాన కారణాలు. కుంభ వృష్టి, అకాల భారీ వర్షాలను క్లౌడ్‌బరస్ట్‌గా పేర్కొంటారు. అకస్మాత్తుగా, తీవ్రమైన వర్షపు తుఫాను, దీని ఫలితంగా ఒక చిన్న ప్రాంతంలో (సుమారు 10 కిమీ) ఒక గంట కంటే తక్కువ సమయంలో 10 సెం.మీ కంటే ఎక్కువ వర్షం పడుతుంది. దీనితో పాటు వడగళ్ళు పడతాయి. ఉరుములు వస్తాయి. పర్వత ప్రాంతాలలో, ముఖ్యంగా హిమాలయాలలో మేఘావృతాలు, కుంభవృష్టులు సర్వసాధారణం. స్థానికీకరించిన స్వభావం కారణంగా, మేఘాల విస్ఫోటనాలను అంచనా వేయడం లేదా గుర్తించడం కష్టం. కానీ ఆకస్మిక, వినాశకరమైన వర్షపాతం సంభవించి, ఆకస్మిక వరదలకు, కొండచరియలు విరిగిపడటానికి దారితీస్తుంది. తేమతో కూడిన గాలి పర్వత శ్రేణిపైకి బలవంతంగా పైకి లేచినప్పుడు ఇది సంభవిస్తుంది. గాలి పైకి వెళ్ళేటప్పుడు, అది చల్లబడి ఘనీభవిస్తుంది, ఫలితంగా భారీ వర్షపాతం వస్తుంది. బలమైన పైకి గాలి ప్రవాహాలు వర్షపు చినుకులు పడటానికి ముందు పెద్దవిగా మారడానికి కారణమవుతాయి. ఈ ప్రవాహాలు బలహీనపడినప్పుడు, పేరుకుపోయిన వర్షపు చినుకులు అకస్మాత్తుగా పడి, తీవ్రమైన వర్షపాతానికి దారితీస్తాయి. భారత ఉపఖండంలో, రుతుపవనాల మేఘం బంగాళాఖాతం లేదా అరేబియా సముద్రం నుండి ఉత్తరం వైపుకు కదిలి, మైదానాలను దాటి, హిమాలయాలను చేరుకుని, గంటకు 75 మిల్లీమీటర్ల వర్షపాతాన్ని విడుదల చేసినప్పుడు సాధారణంగా మేఘాల విస్ఫోటనం సంభవిస్తుంది. హిమాచల్ ప్రదేశ్ (2024) మరియు ఉత్తరాఖండ్ (2021) లలో సంభవించిన మేఘాల విస్ఫోటనాలు ప్రాణాంతక వరదలు, కొండచరియలు విరిగిపడటం వంటి ఘటనలు మౌలిక సదుపాయాలకు విస్తృతమైన నష్టాన్ని కలిగించాయి. కొండచరియలు విరిగిపడాన్ని గురుత్వాకర్షణ కారణంగా వాలుపై ఉన్న రాతి, నేల లేదా శిథిలాల క్రిందికి కదలికగా పేర్కోవచ్చు. ఇది ఒక రకమైన సామూహిక వృధా. దీనిలో భూమి పదార్థాలు గురుత్వాకర్షణ ప్రభావంతో వాలు పైకి కదులుతాయి. భారీ వర్షపాతం, భూకంపాలు, నీటి ఉధృతి వంటి సహజ కారకాలు వాలులను బలహీనపరుస్తాయి. అయితే అటవీ నిర్మూలన మరియు నిర్మాణం వంటి మానవ కార్యకలాపాలు ప్రమాదాలను పెంచుతాయి. నేల కూర్పు, భూభాగం వంటి భౌగోళిక అంశాలు కూడా వాలు స్థిరత్వాన్ని ప్రభావితం చేస్తాయి. కొండచరియలు విరిగిపడటానికి దారితీస్తాయి. మన దేశంలో 0.42 మిలియన్ చదరపు కి.మీ (భూభాగంలో 12.6%) కొండచరియలు విరిగిపడే అవకాశం ఉంది, ఈశాన్య హిమాలయాలు, వాయువ్య హిమాలయాలు, పశ్చిమ కనుమలు, కొంకణ్ కొండలు, తూర్పు కనుమలు ఎక్కువగా ప్రభావితమవుతాయి. 2024లో, వయనాడ్ (కేరళ) గణనీయమైన కొండచరియల పతనాన్ని ఎదుర్కొంది, అయితే 2013 కేదార్‌నాథ్ (ఉత్తరాఖండ్) కొండచరియలు విరిగిపడటం వల్ల 5,700 మందికి పైగా మరణించారు. 2021లో భారీ వర్షం మరియు హిమానీనదం విస్ఫోటనం కారణంగా సంభవించిన చమోలి కొండచరియలు విరిగిపడటం వలన విస్తృతమైన వరదలు, మరణాలు సంభవించాయి. ఇలావుంటే, తీవ్రమైన వర్షపాతం సమయంలో లేదా వెంటనే నీటి మట్టాలలో ఆకస్మిక పెరుగుదలను ఆకస్మిక వరదలు లేదా ఫ్లాష్‌ఫ్లడ్స్ అంటారు. ఇది సాధారణంగా కొన్ని ప్రాంతాలకు మాత్రమే పరిమితమవుతాయి. స్వల్పకాలిక సంఘటనలు, సాధారణంగా వర్షపాతం జరిగిన 6 గంటలలోపు సంభవిస్తాయి. ఆకస్మిక వరదల ప్రమాదం ప్రధానంగా తీవ్రమైన వర్షపాతం వల్ల పెరుగుతుంది. ఇది నేల శోషణ సామర్థ్యం మరియు మురుగునీటి పారుదల వ్యవస్థలను అధిగమిస్తుంది. భారీ వర్షాలతో పాటు, ఆకస్మిక ఉష్ణోగ్రత పెరుగుదల, ఆనకట్ట లేదా కట్టలు తెగిపోవడం, మంచు లేదా శిథిలాల జామ్‌లు, హిమనదీయ సరస్సుల ఆకస్మిక విస్ఫోటనాల కారణంగా వేగంగా మంచు కరగడం వల్ల కూడా ఆకస్మిక వరదలు సంభవించవచ్చు. అదనంగా, రోడ్లు – భవనాలు వంటి అభేద్యమైన ఉపరితలాలతో పట్టణీకరణ ప్రవాహాన్ని పెంచుతుంది. నీటి శోషణను తగ్గిస్తుంది. వరద ప్రమాదాలను తీవ్రతరం చేస్తుంది. హిమాచల్ 2023, ఉత్తరాఖండ్ 2013, మరియు ముంబై 2005 లలో తీవ్రమైన వర్షం కారణంగా భారీ ప్రాణనష్టం, ఆస్తి నష్టం సంభవించాయి.



పంట వ్యర్థాల దహనాన్ని అరికట్టడానికి కొన్ని సాంకేతిక చర్యలు అత్యవసరం. హ్యాపీ సీడర్‌ను ఉపయోగించడంలో వీటిలో ప్రధానమైనది. గడ్డిని కోసేటప్పుడు, ఎత్తేటప్పుడు గోధుమలను నేరుగా వరి పొలాల్లోకి విత్తే ట్రాక్టర్‌మౌంటెడ్ పరికరం కావడంతో, కాల్చే అవసరాన్ని తొలగిస్తుంది. సమయాన్ని ఆదా చేస్తుంది. ఖర్చులను తగ్గిస్తుంది. నేల ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. అదే విధంగా పూసా డీకంపోజర్ అనేది వరి మొద్దును కంపోస్ట్‌గా కుళ్ళిపోయే సూక్ష్మ జీవుల సూత్రీకరణ. ఇది నేల సారాన్ని పెంచుతుంది. మొద్దులను కాల్చే అవసరాన్ని తగ్గిస్తుంది. అదే విధంగా పంట అవశేషాల పెల్లెటైజేషన్ కూడా రైతులకు ఉపయుక్తంగా ఉంటుంది. ఈ విధానంలో పంట అవశేషాలను శక్తి ఉత్పత్తికి ఉపయోగించే బయోమాస్ పెల్లెట్లుగా మారుస్తారు. ఇది గడ్డి దహనాన్ని తగ్గిస్తుంది. రైతులకు అదనపు ఆదాయాన్ని అందిస్తుంది. బయోచార్ ఉత్పత్తి విధానంలో పంట అవశేషాలను పైరోలైసిస్ ద్వారా బయోచార్‌గా మారుస్తారు. ఇది కూడా నేల సారవంతం, నీటి నిలుపుదల, సూక్ష్మ జీవుల కార్యకలాపాలను పెంచుతుంది. అదే సమయంలో కార్బన్ సీక్వెస్ట్రేషన్‌కు దోహదం చేస్తుంది.



## 'గౌతన్స్ మోడల్' అనుసరణీయం



ఛత్తీస్‌గఢ్ గౌతన్స్ మోడల్ అనేది కమ్యూనిటీ నేతృత్వంలోని ఒక కార్యక్రమం. ఇక్కడ గ్రామాలు పరలీ దాన్ ద్వారా ఐదు ఎకరాల భూమిని ఏర్పాటు చేసి, ఆవు పేడ, సహజ ఎంజైమ్‌లను ఉపయోగించి సేంద్రియ ఎరువుగా మారుస్తాయి. కస్టమ్ హైరింగ్ సెంటర్లు (సిహెచ్‌సిలు), యాంత్రీకరణ యాక్సెస్‌ను బలోపేతం చేయడం ఈ విధానంలో ఒక భాగం. బుకింగ్ యాప్‌లు మరియు GPSఎనేబుల్డ్ ఫ్లీట్ ట్రాకింగ్‌తో గ్రామ స్థాయిలో సుసంపన్నమైన సిహెచ్‌సిలను ఏర్పాటు చేస్తే ఉత్తమ ఫలితాలు అందుకోవచ్చు. అద్దె ఖర్చులకు సబ్సిడీ ఇవ్వడం, వాటిని పంట షెడ్యూల్‌లతో సమకాలీకరించడం, సొంత పరికరాలను కొనుగోలు చేయలేని చిన్న, సన్నకారు రైతులకు డిమాండ్ ఆధారిత యాంత్రీకరణను అందించడం వంటి చర్యలు కూడా అత్యవసరం. ఉమ్మడి టాస్క్ ఫోర్స్‌లను ఏర్పాటును పలు అధ్యయనాలు సూచిస్తున్నాయి. వాటి సూచనలను అనుసరించి, పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ వంటి రాష్ట్రాలలో వ్యవసాయం, పర్యావరణం, ఆరోగ్యం, గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖలతో కూడిన ఉమ్మడి టాస్క్ ఫోర్స్‌లను ఏర్పాటు చేయాలి. ఈ టాస్క్ ఫోర్సులు కాలుష్యాన్ని పరిష్కరించడానికి, కేంద్ర కాలుష్య ప్రణాళికలను స్థానిక వాస్తవాలతో సమలేఖనం చేయడానికి ఉమ్మడి జవాబుదారీతనంతో సమన్వయ ప్రయత్నాలను నిర్ధారించాలి. మొత్తం మీద భారతదేశంలో పంట వ్యర్థాలను తగలబెట్టడాన్ని నివారించడానికి వ్యవసాయ పనిముట్లకు సబ్సిడీ ఇవ్వడం, బయోమాస్ పవర్ ప్లాంట్లను అభివృద్ధి చేయడం, పంట అవశేషాల నుండి బయో ఇంధనాలు మరియు ఎరువులను ప్రోత్సహించడం వంటి ప్రత్యామ్నాయ పరిష్కారాలను ప్రోత్సహించడం అవసరం. పరిశోధనలను బలోపేతం చేయడం, అవశేషాల సేకరణ మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం, రైతు అవగాహనను పెంపొందించడం కూడా చాలా కీలకం.

## ఎర్రకోటపై ఎర్రజెండాను ఎగురవేయడమే కార్మికవర్గం ముఖ్యకర్తవ్యం: శివశంకర్




**ప్రజాపక్షం/కల్వకుర్తి :** పట్టణంలో డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లదగ్గర మేడే వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్ మాట్లాడుతూ జనరల్‌కాన్ ఫెడరేషన్ ఆఫ్‌లేబర్ 1895లో ఫ్రాన్స్‌లో ప్రారంభమైందన్నారు. 1905లో ట్రేడ్‌అండ్ యూనియన్‌గా ఏర్పడిందన్నారు. అమెరికా నగరం మే మార్కెట్లో 1886 మే 1న సమ్మె చేయాలని ప్రపంచ కార్మిక సంఘాల సమాఖ్య సోషలిస్టు కార్మిక సంఘాల సమ్మె మే మార్కెట్లో భారీప్రదర్శన 8గంటల పనికై కార్మికులు కదంతొక్కారన్నారు. కార్మికులపై పెట్టుబడిదారులువారి వారి గుండాలు పోలీసులు జరిపిన తుపాకి కాల్పుల్లో చనిపోయిన వారి రక్తంతో తడిసి ఎగిరేసిన అదే మన ఎర్రజెండా అన్నారు. కావున మే 1న అమరవీరుల మరణానికి శ్రద్ధాంజలి ఘటిస్తూ భారతదేశంలో పెట్టుబడిదారుల పాలనను అంతంచేసి ఎర్రకోటపై ఎర్రజెండాను ఎగురవేయడమే కార్మికవర్గం యొక్క ముఖ్య కర్తవ్యమని అన్నారు. కార్యక్రమంలో ఎఐటియుసి భవననిర్మాణ కార్మికసంఘం జిల్లా కోశాధికారి బీసంమైబు, పెయింటర్స్ , కార్మికులు తప్పెట రామస్వామి, నర్సింహ్మా, రమేష్, కమాల్, సత్యం పాల్గొన్నారు.

## కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నూతనంగా ఎన్నికైన పిట్టల సమ్మయ్యకు సన్మానం

సిపిఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి

**ప్రజాపక్షం/శంకరపట్నం :** ప్రభుత్వం బిల్డింగ్ వర్కర్స్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిపిఐ జిల్లా కార్యర్శి మర్రి వెంకటస్వామి డిమాండ్ చేశారు. శంకరపట్నం మండలం సిపిఐ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మండల సిపిఐ కార్యదర్శితో పాటు ఇటీవలే బిల్డింగ్ కన్స్‌స్ట్రక్షన్స్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన పిట్టల సమ్మయ్యను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా మర్రి వెంకటస్వామి మాట్లాడుతూ బిల్డింగ్ కార్మికులను ప్రభుత్వం గుర్తించి అర్హులైన ప్రతి కార్మికునికి ఇందిరమ్మ ఇండ్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. వరి కొనుగోలు కేంద్రంలో రైతులను ప్రభుత్వం రెండు కిలోల తరుగు పేరుతో మోసం చేస్తుందని, వెంటనే తరుగు లేకుండా రైతుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. మార్చిలో రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లో జరిగిన ఆ సంఘం రాష్ట్ర నాలుగో మహాసభలో పిట్టల సమ్మయ్య ప్రతిభను గుర్తించి బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నుకున్నారు. భవిష్యత్తు కాలంలో అంకితభావంతో కార్మిక, కర్షకుల ఐక్యత బలోపేతం చేసి మరింతగా వారి హక్కుల సాధనకు కృషి చేయాలన్నారు. రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన సమ్మయ్య మాట్లాడుతూ తనపై విశ్వాసం ఉంచి బాధ్యతను అప్పగించిన సిపిఐ జిల్లా రాష్ట్ర నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. సంఘ బలోపేతానికి అంకితభావంతో నిర్విరామంగా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి కన్నం సదానందం, నాయకులు గోదారి లక్ష్మణ్, ఎండి ఖాజా పాషా, ఎండి షాకీర్, ఎండి పాషా తదితరులున్నారు.




## పహల్గామ్ ఉగ్రదాడి అమానవీయం

- అమాయక ప్రజలపై జరిగిన పాశవిక దాడిని ముక్తకంఠంతో ఖండించాలి
- జమ్ముకశ్మీర్ ప్రజలకు భారత పౌరసమాజం అండగా ఉంటుంది
- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా




**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** జమ్ముకశ్మీర్ పహల్గామ్ యాత్రికులపై ఉగ్రవాదులు జరిగిన పాశవిక, పైశాచిక దాడి, మారణహోమం అమానవీయమని, ఈ దాడిని భారత కమ్యూనిస్టు పార్టీ కండిస్తుందని పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా అన్నారు. పట్టణ పరిధిలోని రామవరం ఆటో అడ్డాలో జరిగిన కార్మికుల సమావేశం సందర్భంగా ఉగ్రదాడిలో మృతి చెందినవారికి నివాళులర్పిస్తూ మౌనం పాటించారు. అనంతరం జరిగిన సమావేశంలో సాబీర్ పాషా మాట్లాడుతూ ఉగ్రవాదులు దేశపౌరులపై కాల్పులు జరిపి హత్య చేయడం అనాగరిక చర్యని ఈ దాడిని యావత్ భారత పౌరసమాజం ముక్తకంఠంతో ఖండించాలన్నారు. ఉగ్రవాదులు కేవలం హిందువులని లక్ష్యంగా చేసుకొని కాల్చి చంపడం దేశంలో మతసామరస్యాన్ని దెబ్బతీసేందుకేనని స్పష్టమవుతోందని, ఇది ముమ్మాటికీ పిరికిపంద చర్యేనని స్పష్టం చేశారు. హిందూ, ముస్లింల మధ్య చిచ్చు రేపి దేశ సమైక్యతను దెబ్బతీసేందుకు పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు ఇలాంటి దుచర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. దేశంలో కొందరు హిందూ మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ పబ్బంగడుపుకుంటుంటే ఉగ్రవాదులు దాన్ని ఆసరాగా చేసుకొని మత చిచ్చు పెడుతున్నారన్నారు. కొద్ది రోజులక్రితం పాక్ ఆర్మీచీఎఫ్ అదేవిధంగా ఉగ్ర లష్కరే తోయిబా చీఫ్ కమాండర్ పరోక్షంగా హెచ్చరించినా కేంద్రం నిర్లక్ష్యం చేయడం వల్ల ఉగ్రదాడి జరిగిందని ఆరోపించారు. జరిగిన ఉగ్రదాడి ఇంటిలిజెన్స్ వైఫల్యమా, భద్రతా సిబ్బంది నిర్లక్ష్యమా కేంద్రమే తేల్చుకొని భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఆటో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, డిమాండ్లు, మేడే ఉత్సవాలపై చర్చించారు. సమావేశంలో ఆటో వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు కంచర్ల జమలయ్య, మర్రి కృష్ణ, జలీల్, శ్రీనివాస్, హాబీబి, రాఫ్య్, ఆనందరావు, జంజర్ల శివ, బాషా, నాగుల్ మీరా, గుబ్బల శ్రీను, యూసుఫ్, జానీ, రవీందర్, సలీం, జిలాని, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్న బిజెపి ప్రభుత్వం

నియోజకవర్గ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి




**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి :** రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తూ భారత రాజ్యాంగ మూలసూత్రాలకు విఘాతం కలిగిస్తున్న కేంద్ర బిజెపి ప్రభుత్వంపై ఉద్యమించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి పిలుపునిచ్చారు. మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో డోర్నకల్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం బి.ప్రభేష్ అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా ఆయన ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడుతూ గత 11సంవత్సరాలుగా పాలన చేస్తున్న బిజెపి భారత రాజ్యాంగ వ్యవస్థలను చిన్నా భిన్నం చేస్తూ మత విద్వేషాలను రెచ్చగొడుతూ క్లారిటీ వర్గాలపై విచ్చలవిడిగా దాడులు చేస్తూ రాజ్యాంగంలో కల్పించిన అవకావాలను తుంగలో తొక్కి లౌకిక వ్యవస్థకు గొడ్డలిపెట్టుగా మారిన బిజెపి పాలనపై ప్రజాస్వామిక శక్తులు ఏకమై ప్రతిఘటించాలని కోరారు. మేనెలలో శాఖ మండల మహాసభలు నిర్వహించాలని కార్యకర్తలకు ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆత్మ చైర్మన్‌గా నియామకమైన నల్లుసుధాకర్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. ప్రభుత్వ విఫ్ డాక్టర్ రాంచంద్రునాయక్ మరిపెడ డివిజన్ ఆత్మ చైర్మన్‌గా నల్లు సుధాకర్‌రెడ్డిని ఎంపిక చేయడం పట్ల సిపిఐ జిల్లా పార్టీ హర్షం వ్యక్తం చేసింది. ఈ సమావేశంలో సిపిఐ జిల్లాకార్యవర్గ సభ్యులు నెల్లూరు నాగేశ్వరావు, కురవి, మరిపెడ డోర్నకల్, దంతాలపల్లి మండల కార్యదర్శులు కరణం రాజన్న,మారగాని బాలకృష్ణ, తురకరమేష్, పోలెపాక వెంకన్న, నాయకులుబుర్రసమ్మయ్య,బుడను వెంకన్న, దొంతు రాంమూర్తి, తురక రమేష్, నర్సింగం గురవయ్య, బసవ కొమరయ్య, బొల్లం ఉప్పలయ్య, నాగరాజు,వెంకన్న, సారయ్య,వెంకన్న, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## సుదీర్ఘమైన ఘనచరిత్ర కలిగిన పార్టీ సిపిఐ

రాజన్న సిరిసిల్లా జిల్లా సిపిఐ ప్రధాన కార్యదర్శి గుంటి వేణు

**ప్రజాపక్షం / వేములవాడ :** సిపిఐ పార్టీ శాఖల మహాసభ వేములవాడ స్థానిక మహాలక్ష్మి వీధిలోని గుమ్మిపుల్లయ్య భవన్‌లో గురువారం నిర్వహించారు. సిపిఐ పార్టీ సీనియర్ నాయకులు కే.వి.అనసూర్య, సిపిఐ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సిరిసిల్లా జిల్లా సిపిఐ ప్రధాన కార్యదర్శి గుంటి వేణు హాజరయ్యారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ సిపిఐ 100 సంవత్సరాల సుదీర్ఘమైన గణ చరిత్ర కలిగిందని భూమికోసం భుక్తి కోసం తెలంగాణ విముక్తి కోసం పోరాటాలు చేసిందని, దేశ స్వతంత్ర పోరాటంలో సైతం ఎనలేని పోరాటాలు కమ్యూనిస్టు పార్టీవేనని వేములవాడ ప్రాంతంలో కొండం చెరువు, బూడిది కుంట, పల్లగుట్ట తదితర ప్రాంతాల్లో ఇచ్చిన భూములను బ్లాక్ లిస్టులో పెట్టి లాక్కున్నారని పోడు వ్యవసాయం చేస్తున్న రైతులను కొట్టి కేసులు పెట్టారని కేసులు ఎత్తివేసి పోడు దారులకు పట్టాలు ఇవ్వాలన్నారు. రాబోయే రోజుల్లో వార్డు, గ్రామ సర్పంచ్, కౌన్సిలర్ లాంటి ఎన్నికల్లో సిపిఐ పార్టీ పోటీలో ఉంటుందని సిపిఐ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇంచార్జ్ కడారి రాములు అన్నారు. సిపిఐ పార్టీ పేదలు, కార్మికులు, కర్షకులు అందరి కోసం హక్కుల కోసం పోరాడుతుందని ప్రజలు పార్టీని ఆదరించి రాబోయే రోజుల్లో సిపిఐ పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలని ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వేములవాడ పట్టణ సిపిఐ పార్టీ కార్యదర్శి గాజుల పోశెట్టి, అజ్జ వేణు, శ్రీరాముల నర్సయ్య, రూరల్ మండలం వేములవాడ కార్యదర్శి ఎల్ల దేవరాజు, కోకాపెల్లి శాంత, శేఖర్, పెంట మల్లయ్య, పెంట రాజేష్, పెంబర్ రాజు, నరేష్, తదితర సిపిఐ నాయకులు పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక హక్కులను హరిస్తున్న కేంద్ర ప్రభుత్వం

ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు




**ప్రజాపక్షం/ మంచిర్యాల :** 139వ మేడే వేడుకలను కార్మిక వర్గం విజయవంతంగా నిర్వహించాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు పిలుపునిచ్చారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో ఎఐటియుసి జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం జిల్లా ఉపాధ్యక్షులు మిట్టపల్లి పౌలు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మేడే పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం మేకల దాసు మాట్లాడుతూ బ్రిటీష్ కాలం నుండి కార్మికులు సాధించుకున్న హక్కులను కేంద్రం అధికారంలో ఉన్న ప్రభుత్వం చట్ట సవరణ ద్వారా నిర్వీర్యం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. 44 కార్మిక కార్మిక చట్టాలను 4 కోడ్‌లుగా విభజించి కార్మికులకు హక్కులు లేకుండా, కార్పొరేట్లకు అనుకూలంగా చట్టాలను సవరిస్తుండటాన్ని కార్మిక వర్గం తీవ్రంగా వ్యతిరేకిస్తోందని ఆయన స్పష్టం చేశారు. 44 కార్మిక చట్టాలను యథావిధిగా కొనసాగించాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, స్కీమ్ వర్కర్లను క్రమబద్ధీకరించాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కనీస వేతనం రూ. 26,000 నిర్ణయించాలని ఆయన కోరారు. పరిశ్రమల అమ్మకాన్ని ఆపాలని, ప్రభుత్వ రంగ పరిశ్రమలన్నింటిని ప్రభుత్వ ఆధీనంలోనే నిర్వహించాలని ఆయన అన్నారు. ఈ సమావేశంలో ఇటీవల జమ్ముకాశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదుల దాడిలో మరణించిన వారికి సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కలిందర్ అలీ ఖాన్, దాగం మల్లేష్, తోకల సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.

## మేడే పోస్టర్ విడుదల

**ప్రజాపక్షం/హనుమకొండ :** హనుమకొండ జిల్లా బాలసముద్రంలోని ఎఐటియుసి జిల్లా కార్యాలయంలో మేడే వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎఐటియుసి హనుమకొండ జిల్లా అధ్యక్ష ,ప్రధాన కార్యదర్శి వేల్పుల సారంగపాణి, జక్క రాజ్ గౌడ్ మాట్లాడుతూ మే 1న అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా కార్మికుల హక్కులు వారి సమస్యల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. అమెరికాలో 1886లో మే 1న సమ్మె చేయాలని ప్రపంచ కార్మిక సంఘాల సమాఖ్య సోషలిస్టు కార్మిక సంఘాలు సమ్మె చేపట్టి మే మార్కెట్లో భారీ ప్రదర్శనతో 8 గంటల పనికై కదం తొక్కారన్నారు. మేడే ను హనుమకొండ జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో, అన్ని గ్రామీణ కేంద్రాలలో నిర్వహించి ఎర్రజెండాను ఎగరవేసి ప్రపంచ కార్మికుల పోరాట దినంగా జరుపుకోవాలని, దానికి కార్మికులందరూ ఒకటై జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి హనుమకొండ జిల్లా అధ్యక్షులు వేల్పుల సారంగపాణి ,ప్రధాన కార్యదర్శి జక్కు రాజ్ గౌడ్, సిపిఐ నాయకులు మద్దెల ఎల్లేష్ , మున్సిపల్ వర్కర్స్ యూనియన్ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏల్పుల ధర్మరాజు , సహాయ కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా, ఉపాధ్యక్షులు లంక దాసరి అశోక్, ఉపాధ్యక్షులు మాలోతి శంకర్ నాయక్ , సహాయ కార్యదర్శిలు బత్తిని సదానందం, గుంటి రాజేందర్, ఏలియా, ఎల్ల స్వామి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.





# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి..



ప్రజాపక్షం/యాచారం : రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఇబ్రహీం పట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి అన్నారు. గురువారం యాచారం మండల పరిధిలోని నందివనపర్తి, చింత పట్ల, మంథనగౌరెల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన మల్‌రెడ్డి అభిషేక్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. రైతులను ఆదుకో వడానికే ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను పెట్టిందన్నారు. ప్రైవేటు వ్యక్తులకు ధాన్యం అమ్మి అప్పుల పాలు కావద్దని అన్నారు. వరి పంట ఏ గ్రేడ్ క్వింటాలుకు 2320 రూపాయలు , సాధారణ రకంకు 2300 రూపాయలు , సన్న వడ్లకు అధనంగా 500 రూపాయలు క్వింటాకు ఇవ్వడం జరుగుతుందని అన్నారు.

## భూగర్భ డ్రైనేజీ పనులు త్వరగా ప్రారంభించాలి : నవ జీవన్‌రెడ్డి



ప్రజాపక్షం/ఎల్బీనగర్ : రాబోయే కాలంలో కాలనీ వాసులకు ఇబ్బందులు లేకుండా భూగర్భ డ్రైనేజీ ట్రంక్ లైన్ పనులు త్వరగా ప్రారంభించాలని హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కల్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. గురువారం డివిజన్‌లోని బ్యాంక్ కాలనీ, కమర్షియల్ టాక్స్ కాలనీ మీదుగా, గ్రీన్ ఫుడ్ కాలనీ వరకు జరుగుతున్న నూతన భూగర్భ డ్రైనేజీ ట్రంక్ లైన్ పనులను జలమండలి అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి మాట్లాడుతూ భూగర్భ డ్రైనేజీ ట్రంక్ లైన్ నిర్మాణంలో కాలనీ వాసులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా లెవెల్స్ సరి చూసుకుంటూ భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణం చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. అభివృద్ధి పనులకు కాలనీ సంక్షేమ సంఘాలు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జలమండలి జనరల్ మేనేజర్ రాజు, సూపర్‌వైజర్ బాబు, బ్లడ్ బ్యాంక్ కాలనీ అధ్యక్షులు నర్సింహ, కమర్షియల్ టాక్స్ కాలనీ సభ్యులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పర్యాటకులపై దాడి పిరికి పందల చర్య



ప్రజాపక్షం/సరూర్‌నగర్ : ఉగ్రవాదులు పర్యాటకులపై చేసిన దాడిని పిరికి పందల చర్యగా రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం రాత్రి మహేశ్వరం నియోజకవర్గం పరిధిలోని ఆర్‌కెపురం డివిజన్‌లో వాసవికాలనీలో జమ్మూకాశ్మీర్‌లోని పహల్గావ్‌లో ఉగ్రవాద దాడిలో అసువులు బాసిన పర్యాటకుల ఆత్మలకు శాంతి చేకూరాలని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చిలుక ఉపేందర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ ఉగ్రవాదులు పర్యాటకులపై చేసిన దానిని పిరికి పందల చర్యగా అభివర్ణించారు.ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## దోషులను కఠినంగా శిక్షించాలి

ప్రజాపక్షం/సరూర్‌నగర్ : దేశ భద్రతకు భంగం కలిగించే ఇటువంటి అఘాయిత్యాలపై కేంద్ర ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకోవాలని, దోషులను కఠినంగా శిక్షించాల్సిన అవసరం ఉందని మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడు అరకల కామేష్‌రెడ్డి అన్నారు. గురువారం మీర్‌పేటలో బిఆర్‌ఎస్ నాయకులు కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన అమనూష ఉగ్రదాడిని తీవ్రంగా ఖండిస్తూ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కామేష్‌రెడ్డి మాట్లాడుతూ ఈ దాడి 25 మంది అమాయకులు ఉగ్రవాదుల చేతుల్లో ప్రాణాలు కోల్పోయిన ఘటన ప్రజాస్వామ్యానికి మచ్చలేకుండా చేసిన చర్యగా ఆవేదన వ్యక్తం చేశారు. అమరులైన వారికి ఘనంగా నివాళులు అర్పిస్తూ, వారి ఆత్మలకు శాంతి చూకూరాలని నాయకులతో కలిసి ఆయన ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో అర్కల భూపాల్‌రెడ్డి, దిండు భూపేష్‌గౌడ్, శీనునాయక్, దీప్లాన్‌చౌహాన్, సునిత బాల్‌రాజ్, యాదిరెడ్డి, సిద్దాల బీరప్ప, రమేష్, యాదగిరి, చారి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడల్లో గెలుపు, ఓటములను సమానంగా భావిస్తే విజయాలు

ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి



ప్రజాపక్షం/నందిగామ: క్రీడల్లో గెలుపు, ఓటములను సమానంగా భావిస్తే విజయాలు వెన్నంటే ఉంటాయని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం నందిగామ మండలం మామిడిపల్లి గ్రామంలో ఎంపిఎల్9 క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి హాజరై విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. విజేత టీం మామిడిపల్లికి రూ.30వేలు, రన్నర్ టీం మొదళ్ళగూడకు రూ.20వేల నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు, ఓటములను సమానంగా భావిస్తే భవిష్యత్ బంగారు మయంగా ఉండటంతోపాటు విజయాలు వరిస్తాయన్నారు. క్రీడలతో స్నేహ సంబందాలు పెరుగుతాయని, గ్రామీణ క్రీడలను యువత సద్వినియోగం చేసుకోవాలని ఆకాంక్షించారు. గ్రామీణ స్థాయి నుండే రాష్ట్ర స్థాయికి చేరుకునే అవకాశం ఉంటుందని, వచ్చిన అవకాశాలను యువత అందిపుచ్చుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి కట్నా మాధవి రవీందర్, మాజీ ఉప సర్పంచులు సత్యనారాయణ, హన్మంత్‌రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ యాదగిరిరెడ్డి, మాజీ వార్డు సభ్యులు రఘుపతిరెడ్డి, వెంకటేష్‌రెడ్డి, ప్రభు, నేతలు ప్రతాప్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, జ్ఞానేశ్వర్, మోయినోద్దీన్, కుమ్మరి క్రిష్ణయ్య, పురుషోత్తంరెడ్డి, అశ్రప్, వినోద్, రాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఆంజనేయులు గౌడ్, ప్రభాకర్‌రెడ్డి, జగన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, మధు, సతిరెడ్డి, రాజు, మనోహార్, శ్రీకాంత్‌లు పాల్గొన్నారు.

## మాల్ గ్రామ పంచాయతీకి ఆత్మనిర్బర్ పంచాయతీ స్పెషల్ అవార్డు



ప్రజాపక్షం/యాచారం : యాచారం మండల పరిధిలోని మాల్ గ్రామ పంచాయతికి ఆత్మనిర్బర్ పంచాయతి స్పెషల్ అవార్డుకు ఎంపిక అయ్యింది. గురువారం దేశ ప్రధానమంత్రి నరేంద మోదీ చేతుల మీదుగా స్పెషల్ అవార్డుతో పాటు కోటి రూపాయల నగదు పురస్కారంను మాల్ పంచాయతీకార్యదర్శి రాజు అందుకున్నారు. బిహార్ రాష్ట్రంలోని మధుబనిలో అవార్డును ప్రధానోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎంపిడిఓ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ మాల్ గ్రామ పంచాయతికి అవార్డు రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. మాల్ గ్రామ పంచాయతి పరిధిలో చేసిన అభివృద్ధిని చూసి ఈ వార్డును ప్రధానం చేశారన్నారు. అధికారులందరి కృషి ఫలితమే ఈ అవార్డు అని అన్నారు. ఇదే స్పూర్తితో ముందుకు సాగుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిఓ శ్రీలత, పంచాయతి కార్యదర్శి రాజు , జిల్లా అధికారులు తదితరులు పాల్గోన్నారు.

# సమసమాజ స్థాపనే సిపిఐ లక్ష్యం

సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య



ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి: సమసమాజ స్థాపనే భారత కమ్యూనిస్టు పార్టీ లక్ష్యమని సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అన్నారు. గురువారం చేవెళ్ల మండలం కందవాడ గ్రామంలో భారత కమ్యూనిస్టు పార్టీ గ్రామ శాఖ మహాసభ గ్రామ శాఖ కార్యదర్శి నీలని ఎలిషా అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా సిపిఐ కార్యదర్శి పాలమాకుల జంగయ్య హాజరయ్యారు. ముందుగా కాశ్మీర్‌లో టూరిస్టులపై పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదిలో మృతులకు సంతాప సూచికంగా రెండు నిమిషాలు మౌనం పాటించింది నివాళులర్పించారు.అనంతరం కార్యకర్తలను ఉద్దేశించి సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య మాట్లాడుతూ దేశంలో రోజురోజుకు ఆర్థిక సమానతలు పెరిగిపోతున్నాయని, కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అంబానీ, ఆదానీలకు ఊడిగం చేస్తూ దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచి పెడుతుందని మండిపడ్డారు.దేశంలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మైనారిటీలు, దళితులపై దాడులు పెరిగాయని, నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటాయన్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గుతుంటే భారతదేశంలో మాత్రం దానికి భిన్నంగా పెట్రోల్, డీజిల్,గ్యాస్ ధరలు పెంచడం దుర్మార్గమన్నారు.ప్రజల కొనుగోలు శక్తి రోజు రోజు కు తగ్గుతున్నదని, దేశంలో నిరుద్యోగం పెరిగిపోతుందని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలని,లేదంటే ప్రజా పోరాటాలను ఉధృతం చేస్తామని జంగయ్య హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు రామస్వామి, ఏఐటియుసి జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ,మండల పార్టీ కార్యదర్శి ఎం సత్తిరెడ్డి, మహిళా సమాఖ్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్ల మంజుల, తదితరులు పాల్గొన్నారు.

### గ్రామ శాఖ నూతన కార్యదర్శిగా నీలని ఎలిషా

మహాసభ అనంతరం గ్రామ శాఖ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. గ్రామ కార్యదర్శిగా నీలని ఎలిషా, సహాయ కార్యదర్శులుగా రాయిని యాదయ్య, ఎర్ర బీరప్ప, సభ్యులుగాఎర్ర యాదయ్య,బుచ్చయ్య, భాగ్యమ్మ,యాదమ్మ,రఘు సుధాకర్ గౌడ్,మల్లేష్,నర్సింహులు,సత్తయ్య,కృష్ణ,అంజయ్య,మల్లయ్య,గోపాల్ లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.

## నేడు రేపు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించాలి

పార్టీ శ్రేణులకు సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య పిలుపు

ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి: జమ్మూ కాశ్మీర్ పహల్గామ్ పర్యటనకు వచ్చిన టూరిస్టులపై దాడి చేసిన పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదుల అమానుష మారణకాండకు నిరసనగా సిపిఐ శ్రేణులు నేడు, రేపు జిల్లా వ్యాప్తంగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించాలని సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య పిలుపునిచ్చారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ టూరిస్టులపై పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదుల దాడిలో 30 మంది మరణించడం అత్యంత బాధాకరమన్నారు. 30 మంది పర్యాటకుల్ని ఉగ్రవాదులు కాల్చి చంపడాన్ని ఆయన అమానవీయ చర్యగా అభివర్ణించారు. ఈ దాడి సమాజానికి,దేశానికి సవాలుగా మారిందని పేర్కొన్నారు. కాశ్మీర్ ప్రాంతంలో టూరిస్టులపై జరిగిన ఉగ్రదాడిని సిపిఐ తీవ్రంగా ఖండిస్తుందని తెలిపారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని పాలమాకుల జంగయ్య డిమాండ్ చేశారు.

## రాయితీతో ఎల్ఆర్ఎస్‌కు చివరి అవకాశం

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి



ప్రజాపక్ష/రంగారెడ్డి ప్రతినిధి: ఎల్ఆర్ఎస్‌తో ప్రభుత్వం అందిస్తున్న అవకాశాన్ని చేజార్చుకోవద్దని, ఇట్టి అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని, అనధికార లేఔట్ల క్రమబద్ధీకరణకు ఇంతకంటే అవకాశం మరొకటి ఉండదని, ఈ నెల30లోగా చేసుకుంటే 25 శాతం రాయితీ వర్తిస్తుందని భూ యజమానులకు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సూచించారు.బుధవారం కలెక్టర్ సి.నారాయణ రెడ్డి ఎల్ఆర్ఎస్‌కు సమర్పించిన ఎల్1, ఎల్2,ఎల్3 దరఖాస్తులపై సంబంధిత అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అనధికార లేఔట్ల క్రమబద్ధీకరణకు, ప్లాట్ల రెగ్యులరైజేషన్‌కు రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన ఎల్ఆర్ఎస్ 25 శాతం రాయితీ అవకాశాన్ని జిల్లాలోని అర్హులైన వారందరూ నిర్ణీత గడువు లోగా సద్వినియోగం చేసుకునే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ నెల 30వ తేదీ నాటికి ఎల్ఆర్ఎస్ రాయితీ గడువు ముగుస్తున్నందున త్వరపడాలన్నారు. గడువు పొడిగించే అవకాశం లేకపోవచ్చునని,మళ్లీ ఇటువంటి అవకాశాలు రావని,భూ యజమానుదారులు ప్రభుత్వం కల్పించిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఎల్ఆర్ఎస్ ప్రక్రియను సులభతరం చేసేందుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించిందని మరోసారి గుర్తు చేశారు. ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్న అందరికీ రె గ్యులరైజేషన్ రుసుము నిర్ణయించడం జరిగిందన్నారు. ఫీజు చెల్లించేందుకు అర్హత ఉన్న ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులు ఈ నెల 30వ తేదీలోగా నిర్ణీత రుసుము చెల్లిస్తే 25 శాతం రిబేటు వర్తిస్తుందని జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. రుసు ము చెల్లించిన వారి దరఖాస్తును అధికారులు పరిశీలించి, సత్వరమే అనుమతి మంజూరు చేస్తారని ఆయన పేర్కొన్నారు. అనధికారికంగా లేఅవుట్లు చేసి, అందులో 10 శాతం ప్లాట్లను విక్రయించిన వారికి మిగతా ప్లాట్లను క్రమబద్ధీకరించుకునే అవకాశం ఉందని కలెక్టర్ చెప్పారు.ప్లాట్ రిజిస్ట్రేషన్ సమయంలో కూడా ఎల్.ఆర్.ఎస్. రుసుము చెల్లించి క్రమబద్ధీకరణ చేసుకోవచ్చని తెలిపారు. క్ర మబద్ధీకరించని భూములలో ఎటువంటి రిజిస్ట్రేషన్లకు, నిర్మాణాలకు అనుమతి మంజూరు చేయడం జరగదని స్పష్టం చేశారు. అందుచేత అర్హులైన వారందరు ఏప్రిల్ 30వ తేదీ లోపు క్రమబద్ధీకరణ చేసుకోవాలని,ప్రభుత్వం కల్పించిన రాయితీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇప్పటికే ఈ గడువు మార్చి 31తో ముగియగా,ప్రభుత్వం ఏప్రిల్ 30 వరకు గడువు పొడిగించిందని అన్నారు.రాయితీ వర్తింపునకు ఇదే చివరి అవకాశం అని జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి స్పష్టం చేశారు.

## భూ భారతితోనే భూ సమస్యలు పరిష్కారం

చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య




ప్రజాపక్షం/షాబాద్ : భూ భారతి చట్టంతో భూ సమస్యలు శాశ్వత పరిష్కారం అవుతాయని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. గురువారం షాబాద్ స్టార్ గార్డెన్‌లో భూభారతి చట్టంపై జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బిఆర్ఎస్ ప్రభుత్వ హయంలో ధరణి ద్వారా రైతులకు అనేక కష్టలు, నష్టలు జరగడంతో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే ధరణిని బంగాళఖాతంలో వేస్తాన్నని ఇచ్చిన మాట నేడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిలబెట్టుకున్నాడని కొనియాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు మాట ఇస్తే ఖచితంగా అమలు చేస్తుందన్నారు.గ్రామ పంచాయతీలోనే రెవెన్యూ సదస్సులు నిర్వహించి శాశ్వతంగా భూ సమస్యలు పరిష్కరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మెన్ ఎలుగంటి మధుసుదన్ రెడ్డి, మార్కెట్ చైర్మెన్ పీసరి సురేందర్ రెడ్డి, గుడిమల్కాపూర్ వైజ్ చైర్మెన్ చంద్రశేఖర్ ముదిరాజ్, ఆర్డీఓ చంద్రకళ, తహాశీల్దార్ అన్వర్, డిప్యూటి తహాశీల్దార్ మధు, సీనియర్ అస్సిస్టెట్ కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

## భూ భారతితోనే ప్రజలకు మేలు

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి




ప్రజాపక్షం/గండిపేట: భూ భారతితోనే ప్రజల కు మేలు జరుగుతుందని అవగాహన సదస్సులో కలెక్టర్ అన్నారు. భూ భారతిలో భూములను నిషేధంలో లేకుండా ప్రభుత్వం చూస్తుందని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు రాజేంద్రనగర్ నియోజకవర్గం గండిపేట మండలంలోని ఖానాపూర్ రైతు వేదికలో గురువారం స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌తో కలిసి భూభారతి అవగాహన సదస్సులో ఆయన కొత్త ఆర్ఓఆర్ చట్టంపై కలెక్టర్ అవగాహన సదస్సులో మాట్లాడుతూ రైతులకు తమ భూముల విషయంలో ఉన్న అభద్రత భావానికి చావు లేకుండా జవాబుదారి తనని పెంచేందుకు భూ భారతి నూతన చట్టాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు కొత్త చట్టం ద్వారా లావాదేవీల సేవలు రిజిస్ట్రేషన్ మోటివేషన్ ఒఆర్ఓ మార్పులు చేర్పులు సాదా బైనమా వంటి సేవలు సులువు తరం అవుతాయని తెలిపారు ప్రభుత్వం ప్రజలకు సరళంగా ఉండే విధంగా గ్రామీణ ప్రజల రైతుల సమస్యల పరిష్కారం అయ్యే విధంగా భూభారతి రూపొందించారని తెలిపారు గ్రామాలలో భూ సమస్య ఉంటే గ్రామ పెద్దలు కూర్చొని ఆ భూమి గురించి తెలిసిన వారు ఉండి మాట్లాడుకొని సమస్యను అధికారుల వద్దకు తీసుకువచ్చి పరిష్కరించుకోవచ్చని ఆయన అన్నారు. ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజల పక్షపాతి రైతుల గురించి ఆలోచన చేసి భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చి రైతులకు భూ సమస్యలు లేకుండా ఏదైనా సమస్య ఉంటే వెంటనే పరిష్కరించే విధంగా చట్టాలను తీసుకువచ్చారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ చైర్మన్ మల్లేష్, నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ వేణు గౌడ్, మాజీ కౌన్సిలర్ అమరేందర్ రెడ్డి, గంగయ్య, ఆర్డీవో వెంకటరెడ్డి, తాసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి,, సీనియర్ నాయకులు నరసింహ, పొన్న రమేష్ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఉగ్రవాదులను అంతమొందించాలి : సిపిఐ




ప్రజాపక్షం/ తుర్కయంజాల్: కాశ్మీర్‌లోని పహల్గంలో విచక్షణా రహితంగా పర్యాటకులపై బుల్లెట్లతో దాడులు చేసిన పాకిస్థాన్ ప్రేరేపిత లస్కరే తోయిబా ఉగ్రవాదులను అంతమొందించాలని డిమాండ్ చేస్తూ గురువారం సిపిఐ పార్టీ తుర్కయంజల్ మున్సిపాలిటి సమితి ఆధ్వర్యంలో ఘటనలో మరణించిన పౌరులకు తుర్కయాంజల్ కూడలిలో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఓరుగంటి యాదయ్య, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి శివ కుమార్ గౌడ్‌లు మాట్లాడుతూ సామాన్య పౌరులపై ఉగ్రవాదులు దాడు లు హేయమైన చర్య అని వారు అన్నారు. ప్రశాంతంగా ఉన్న కాశ్మీర్‌లో అలజడి సృష్టించడమే పాక్ ప్రధాన ఉదేశ్యమని, ఉగ్రవాదాన్ని కట్టడి చేయడంలో కేంద్రం ప్రభుత్వం విఫలం చెందిందని వారు ధ్వజమెత్తారు. కాశ్మీర్‌లో పర్యాటకులను కిరాతకంగా చంపిన జిహాదీ పాక్ ప్రేరేపిత లస్కరే తోయిబా ఉగ్రవాదులను గుర్తించి అంతమొందించాలని డిమాండ్ చేశా రు. అదేవిధంగా పౌరులపై జరిగిన ఉగ్రదాడులను చూస్తే 370 ఆర్టికల్ రద్దు చేస్తే కాశ్మీర్‌లో ప్రశాంత వాతావరణం ఉం టుందన్న దేశ ప్రధాని నరేంద్ర మోడీ వ్యాఖ్యలు ఏమయ్యాయ ని వారు ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వ భద్రతా వైఫల్యం, ఇం టెలిజెన్స్, ఆర్ఎడబ్ల్యూ విభాగాల వైఫల్యాల నిర్లక్ష్యమే కారణమని నమ్మాల్సిన పరిస్థితి ఉందని వారు వాపోయారు. ఇండియన్ ఆర్మీలో సైనికుల రిక్రూట్మెంట్ భర్తీని గత నాలుగు సంవత్సరాలుగా ఆపివేశారని ఈ కారణంగానే భద్రతా వ్యవస్థ కుంటుపడిందన్నారు. ప్రస్తుతము అమెరికా ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ భారతదేశంలో పర్యటన జరుపుతున్న ఈ సందర్భంలో ఇలాంటి అమాయకుల పైన దాడి చేసి కాశ్మీర్ సమస్యను అం తర్జాతీయ సమస్యగా చేయాలని కుట్రలో భాగమే ఈ దాడి అని వారు అన్నారు. భయాన్ని వ్యాప్తి చేయడానికి మరియు శాంతిని దెబ్బతీసేందుకు ఉద్దేశించిన చర్య అని, మన దేశం యొక్క లౌకిక వాదాన్ని బలోపేతం చేయడానికి, శాంతి, న్యా యం, సహజీవనం యొక్క సూత్రాలను కాపాడుకోవడానికి మనం కలిసి ఉండాలని వారు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమం లో ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి శ్రీకాంత్, సిపిఐ నా యకులు భాస్కర్, డి.ప్రసాద్, సురేష్, జంగయ్య, యాదయ్య, రామ్ సింగ్, హనుమంత్ నాయక్, శివ తదితరులు పాల్గొన్నారు


## షాద్‌నగర్ సీనియర్ సివిల్ జడ్జిగా బాధ్యతలు స్వీకరించిన స్వాతిరెడ్డి



ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్: షాద్‌నగర్ సీనియర్ సివిల్ జడ్జిగా స్వాతిరెడ్డి బాధ్యతలు స్వీకరించా రు. గురువారం స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వేణుగోపాల్ నర్వ ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. జడ్జి స్వాతిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించడంతో పాటు శాలువాతో ఘనంగా సత్కరించినట్లు బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గుండుబావి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

## ప్రియుడితో కలిసి భర్తను హత్యచేసిన భార్య

వివరాలు వెల్లడించిన షాద్‌నగర్ ఏసిపి రంగస్వామి



ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్: వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్నాడనే నేపంతో ప్రియుడితో కలిసి భర్తను దారుణంగా భార్య హత్య చేసిన సంఘటన రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో చోటు చేసుకుంది. షాద్‌నగర్ ఏసిపి రంగస్వా మి తెలిపిన వివరాల ప్రకారం ఫరూక్‌నగర్ మండలం చిన్న చిల్కమర్రి గ్రామానికి చెందిన ఎరుకలి యాదయ్య ఫిబ్రవరి 19వ తేది నుండి కనిపించడం లేద ని భార్య ఎరుకలి మౌనిక ఫిబ్రవరి 24వ తేదిన షాద్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వివరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా అసలు విషయాలు వెలుగులోకి వచ్చినట్లు వివరించా రు. యాదయ్య, మౌనిక భార్యభర్తలు సంసారం విషయంలో నిత్యం గోడవలు పడే వారని, దాంతో గ్రామ సమీపంలో ఉన్న ఓ పరిశ్రమలో పని చేసేందుకు మౌనిక వెళ్ళడం మొదలు పెట్టినట్లు తెలిపారు. పరిశ్రమలో పని చేస్తున్న సమయంలోనే అక్కడ ఆటో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న అశోక్ అనే వ్యక్తితో మౌనిక పరిచయం ఏర్పడి ప్రేమగా మారినట్లు తెలిపారు. దాంతో తమ ప్రేమ వ్యవహారానికి భర్త అడ్డు వస్తున్నాడనే నేపంతో ఎలాగైనా తొలగించుకోవాలనే ఉద్దేశంతో యాదయ్యను భార్య మౌనిక, ఆమె ప్రియుడు అశోక్ ఫిబ్రవరి 18వ తేదీ రాత్రి 11గంటల సమయంలో ఆటోలో కొత్తూరు మండలం గూడూరు గ్రామ శివారు వద్దకు తీసుకువెళ్ళి రోడ్డు పక్కన నిర్మాణుశ్య ప్రాంతంలో మృతుడు యాదయ్యకు మద్యం తాగించి మత్తులోకి జారుకున్న వెంటనే గొంతు కోసి గుంతలో పడేసి పెట్రోల్ పోసి నిప్పంటించినటుల ఏసిపి తెలిపారు. మరుసటి రోజు నుండి ప్రియుడితో కలిసి మౌనిక ఉండడంతో దాంతో అనుమానం వచ్చి ఇద్దరిని అదుపులోకి తీసుకొని విచారించగా అసలు విషయాలు వెలుగులోకి వచ్చినట్లు ఏసిపి రంగస్వామి తెలిపారు. వారి నుండి ఒక ఆటోతోపాటు రెండు సెల్‌పోన్లను స్వాధీనం చేసుకొని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసిపి రంగస్వామి తెలిపారు. ఈ మీడియా సమావేశంలో పట్టణ సిఐ విజయ్‌కుమార్, ఎస్ఐ సుశీల, హెడ్‌కానిస్టేబుల్ విజయభాస్కర్, సిబ్బంది నరేందర్, రాజేష్, కరుణాకర్‌లు పాల్గొన్నారు.

## రైతు శ్రేయస్సుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోంది : వీర్లపల్లి



ప్రజాపక్షం/కొందుర్గు : రైతు శ్రేయస్సు కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వివరించారు. గురువారం కొందుర్గు మండల కేంద్రంలో వరికొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు పండించిన వరిధాన్యానికి పూర్తి స్థాయిలో గిట్టుబాటు ధర కల్పిం చడంతో పాటు ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం అన్ని విధాల చర్యలు తీసుకుంటుందని వివరించారు. ప్రతి క్వింటాల్ రూ.2320 గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు బోనస్‌గా రూ.500 ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆరుగాలం కష్టపడి పని చేస్తున్న రైతులను అన్ని విధాల ఆదుకుంటామని, మార్కెటింగ్ వ్యవస్థలో దళారీలను నియంత్రించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. దళారీలకు ధాన్యం విక్రయించి ఎవరు మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలోనే విక్రయించేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, మార్కెట్ కమిటి వైస్ చైర్మెర్ బాబర్ ఖాన్, సింగిల్ విండో చైర్మెన్ దామోదర్‌రెడ్డి, నేతలు సయ్యద్ సాధిక్, తదితరులు పాల్గొన్నారు.

## ఉగ్రవాదానికి భారత్ ఎప్పటికీ తలవంచదు




ప్రజాపక్షం/షాద్‌నగర్: ఉగ్రవాదానికి భారతదేశం ఎప్పటికి తలవంచదని, ఉగ్ర ముష్కరులకు త్వరలోనే తగిన బుద్ధి చెప్పడం ఖాయమని హిందూ వాహిని ఐక్య వేధిక నేతలు పేర్కొన్నారు. గురువారం షాద్‌నగర్ ఐక్య వేధిక ఆధ్వర్యంలో కన్యాక పరమేశ్వరీ దేవాలయం నుండి మొయిన్‌రోడ్డు మీదుగా ఫరూఖ్‌నగర్ రెవిన్యూ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించడంతోపాటు నిరసన వ్యక్తం చేశారు. షాద్‌నగర్ ముఖ్యకూడలిలో పాకిస్థాన్ ప్రభుత్వ దిష్టబొమ్మను దగ్ధం చేయడంతో పాటు పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా హిందూ వాహిని ఐక్య వేధిక నాయకులు మాట్లాడుతూ ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న పాకిస్థాన్‌కు తగిన బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని అన్నారు. జమ్ము కాశ్మీర్ అందాలను చూసేందుకు పర్యాటకులు వస్తే దారుణంగా ఉగ్రవాదులు కాల్చి చంపడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఉగ్రవాదులను ప్రోత్సహిస్తున్న పాకిస్థాన్‌కు తగిన బుద్ధి చెప్పడంతో పాటు దాడికి ఓడిగట్టిన ఉగ్ర ముష్కరుల ను కఠినంగా శిక్షించడంతో పాటు ఉరి తీయాలని డిమాండ్ చేశారు. ప్రాణాలు కొల్పోయిన మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని కొవ్వొత్తులు వెలిగించి నివాళ్ళు అర్పించారు. ఈ కార్యక్రమంలో హిందు ఐక్య వేధిక నేతలు చెట్ల వెంకటేష్, మఠం రచ్చయ్య, నాగిళ్ల ప్రభాకర్, గుడెం రమేష్, గుడాల రమేష్, ప్యాట వంశీ, సల్లా మహేష్, డాక్టర్ యూనియన్ నాయకులు చందులాల్, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



**ప్రజాపక్షం/దోమ:**పరిగి నియోజకవర్గంలోని దోమ మండల పరిధిలోని దిర్సంపల్లి గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని స్థానిక నాయకులతో కలిసి పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఒక్కొక్కటి అమలు చేస్తున్నదని పేదలకు సన్నబియ్యం ఇవ్వాలనే సంకల్పంతో రాష్ట ప్రభుత్వం సన్నబియ్యం పథకాలను ప్రవేశపెట్టింది అని అన్నారు. సన్నరకం వరికి 500ల భోనస్ ఇస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు విజయ్‌కుమార్‌రెడ్డి, రఘువేందర్ రెడ్డి, యాదయ్యగౌడ్, అధికారులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## క్రికెట్ స్టేడియం ప్రారంభం

**ప్రజాపక్షం/కాప్రా:** కాప్రాలోని ఎల్లారెడ్డిగూడలో క్రికెట్ స్టేడియాన్ని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పరమేశ్వరరెడ్డి గురువారం ప్రారంభించారు. టర్నింగ్ పాయింట్ క్రికెట్, ఆరీనా అకాడమిలు సంయుక్తంగా ఈ క్రికెట్ మైదానాన్ని ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమంలో కాప్రా డివిజన్ కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి, కాంగ్రెస్ శ్రేణులు నాగశేషు, జిల్లా మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ విఠల్ నాయక్, మార్కెట్ కమిటి డైరెక్టర్ పూర్ణయాదవ్, అరుణ్‌కుమార్, పవన్, తదితరులు పాల్గొన్నారు.



## నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచన

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని గౌతంనగర్ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ సూచించారు. డివిజన్‌లోని మల్లికార్జుననగర్ ప్రాంతంలో రూ.42 లక్షల వ్యయంతో కొనసాగుతున్న సిసి రోడ్డు పనులను పరిశీలించారు. నిర్ణీత సమయానికి పనులు పూర్తి కాని పక్షంలో ప్రజలు నానా అవస్థలకు గురవుతారన్నారు. డివిజన్‌లోని అన్ని ప్రాంతాల్లో మౌలిక వసతులను కల్పించేందుకు కృషి చేస్తున్నానని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు గోపాల్‌రెడ్డి, అచ్యుతారావు, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



## రామరాజుయాదవ్‌కు ఘన నివాళి


**ప్రజాపక్షం/శామీర్‌పేట :** శామీర్‌పేట మాజీ సర్పంచ్ బత్తుల రామరాజు యాదవ్ 17వ వర్ధంతి వేడుకలు శామీర్‌పేటలోని మాజీ సర్పంచ్ కిషోర్‌యాదవ్ నివాసంలో గురువారం ఘనంగా నిర్వహించారు. రామరాజుయాదవ్ చిత్రపటానికి పూలమాల వేశారు. స్వర్గీయ రామరాజుయాదవ్ సర్పంచ్‌గా ఉన్నప్పుడు గ్రామానికి ఎనలేని సేవలు చేశారని గుర్తుచేశారు. బడుగు బల హీన వర్గాలకు అండగా ఉంటు మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించారని కొనియాడారు. తుర్కపల్లిలోని మాతృశ్రీ అనాధశ్రమంలో అనాధలకు పండ్లు పంపిణీ చేశారు. అలాగే నిత్యావసర వస్తువులను ఆశ్రమ నిర్వాహకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

## ఇంటర్‌లో మాస్టర్ మైండ్స్ విద్యార్థుల అద్భుత ఫలితాలు

### 987 మార్కులతో ప్రథమ స్థానంలో కౌశిక్ గౌడ్



**ప్రజాపక్షం / కుత్బుల్లాపూర్ :** ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాలలో ఎంఇసి విభాగంలో మాస్టర్ మైండ్స్ విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించి తమ సత్తా చాటుకున్నారు. ఈ ఏడాది ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాలలో ఉత్తమ ఫలితాలు సాధించి తమ సత్తా చాటుకున్నారు. కామర్స్ విభాగంలో ప్రతి సంవత్సరం రాష్ట్రంలో మాస్టర్ మైండ్స్ విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించి ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారన్నారు. ఈ ఏడాది ద్వితీయ సంవత్సరం ఫలితాలలో గడ్డమీది కౌశిక్ గౌడ్ 1000 కి 987 మార్కులు సాధించి ప్రథమస్థానంలో నిలిచారు. ప్రథమ సంవత్సరంలో కె.గాయత్రి వర్ధిని, గౌరీష్, ఎమ్మెస్ ఎస్.ఎస్.వి సహిష్టులు 500 మార్కులకు గాను 495 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను మాస్టర్ మైండ్స్ అమీర్‌పేట జోన్ అడ్మిన్ ఇన్‌చార్జి ఎస్.ఎం.వలి, కళాశాల అకడమిక్ ప్రిన్సిపల్ అశోక్ కుమార్లు అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఏడాది లాగే ఈ యేడు కూడా ఎంఇసిలో రాష్ట్ర స్థాయిలో అత్యధిక మార్కులు సాధించిన ఘనత మాస్టర్ మైండ్స్‌కి దక్కుతుందన్నారు. ఎంఇసిలో తమ కళాశాలకు సాటి ఏదీ లేదని మరోమారు నిరూపితమైందన్నారు.



## రాఘవాపూర్‌లో గ్రామసభలో ఎంపిడిఒ

**ప్రజాపక్షం/పరిగి:**పరిగి మండల పరిధిలోని రాఘవాపూర్ గ్రామంలో నిర్వహించిన గ్రామ సభ నిర్వహించగా గ్రామసభలో పరిగి ఎంపిడిఒ కరీం పాల్గొని మాట్లాడుతూ, మంచినీటి సమస్య ఉంటే చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎక్కడైన పైపు లీకేజీలు ఉంటే వెంటనే మరమ్మత్తులు చేయాలని అన్నారు. పరిసరాల పరిశుభ్రతకు కృషి చేయాలని నర్సరీలో మొక్కలు పిచ్చి మొక్కలు ఉన్న తొలగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వేమారెడ్డి గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# క్షేత్రస్థాయిలో అందరికీ మేలుచేసేది భూ భారతి చట్టం

### శాసనసభాపతి ప్రసాద్‌కుమార్



**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి:** భూమి అంటే ఆదాయాన్ని ఇచ్చే వనరే కాదు అధి సమాజంలో ఆత్మగౌరవాన్ని ఇచ్చేదని, భూ భారతి చట్టంపై వికారాబాద్ జిల్లా కేంద్రంలో అంబేద్కర్ భవనంలో నూతన ఆర్‌ఎఆర్ చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ రైతుల శ్రేయస్సు కోసం తెలంగాణ రాష్ట ప్రజా ప్రభుత్వం తీసుకువచ్చిన భూభారతి చట్టంపై ప్రతి ఒక్కరు రైతులతో పాటు భూమి కోనుగోలు చేసిన వారందరికీ మేలు జరుగుతుంది అని అన్నారు. వారసత్వ, ప్రభుత్వ భూమి, అటవీ, సాగునీటి శాఖ, అసైన్డ్ భూమి, దేవాదాయశాఖ భూములా అనేది స్పష్టంగా తెలియజేస్తుంది. రైతులకు మేలుచేసే విధంగా క్షేత్ర స్థాయిలో అందరి అభిప్రాయాలను తీసుకుని పకడ్బందీగా భూ భారతి చట్టాన్ని రూపొందించాలని స్పీకర్ అన్నారు.

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు ఎలాంటి భూ సమస్యలున్నప్పటికీ కోర్టులను ఆశ్రయించ కుండా సమస్యలు పరిష్కరించే వెసులుబాటును భూభారతి చట్టం తీసుకువచ్చిందని అన్నారు. భూ సమస్యలపై సత్వర పరిష్కారానికి ఈ చట్టం ఎంతగానో దోహదపడుతుందని కలెక్టర్ అన్నారు. భూ భారతి చట్ఠంలో అన్ని సమస్యలను పరిష్కరమార్గం ఉంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సుధీర్ ఆర్‌డిఓ వాసు చంద్ర, తహసీల్దార్ లక్ష్మి నారాయణ, పట్టణ అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, కిషన్‌నాయక్, ఆర్‌ఐ నరేష్, మండల పార్టీ అధ్యక్షులు, రాజశేఖర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

**అధిక నిధులు మంజురుచేసి రహదారుల పనులను చేపడుతాం :** వికారాబాద్ మండల పరిధిలోని మదన్‌పల్లి దగ్గర 4.45కోట్ల నిధులతో కొత్తగడి నుండి బంట్వారం వరకు చేపట్టే పునర్నిర్మాణ పనులను స్పీకర్ ప్రసాద్‌కుమార్ శంకుస్థాపన చేశారు. తదనంతరం కోటి 81లక్షల వ్యయంతో అనంతగిరి గుట్ట నంది విగ్రహం వరకు నిర్మించిన సిసిరోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ ప్రజా ప్రయోజనలదృష్టా మెరుగైన రవాణా సౌకర్య వసతులు కల్పించేందుకు ఎన్ని నిధులైన వెచ్చిస్తామన్నారు. రవాణా ముఖ్యమైన రవాణా రహదారులతో పాటు గ్రామాల్లో సిసిరోడ్లు ఏర్పాటుకు నిధులు మంజూరు చేయడం జరుగుతుందని స్పీకర్ తెలిపారు. అనంతరం ఆటవీ శాఖ గృహ ఆవరణలో మూడు కోట్ల వ్యయంతో నిర్మాణాలు చేపడుతున్న 4 కాటేజీలను స్పీకర్ పరిశీలించారు. అనంతరం రహదారి పక్కన స్పీకర్ చెట్టును నాటారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సుధీర్, అటవీ శాఖ జిల్లా అధికారి జ్ఞానేశ్వర్, ఆర్‌అండ్‌బి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీధర్‌రెడ్డి ఎంపిడిఓ వినయ్‌కుమార్ తదితరులు పాల్గోన్నారు.

## నేడు, రేపు సిపిఐ ర్యాలీలు, కొవ్వొత్తుల ప్రదర్శనలు




**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** జమ్ము కాశ్మీర్ పహల్దామ్‌లో చోటు చేసుకొన్న ఉగ్రవాదుల దాడికి నిరసనగా శుక్ర, శనివారాల్లో సిపిఐ పార్టీ, అనుబంధ పార్టీలు ర్యాలీలు, కొవ్వొత్తుల ప్రదర్శనలు నిర్వహించనున్నారు. ఉగ్రవాదుల దాడిలో ప్రాణాలు కోల్పో యిన వారికి నివాళులర్పించటంతో పాటు జాతి ఐక్యతను తెలియచేసే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నారు.



## ఉగ్రదాడికి నిరసనగా క్యాండిల్ ర్యాలీ

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** కాశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడికి నిరసగా కాంగ్రెస్ శ్రేణులు గురువారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. సాయినగర్ అనుటెక్స్ చౌరాస్తా నుండి మల్కాజిగిరి చౌరాస్తా వరకు జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో, సిటిజన్ అసోసియేషన్, హైదరాబాద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఇస్మాయిల్‌రెడ్డి, ప్రభాకరరెడ్డి, మల్లేష్, మౌలాలి కార్పొరేటర్ సునీత, వెంకటేష్ యాదవ్, మోహన్‌రాజ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

**చర్లపల్లిలో :**కశ్మీర్ పెహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడిని నిరసిస్తూ చర్లపల్లి డివిజన్ బిజెపి పార్టీ ఆధ్వర్యంలో కుషాయిగూడ బస్టాప్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టి ర్యాలీ నిర్వహించి పాకిస్తాన్ తీవ్రవాదుల దిష్టి బొమ్మను దహనం చేశారు. దాడిలో అమరులైన వారికి శ్రద్ధాంజలి ఘటించారు.ఈ కార్యక్రమంలో నాయకులు డి.నాథం, కొమ్ము నర్సింగ్, చల్లా ప్రభాకర్, ఎం లక్ష్మణ్‌గౌడ్, కె సురేందర్‌గౌడ్, టి. ఆనంద్‌గౌడ్, ఆర్.వెంకులు, గణేష్, కె. నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ అధికారుల కనుసన్నల్లో మట్టిదందా..

### జరిమానాలతో సరిపెడుతున్న తహసీల్దార్



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** మూడుచింతలపల్లి మండలంలో మట్టి మాఫియా జోరందుకుంది. మండల కేంద్రంలోని మారుమూల గ్రామాల రెవెన్యూ పరిధిలో మట్టిని తరలిస్తున్న క్రమంలో అధికారులు మట్టి టిప్పర్లను పట్టుకుని కార్యాలయానికి తరలించారని విశ్వసనీయ సమాచారం.. కాగా తెల్లవారే సరికి రెవెన్యూ కార్యాలయంలో మట్టి టిప్పర్లు కనిపించకుండా పోయాయి. మట్టి దళారులతో రెవెన్యూ అధికారులు కుమ్మకై మట్టి అక్రమ రవాణకు సహకరిస్తున్నారనే ఆరోణలు మండలంలో వినిపిస్తున్నాయి. గతంలో రెవెన్యూ తహాశీల్దార్ మట్టి టిప్పర్లను పట్టుకుని సుమారు రూ. 4 లక్షల వరకు జరిమాణాలు విధించారు. సుమారు 30 మట్టి టిప్పర్లను పట్టుకుని జరిమాణాలు విధించారని పత్రికల్లో ప్రచురించారు. ఇట్టి విషయమై తహాశీల్దార్‌ను ప్రజాపపక్షం పత్రిక విలేకరి ఇటీవల వివరణ కోరగా ఇకపై అక్రమంగా మట్టి తరలిస్తే జరిమాణాలు కాకుండా కేసులు నమోదు చేస్తామని, సమాచారం ఇవ్వని సిబ్బందిపై వేటు వేస్తామని తహాశీల్దార్ వివరణ ఇచ్చారు. ప్రస్తుతం లింగాపూర్‌తండా సమీపంలో బుధవారం అర్ధరాత్రి పట్టుకున్న టిప్పర్లను తూతూ మంత్రంగా చలాన్లు విధించి విడిచిపెట్టడంలో ఆంతర్యమేమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ మట్టి టిప్పర్ల వెనక అదృశ్య శక్తులు ఉన్నాయని తామే అంతా చూసుకుంటామని మట్టి టిప్పర్లను దర్జాగా నడిపించుకోండి అని చెప్పినట్లు తెలుస్తుంది. ఇట్టి విషయమై తహాశీల్దార్‌ను మొబైల్‌లో సంప్రదించగా అందుబాటులోకి రాలేదు. ఇకనైన రెవెన్యూ అధికారులు మట్టి అక్రమ రవాణకు అడ్డుకట్ట వేయాలని పలు గ్రామాల ప్రజలు, రైతులు కోరుతున్నారు.

## భూ సమస్యల సత్వర పరిష్కార దిశగా రెవెన్యూ సదస్సులు

✻ రైతులు కోరుకుంటే భూముల రీ సర్వే ✻ పేద రైతులకు అవసరమైతే ఉచిత న్యాయ సహాయం

### కలెక్టర్ గౌతం



**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** ఇకపై ప్రతి గ్రామంలో తహసీల్దార్లు నిర్వహించే రెవెన్యూ సదస్సుల్లో వ్యక్తిగత భూ సంబంధిత సమస్యలకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి చట్టంలో పరిష్కారం లభిస్తుందని జిల్లా కలెక్టర్ గౌతం పేర్కొన్నారు. ఈ సదస్సుల్లో ఆయా గ్రామాలకు చెందిన రైతులకు భూ సమస్యలు ఏవైనా ఉంటే ధరఖాస్తులు సమర్పించాలన్నారు. గురువారం కీసర మండలంలోని చీర్యాల గ్రామంలోని జయ మోహన్ ఫంక్షన్ హాలులో నిర్వహించిన భూభారతి అవగాహనా సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాజా భూభారతి చట్టంలో భూ సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కారించేందుకు రెవెన్యూ అధికారులకు గత ధరణి చట్టానికి భిన్నంగా సంపూర్ణ అధికారాలు ఉన్నాయన్నారు. రెవెన్యూ సదస్సుల్లో పాసు పుస్తకాలు రాని వారికి కొత్త వాటిని ఇవ్వటం, ఇచ్చిన పాసు పుస్తకాల్లో తప్పులుంటే సవరించటం జరుగుతుందన్నారు. రైతులు కోరుకొంటే తమ భూములను లైసెన్స్‌డ్ సర్వేయర్ల ద్వారా సర్వే చేయించి భౌతిక సరిహద్దుతో చేయించిన భూ మ్యాప్‌లను ప్రభుత్వ సర్వేయర్లు తిరిగి వాలిడేట్ చేసిన తర్వాతే రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లలో భూ మ్యాప్‌లు వస్తాయని, దీని వల్ల ఉండే పకడ్బందీగా భూ సరిహద్దులుండనున్న దృష్ట్యా భవిష్యత్తు తరాల వారికి సైతం ఎలాంటి ఇబ్బందులు తలెత్తవని కలెక్టర్ పేర్కొన్నారు. రైతులు కోరుకొంటేనే వారి భూములను రీసర్వే చేస్తారే తప్ప అధికారులు స్వయం నిర్ణయంతో చేయరని స్పష్టం చేసారు. ఇప్పటి వరకు అమలులో ఉన్న ధరణి చట్టంలో పిఓబి సమస్యలు అనేకం తలెత్తాయని, భూభారతి చట్టంలో పిఓబిని రద్దు చేసే అధికారం అధికార్లదే అని చెప్పారు. భూభారతి చట్టంలో ప్రతి ఏడాది డిసెంబరు 31న ప్రతి గ్రామ పంచాయతి కార్యాలయంలో ఆన్‌లైన్‌లో ప్రింట్ తీసి నోటీసు బోర్డులలో ప్రదర్శిస్తారని, దీని వల్ల ప్రజలందరికి తమ భూముల వివరాలతో పాటు ఎలాంటి మార్పు చేర్పులు జరిగినా తెల్సుకోగలుగుతారన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి మాట్లాడుతూ గత సమస్యలు, అనుభవాల దృష్ట్యా ధరణి స్థానంలో అనేక అంశాలను జోడిస్తూ నూతన ఆర్‌ఓఆర్ భూభారతి చట్టాన్ని ప్రవేశపెట్టిందని, భూభారతి చట్టంలో 23 సెక్షన్లు, 18 నిబంధనలు ఉన్నాయని తెలిపారు.

ఇంటి స్థలాలు, ఆబాది, వ్యవసాయేతర భూములకు హక్కుల రికార్డులతో వ్యవస్థను సమగ్రంగా అభివృద్ధి చేయటంతో పాటు భవిష్యత్తులో పేద రైతులకు అవసరమైతే ఉచిత న్యాయ సహాయం అందించే దిశగా చర్యలు తీసుకొంటున్నామని చెప్పారు. ఈ సదస్సులో కీసర ఆర్డీఓ ఉపేందర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ నర్సింలు, జిల్లా గ్రంథాలయ సంస్థ కమిటి చైర్మన్ శ్రీనివాసరెడ్డి, కీసర తహసీల్దార్ అశోక్, రెవెన్యూ అధికారులు,సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## పౌల్ట్రీ రంగానికి ప్రభుత్వం అండ హర్షణీయం

### టిపిఎఫ్ ఆధ్వర్యంలో సిఎం కటౌట్‌కు పాలాభిషేకం




**ప్రజాపక్షం/ఖైరతాబాద్:** రాష్ట ప్రభుత్వం పౌల్ట్రీ రైతుల సమస్యలను పరిష్కరించడంతోపాటు వారికి అండగా నిలవడం సంతోషంగా ఉన్నదని తెలంగాణ పౌల్ట్రీ ఫెడరేషన్ (టిపిఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు కాసర్ల మోహన్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి ఉడుతల భాస్కర్‌రావు పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని టిపిఎఫ్ కార్యాలయం ముందు జిల్లాల నుంచి తరలివచ్చిన పౌల్ట్రీ రైతులు కలిసి సిఎం రేవంత్ రెడ్డి కటౌట్‌కు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీలో కోడిగుడ్ల టెండర్లను గత కొన్నేళ్లుగా మూడు కుటుంబాలు మాత్రమే దక్కించుకొంటున్నాయని, దీంతో 7,500 మంది పౌల్ట్రీ రైతులు నష్టపోతున్నారని పేర్కొన్నారు. రాష్ట్రం లో ఏడు జోన్లుగా విభజించి టెండర్ ప్రక్రియ జరుపుతున్నారని చెప్పారు. కొంత మంది అధికారులను కాదని అక్రమంగా టెండర్లను పొందుతున్నారన్నా రు. ఈ విషయాన్ని సిఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, టెండర్ ప్రక్రియను సమీక్షించి, అందరికీ అనుకూలంగా టెండర్లు వేయిస్తామని హామీనిచ్చారని తెలిపారు. ఇందుకు కృతజ్ఞతగా సిఎం కటౌట్‌కు పాలాభిషేకం చేశామన్నారు. ఇటీవల బర్డ్‌ఫ్లూ కేసులు ఎలాంటి ప్రభావితం కాకుండా రాష్ట్ర పశుసంవర్ధక శాఖ తక్షణ చర్యలు తీసుకోవడం హర్షణీయమన్నారు. అనంతరం 5 వేల ఉడకబెట్టిన గుడ్లను పాదచారులకు, వాహనదారులకు పంపిణీ చేశారు. సమావేశంలో టిపిఎఫ్ ఉపాధ్యక్షులు ఉప్పల నరసింహరెడ్డి, కార్యదర్శి పాతురి వెంకట్‌రావు, కోశాధికారి వంగేటి అభిషేక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తే బంగారు భవిష్యత్

### మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్య యాదవ్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** క్రమ శిక్షణతో విద్యను అభ్యసిస్తే భవిష్యత్ బంగారు మయంగా ఉంటుందని మాజీ శాసన సభ్యులు వై.అంజయ్య యాదవ్ అన్నారు. గురువారం షాద్‌నగర్ మున్సిపల్ పరిధిలోని టీచర్స్ కాలనీలో నివాసం ఉంటున్న రఘువేందర్ రావు, మమత దంపతుల కుమార్తె సివిల్స్‌లో 739ర్యాంక్ సాధించిన ఇంద్రార్చితను మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అంజయ్య యాదవ్ మాట్లాడుతూ విద్యార్థినీ ఇంద్రార్చిత కష్టపడి విద్యను అభ్యసించి సివిల్స్‌లో 739ర్యాంక్ సాధించడం ఎంతో అభినందనీయమని అన్నారు. మనిషికి కృషి పట్టుదల ఉంటే సాధించలేనిది ఏమి ఉండదని, సివిల్స్‌లో ర్యాంక్ సాధించి షాద్‌నగర్‌కు పేరు ప్రతిష్టలు తీసుకురావడం ఎంతో అభినందనీయమని అన్నారు. తల్లి దండ్రుల శ్రమ వృధా కాకుండా పిల్లలు గొప్ప విద్యావంతులైతే కుటుంబానికి, సమాజానికి ఎంతో మేలు జరుగుతుందని వివరించారు. ఉన్నతమైన హోదాకు వచ్చిన తరువాత సమాజ అభివృద్ధితోపాటు సమాజ సేవలో భాగస్వాములు అయితేనే వారి జన్మకు సార్థకత లభిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మెన్ నరేందర్, వైస్ చైర్మెన్ నటరాజన్, మాజీ మార్కెట్ కమిటి వైస్ చైర్మెన్ లక్ష్మి నారాయణ, మాజీ కౌన్సిలర్లతోపాటు నేతలు పాల్గొన్నారు.

## లెడ్ అడ్వర్టైజ్‌మెంట్ బోర్డుల టెండర్లపై విచారణ

### సోషల్ జస్టిస్ పార్టీ ఆఫ్ ఇండియా డిమాండ్



**ప్రజాపక్షం / ఖైరతాబాద్ :** హైదరాబాద్ రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు పరిధిలో లెడ్ అడ్వర్టయిజ్‌మెంట్ బోర్డుల టెండర్లలో చోటు చేసుకొన్న అవకతవకలపై సమగ్ర విచారణ చేపట్టాలని సోషల్ జస్టిస్ పార్టీ ఆఫ్ ఇండియా డిమాండ్ చేసింది. గురువారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో పార్టీ అధ్యక్షులు చామకూర రాజు, తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి కె.వి.గౌడ్, పార్టీ అధికార ప్రతినిధి కొండల గౌడ్ మీడియాతో మాట్లాడారు. అనేక ఆరోపణలు, కోర్టు వివాదాల్లో ఉన్న నవ నిర్మాణ్ అసోసియేట్స్ సంస్థకు తక్కువ ధరకే టెండర్ కేటాయించారన్నారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వానికి రూ.100 కోట్లు నష్టం వచ్చేలా ప్రైవేట్ సంస్థకు లాభం కల్పించేలా నోటిఫైడ్ ఏరియా కమిటీ అధికారులు వ్యవహరించారని ఆరోపించారు. టెండర్ ప్రక్రియలో నవ నిర్మాణ్ అసోసియేట్స్ తప్పుదారి పట్టించే పత్రాలు అందజేసిందని తెలిపారు. తక్షణమే లెడ్ అడ్వర్టయిజ్‌మెంట్ ప్రదర్శన నిలిపివేసి నవ నిర్మాణ్ అసోసియేట్స్ సంస్థపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

# బిసిసిఐ అండర్–19కు హైదరాబాద్ బాలికలు




## అరుదైన స్థానాన్ని దక్కించుకున్న ఏడుగురు అమ్మాయిలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిసిసిఐ నిర్వహించనున్న క్రికెట్ అండర్–19 ఎలైట్ శిబిరాలకు హైదరాబాద్ నగరానికి చెందిన ఆరుగురు అమ్మాయిలు స్థానం దక్కించుకున్నారు. ఒకే సారి హైదరాబాద్‌కు చెందిన ఏడుగురు అమ్మాయిలు జాతీయ స్థాయి క్రికెట్ జట్టుకు ఎంపిక కావటం ఇదే మొదటి సారి. హైదరాబాద్ నగరం గర్వించదగిన విషయం. ఎంపికైన వారిలో కె.నిధి, సంధ్య గోరా, కావ్యశ్రీ, జాస్మిన్ గిల్, పివి హంసకి, సిపి పార్వతి, ఈ.శృజన ఉన్నారు. క్రికెట్ ప్లేయర్లు త్వరలోనే జట్టుఏగా రాంచీలో జరగనున్న శిబిరంలో శిక్షణకు నిధి, సంధ్య, కావ్యశ్రీలు ఎంపిక కాగా, టీమ్ డీలో డెహ్రాడూన్‌లో నిర్వహించే శిక్షణకు హంసిక, పార్వతి, సృజన, టీమ్‌బీలో భాగంగా అహ్మదాబాద్‌లో నిర్వహించే శిక్షణ శిబిరానికి జాస్మిన్ గిల్ హైదరాబాద్ నుంచి బిసిసిఐ అండర్–19 క్రికెట్ శిక్షణ శిబిరాల్లో పాల్గొనున్నారు. ఆయా వేదికల్లో ఏప్రిల్ 25 నుంచి మే 21 వరకు శిక్షణ శిబిరాల్లో పాల్గొనున్నారు. శిక్షణ ముగిసిన తర్వాత ఈ యువ క్రీడాకారిణులు జాతీయ స్థాయి వేదికలపై తమ క్రీడా నైపుణాన్ని ప్రదర్శించనున్నారు.



# స్వార్థ రాజకీయాలొద్దు

(మొదటి పేజీ తరువాయి)

వహించారు. అంతకుముందు కేరళ మాజీ ముఖ్యమంత్రి అచ్యుతమీనన్ శతజయంతి ఉత్సవాల సందర్భంగా ఆయన విగ్రహం వద్ద జాతీయ సమితి సభ్యులు పుష్పాంజలి ఘటించారు. తిరువనంతపురంలో ఇటీవల పునర్నిర్మాణం చేసిన కేరళ సిపిఐ రాష్ట్ర కార్యాలయం ఎం.ఎన్.స్మారక భవన్‌లో సిపిఐ జాతీయ సమితి సమావేశం గురువారం ప్రారంభమయ్యాయి. సెప్టెంబర్ మాసంలో చండీగఢ్‌లో జరగనున్న సిపిఐ జాతీయ మహాసభకు సంబంధించిన ముసాయిదా రాజకీయ తీర్మానం, రాజకీయ పరిణామాల నివేదికలను సమావేశంలో రాజా ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మోదీ నాయకత్వాన బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను తీవ్రంగా విమర్శించారు. వక్ఫ్ సవరణ చట్టం ద్వారా మతపరమైన విభజన తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుందని, పార్టీ దానిని ఎదర్కొనటానికి సుప్రీం కోర్టులో కూడా కేసు వేసినట్లు వెల్లడించారు. ఇది రాజ్యాంగ వ్యతిరేకమైనదని, ఆర్టికల్ 14కు భిన్నంగా వచ్చిందని, ప్రాథమిక హక్కులకు కూడా భిన్నమైదని, అందుకే పార్టీ స్పష్టమైన వైఖరి తీసుకున్నదని వివరించారు. ఛత్తీస్‌గఢ్‌లో జరుగుతున్న పరిణామాలను ప్రస్తావించారు. సిపిఐ(ఎం) 24వ జాతీయ మహాసభ ప్రారంభసభకు హాజరయ్యానని, సానుకూల సంకేతాలు ఉన్నప్పటికీ, అనేక సవాళ్ళు ఉన్నాయని, వామపక్షాలను ప్రత్యామ్నాయంగా బలోపేతంగా చేసుకుంటే తప్ప ఇతర పార్టీలను ఆకర్షించలేమన్నారు. గుజరాత్ అహ్మదాబాద్‌లో జరిగిన ఎఐసిసి సమావేశాలను కూడా రాజా ప్రస్తావించారు. గాజా మారణకాండను తీవ్రంగా ఖండించారు. మే 27వ తేదీన కార్మిక వర్గ జాతీయ సమ్మెలో అన్ని వర్గాలు పాల్గొనేందుకు సిద్ధమవుతున్నాయని, బ్యాంకింగ్, మైనింగ్, ట్రాన్స్‌పోర్ట్, ఫైనాన్షియల్ రంగం తదితర సంఘాలు తమ సంసిద్ధతను వ్యక్తం చేస్తున్నాయని తెలిపారు. రాజకీయాలు, విధానాలను, పార్టీని ముందుకు తీసుకుపోవడానికి రానున్న కాలంలో పార్టీని బలోపేతం చేసుకుంటే తప్ప మరో మార్గం లేదని అని రాజా స్పష్టం చేశారు. కాగా, సమావేశంలో ప్రవేశపెట్టిన నివేదికలపై తొలిరోజు 19 రాష్ట్రాల ప్రతినిధులు చర్చల్లో పాల్గొన్నారు.



# రాష్ట్రంలో హై అలర్ట్

(మొదటి పేజీ తరువాయి)

వాహనాల తనిఖీలను కూడా ముమ్మరం చేశారు. రైల్వే పోలీసు ఫోర్స్‌తో పాటు విమానాశ్రయంలో సిఆర్‌పిఎఫ్ అదనపు బలగాలను రంగంలోకి దించారు. భారత్ సమ్మిట్, మిస్‌వరల్డ్–2025 ఈవెంట్లకు సంబంధించి హైటెక్ సిటీ పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక భద్రతా చర్యలు తీసుకున్నారు. ఈ ప్రాంతంలో విదేశీయుల సంఖ్య ఎక్కువగా ఉండడమే ప్రధాన కారణం. ముఖ్యంగా ఐటి కంపెనీల వద్ద కూడా భద్రతను పెంచారు. అలాగే ప్రయాణికుల బ్యాగ్‌లను మెటల్ డిటెక్టర్ల సహాయంతో పరిశీలిస్తున్నారు. అనుమానిత వ్యక్తులు, వస్తువులు కనిపిస్తే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని డిజిపి జితేందర్ సూచించారు. రాష్ట్రంలో ఒకపక్క వక్ఫ్‌బోర్డుపై ఒక వర్గం ఆందోళనలు జరుగుతుండడం, మరోపక్క ములుగు జిల్లాలో కర్రెగుట్టల్లో మావోయిస్టులు ఉన్నారనే సమాచారంతో వేలాది మంది పోలీసు బలగాలు చేరుకోవడంతో శాంతి సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తుండడంపై రాష్ట్ర పోలీసులు దృష్టి సారించారు. వీటన్నిటి పరిణామాల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా రాష్ట్ర పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. ముఖ్యంగా హైదరాబాద్ పాత బస్తీలో ర్యాపిడ్ యాక్షన్ బలగాలను రంగంలోకి దించారు

# జమ్ముకశ్మీర్‌లో ఉగ్రదాడి 'ఇంటెలిజెన్స్ వైఫల్యమే'

### శివసేన (యుబిటి) ధ్వజం
### ఆర్టికల్ 370 రద్దుతో లోయలో హింస అంతమైందా? అని కేంద్రానికి సూటి ప్రశ్న

**ముంబయ్ :** జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులపై జరిగిన అత్యంత ఘోరమైన ఉగ్రదాడిని 'ఇంటెలిజెన్స్ వైఫల్యం' అని గురువారం శివసేన (యుబిటి) ఆరోపించింది. పాకిస్తాన్‌ను బెదిరించడం ద్వారా కేంద్రపాలిత ప్రాంతం ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం కావని హితవు చెప్పింది. ఉద్ధవ్ థాక్రే నేతృత్వంలోని శివసేన తన అధికార పత్రిక 'సామ్నా' సంపాదకీయంలో పదునైన పదాలతో కేంద్రంపై దాడి చేశారు. పూర్వ రాష్ట్రానికి ప్రత్యే హోదాతోకూడిన ఆర్టికల్ 370 రద్దు చేయడం వల్ల లోయలో హింస అంతం కాలేదని, అక్కడ ఇప్పటికీ హిందువులు టార్గెట్ అవుతున్నారని పేర్కొన్నారు. రాజ్యాంగంలోని వివాదాస్పద నిబంధనను 2019లో ఎత్తివేసిన తర్వాత భారతీయ జనతాపార్టీ (బిజెపి) రాజకీయ పండుగను జరుపుకున్నదన్నారు. కానీ హిందువులను దిక్కుతోచని స్థితిలోకి నెట్టివేశారని ప్రస్తుత ప్రతిపక్షపార్టీ ఒకప్పటి మిత్రపక్షంపై ఆరోపించింది. 2019 ఆగష్టు 5 నుంచి ఇప్పటివరకు 197మంది భద్రతా సిబ్బంది, 135 మంది పౌరులు, 700మంది ఉగ్రవాదులు జమ్ముకశ్మీర్‌లో హతమయ్యారని 'సామ్నా' సంపాదకీయం ఆరోపించింది. మంగళవారం జమ్ముకశ్మీర్‌లోని ప్రసిద్ధ పర్యాటక ప్రాంతమైన పహల్గామ్‌లో ఉగ్రవాదులు జరిపిన దాడిలో 26మందిని కాల్చిచంపారు. వీరిలో వివిధ రాష్ట్రాలకు చెందిన పర్యాటకులే అధిక సంఖ్యలో ఉన్నవిషయం తెలిసిందే. జేమ్స్‌బాండ్‌గా కీర్తిస్తున్న జాతీయ భద్రతా సలహాదారు అజిత్‌దోవల్ ఎక్కడున్నాడని సామ్నా ప్రశ్నించింది. 2019లో పుల్వామా దాడి తర్వాత పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడి ఇంటెలిజెన్స్ సంస్థల వైఫల్యం కాదా? 'అని సంపాదకీయం ఆశ్చర్యం వ్యక్తం చేసింది.




# 'అబీర్ గులాల్' సినిమా భారత్‌లో బ్యాన్

పాకిస్థాన్ నటుడు ఫవాద్ ఖాన్ హీరోగా నటించిన సినిమా 'అబీర్ గులాల్'. వాణీ కపూర్ హీరోయిన్. పాకిస్థాన్ నటుడి సినిమా కావడంతో.. ఈ మూవీ ప్రకటన వెలువడిన క్షణం నుంచే బాయ్‌కాట్ చేయాలంటూ నెట్టింట వ్యతిరేకత మొదలైంది. పహల్గాం ఉగ్రదాడి పరిణామాల నేపథ్యంలో ఈ సినిమాని బ్యాన్ చేస్తున్నట్టు అధికారిక వర్గాలు వెల్లడించినట్టు జాతీయ మీడియా పేర్కొంది. మే 9న విడుదల చేస్తున్నట్టు చిత్ర బృందం ప్రకటించిన సంగతి తెలిసిందే. మరో వైపు, యూట్యూబ్ (ఇండియా)లో ఈ సినిమా పాటలను తొలగించారు. ఈ విషయంపై మేకర్స్ స్పందించలేదు. ఉగ్రదాడిపై స్పందించకుండా.. అదే రోజు సోషల్ మీడియా వేదికగా సినిమాని ప్రమోట్ చేశారంటూ వాణీ కపూర్‌పై విమర్శలు వెల్లువెత్తాయి. పాకిస్థాన్ నటులను ప్రోత్సహిస్తున్నారంటూ బాలీవుడ్ పైనా కొందరు ట్రోల్స్ చేస్తున్నారు. రొమాంటిక్ కామెడీ నేపథ్యంతో ఆర్తి ఎస్. బగ్గీ 'అబీర్ గులాల్'ను తెరకెక్కించారు













Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad - 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com